www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 69 | మంగళవారం | 29 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

20 ఏళ్లు



డేరా బాబా గుర్మీత్ సింగ్‌కు శిక్ష ప్రకటించిన సిబిఐ కోర్టు

- రెండు అత్యాచార కేసుల్లో పదేసి సంవత్సరాల శిక్షలు ఒకదాని తరువాత ఒకటి అనుభవించాలని స్పష్టీకరణ
- రూ.30 లక్షల జరిమానాలో బాధిత మహిళలిద్దరికీ రూ.14 లక్షల వంతున చెల్లింపు
- తీర్పు తరువాత స్థాణువై కోర్టులోనే చాలాసేపు కదలకుండా నిలిచిపోయిన బాబా
- బలవంతంగా జైలుకు తరలించిన పోలీసులు

రోహ్‌తక్: ఇద్దరు యువతులపై అత్యాచారం కేసులకు సంబంధించి డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. సిబిఐ న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్ సోమవారం అసాధారణ రీతిలో జరిగిన భద్రతా ఏర్పాట్ల మధ్య శిక్షను ఖరారు చేశారు. ఒక్కో అత్యాచార నేరానికి కలిపి మొత్తం ఇరవై సంవత్సరాల జైలుశిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. ఈ ఘటనలకు సంబంధించి గుర్మీత్ దోషిగా ఖరారు కావడంతో శిక్ష స్థాయిని ఇప్పుడు వెలువరించారు. అత్యాచార ఘటనలు 2002 ప్రాంతంలో జరిగాయి. డేరా ఆశ్రమంలో నివసించే సాధ్వీలపై గుర్మీత్ తన ఆంతరంగిక మందిరంలో అత్యాచారానికి పాల్పడ్డట్లు వెల్లడైంది. న్యాయమూర్తి వెలువరించిన తీర్పుల గురించి ఆ తరువాత డిఫెన్స్ లాయర్ ఎస్‌కె గార్గ్ నర్వానా తెలియచేశారు. శాంతి భద్రతల నేపథ్యంలో జైలులోనే ఓ గదిని ప్రత్యేకంగా న్యాయస్థానంగా మార్చి, జైలు వరకూ ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన న్యాయమూర్తి ఈ తీర్పును ప్రకటించారు. రెండు నేరాలకు సంబంధించిన 20 ఏళ్ల కఠిన కారాగారశిక్షను, గుర్మీత్ సాధారణ ఖైదీగా అనుభవించాల్సి ఉంటుంది. లక్షలాది అభిమానుల బలం, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు తరువాయి 6లో

డోక్లాం వివాదం సుఖాంతం

- బలగాల ఉపసంహరణకు భారత్–చైనా అంగీకారం
- ఏకపక్షం కాదు, రెండు వైపులా : భారత్



న్యూఢిల్లీ/బీజింగ్: భారత్, చైనా మధ్య రగులుకుంటూ వస్తున్న డోక్లాం వివాదానికి తెరపడింది. డోక్లాం నుంచి సరిహద్దు భద్రతా బలగాలను ఉపసంహరించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. సాధ్యమైనంత తొందరగా ఈ ఉపసంహరణ ప్రక్రియను ముగించాలని ఇరుదేశాలు నిర్ణయించడం ఇరుగుపొరుగు దేశాల మధ్య శాంతిస్థాపనకు దారితీసింది. చైనాలో బ్రిక్స్ సదస్సుకు వారం రోజుల ముందు డోక్లాం ప్రతిష్టంభనకు పరిష్కారం దక్కింది. బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. ఈ తరుణంలోనే అత్యంత కీలకమైన దౌత్యపురోగతి చోటు చేసుకుంది. ఘర్షణలు, రాళ్లు రువ్వుకునే స్థాయి వరకూ సాగిన డోక్లాం వివాదం మరింత జటిలం కాక ముందే దీనికి పరిష్కారమార్గం దక్కడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సైనిక దళాల ఉపసంహరణకు తీసుకున్న నిర్ణయం గురించి భారత విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది. దౌత్యపరమైన సంప్రదింపులతో తరువాయి 6లో

నంద్యాలలో టిడిపి

బావనలో ఆప్, పనాజి, వాల్‌పోయ్‌లో బిజెపి

పాలకపక్షాల ఉప విజయాలు



బ్రహ్మానందరెడ్డి



రామ్ చందర్



పారికర్



విశ్వజిత్ రాణె

పనాజి/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈనెల 23న జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, గోవాలోని పనాజి, వాల్‌పోయ్, ఢిల్లీలోని బావన నియోజకవర్గాల్లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు చెందిన అభ్యర్థులే విజయం తరువాయి 6లో



కొత్త సిజె జస్టిస్ దీపక్ మిశ్రా పదవీ స్వీకారం

సుప్రీంకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి కోవింద్ 10



ఉద్యోగుల విభజన కమిటీ భేటీ

- 1302 మంది సిబ్బందిని రెండు రాష్ట్రాల మధ్య విభజించే విషయంపై సాగిన చర్చ
- ముగిసిన 55,870 మంది విభజన ప్రక్రియ


మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రాష్ట్రస్థాయి ఉద్యోగుల విభజన సమస్యలపై ఆడ్వయిజరీ కమిటీ సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) కార్యదర్శి అజయ్ మిట్టల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ, ఎపి రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఎస్‌పి.సింగ్, దినేష్‌కుమార్ పాల్గొన్నారు. డిఒపిటి సంయుక్త కార్యదర్శి కింబోంగ్ కిప్‌జెన్, ఎపి జిఎడి (రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ విభాగం) ముఖ్య కార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి, తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు హాజరయ్యారు. ప్రధానంగా 1302 మంది ఉద్యోగుల విభజనపై చర్చ జరిగింది. కేవలం 9 మంది ఉద్యోగుల కేటాయింపుపై స్పష్టత వచ్చింది. 536 డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, 683 నాన్ క్యాడర్ ఎస్‌పి, డిఎస్‌పిలు, 62 ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు, వైద్య, ఆరోగ్య శాఖలో 13 మంది, తరువాయి 6లో

గొర్రెల గోల్‌మాల్

- బీమా వర్తింపులో నిర్లక్ష్యం
- చనిపోయిన 6 వేల పెచిలుకు గొర్రెలకు పరిహారం అందని స్థితి
- పంపిణీ చేసినవే ఇతర రాష్ట్రాల్లో మళ్లీ ప్రత్యక్షం



మన తెలంగాణ/ హైదరాబాద్ : గొర్రెల అభివృద్ధి పథకం కింద పంపిణీ చేసిన గొర్రెలు చనిపోతే యజమానికి ప్రభుత్వం ప్రకటించినట్లుగా బీమా పరిహారం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన గొర్రెలకు నియమ, నిబంధనలకు అనుగుణంగా బీమా చేయకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా రవాణాలో, మన రాష్ట్రానికి వచ్చిన తరువాత చనిపోయిన గొర్రెలకు బీమా పరిహారం అందని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి గొర్రెలు కొనగానే రవాణాకు ముందే బీమా చేయాలనే నిబంధన ఉంది. దీని ద్వారా రవాణా సమయంలో గొర్రె చనిపోయినా బీమా వర్తిస్తుంది. ఇందుకుగాను దాదాపు లక్ష యూనిట్లకు గొర్రెలు, మేకల ఫెడరేషన్ రెండు నెలల క్రితమే బీమా ప్రీమియం కింద రూ. 25 కోట్లు నేషనల్ ఇన్సూరెన్సు కంపెనీకి చెల్లించింది. ఇందులో ఒక్క యూనిట్‌కు రూ. 2515 చొప్పున కంపెనీకి చెల్లిస్తున్నారు. అందులోనే లబ్దిదారుని వాటా కూడా కలిపి ఉంది. ఇప్పటి వరకు అధికార యంత్రాగం కేవలం ఎన్ని వందల గొర్రెలు కొంటున్నామనే దానిపైనే దృష్టి పెట్టి, బీమాను నిర్లక్ష్యం చేసింది. దీంతో రాష్ట్ర తరువాయి 6లో



సంవత్సరాంతానికి కొత్త వెయ్యి నోటు

- మరిన్ని సెక్యూరిటీ ఫీచర్లతో డిసెంబర్ నాటికి వెలువడనున్నట్లు ఆర్‌బిఐ ప్రకటన

9



ప్రజల ఆశాజ్యోతులు మా పథకాలు

10



- జన్‌ధన్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ
- మిలియన్ల మంది ఆశలకు రెక్కలు తొడిగినట్లు ప్రకటన

కుంచెపోటు



ఇన్నాళ్లూ భక్తులకు ముక్తిమార్గం చూపించే వాడు, ఇప్పుడు తనకు విముక్తి మార్గం చూపించమంటున్నాడు!

కమలంపై కారు గేమ్!

- రాష్ట్రంలో బలపడాలని చూస్తున్న బిజెపిని ఇరుకున పెడుతున్న సిఎం
- కమలం ముందడుగు వేయాలనుకున్నప్పుడల్లా ప్రధానిని పొగడ్తలలో ముంచెత్తుతూ ముందరకాళ్ల బంధం
- సన్మానాస్త్రాల ప్రయోగం





మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణలో ఎలాగైనా బలపడాలని ఉవ్విళ్ళూరుతున్న బిజెపిని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముప్పుతిప్పలు పెడుతున్నారా? కెసిఆర్ వ్యూహాత్మక ఎత్తుగడలకు బిజెపి పెద్దలు బిత్తర పోతున్నారా? కెసిఆర్ చాణక్యం తెలంగాణ బిజెపికి ముందు నుయ్యి, వెనక గొయ్యి పరిస్థితిని తీసుకొచ్చిందా? అంటే రాజకీయ వర్గాలలో అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణలో బిజెపి నాయకత్వానికి అసలు సమస్య సిఎం కెసిఆర్ తీరే. ఆయన వైఖరి కారణంగా ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో బిజెపి ఉంది. సర్కారు వైఫల్యంపై ఏదైనా ఆందోళనకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకునేలోగా కెసిఆర్ ప్రధాని నరేంద్రమోడీని ఆకాశానికెత్తుతూ ప్రకటన గుప్పిస్తున్నారు. లేదంటే బిజెపి నేతలకు సన్మానాలు వంటివి తరువాయి 6లో

తమిళనాట తెరలేచిన మరో ఆట

- శశికళ, దినకరన్‌లను బహిష్కరించిన అన్నాడిఎంకె
- పార్టీ సర్వసభ్య సమావేశానికి 40 మంది ఎంఎల్‌ఎలు డుమ్మా
- సిఎం పళని, డిప్యూటీ సిఎం పన్నీర్‌ల గుండెల్లో గుబులు


చెన్నై : తమిళనాడు అధికార అన్నాడిఎంకె పార్టీ నుంచి శశికళను, ఆమె మేనల్లుడు దినకరన్‌ను బహిష్కరించారు. జయలలిత తరువాత పార్టీ ఆధిపత్యం తనదే అనుకుంటున్న జైలులో ఉన్న శశికళకు ఈ పరిణామం పిడుగుపాటుగా మారింది. పార్టీలో సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేయాలనుకుంటున్న మేనల్లుడు దినకరన్‌కు పూర్తి స్థాయి చెక్ ఇచ్చే క్రమంలో అధికార అన్నాడిఎంకె పార్టీ కీలక సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో శశికళను, దినకరన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 10వ తేదీనే దినకరన్‌ను పార్టీ నుంచి బర్తరఫ్ చేశారని, ఇప్పుడు శశికళను, దినకరన్‌ను పార్టీ నుంచి తరువాయి 6లో

నిరుద్యోగులు చనిపోతున్నా డిఎస్‌సి వేయరా?



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : నిరుద్యోగులు ఒక వైపు చనిపోతుంటే డిఎస్సీ వేయకుండా తాత్సారం చేయవద్దని, టీచర్ పోస్టులు 8972 ఖాళీలు కాదని, 40 వేల ఖాళీలున్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని, సాకులు చెబుతూ టీచర్ పోస్టుల భర్తీని వాయిదా వేయవద్దని కోరుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాసారు. డిఎస్‌సి జాప్యం జరుగుతుందనే కారణంతో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మన్నేపు రామకృష్ణ ఆదివారం చనిపోయారని, అంతకుముందు మరో నలుగురు చనిపోయారని లేఖలో తెలిపారు. కానీ ప్రభుత్వం ఏవేవో కుంటి సాకులతో ఇంకా జాప్యం చేస్తుందని, ఇప్పటికైనా డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఆత్మహత్యలు ఆపాలని సీఎం కేసీఆర్‌ను కృష్ణయ్య కోరారు. సుప్రీంకోర్టు ఈ వచ్చే సెప్టెంబర 12 లోగా టీచర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందని, కానీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయకుండా సాకులు వెతుకుతుందని కృష్ణయ్య తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని 40 వేల టీచర్ పోస్లు భర్తీకి వెంటనే నోటీఫికేషన జారీ చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కేసీఆర్‌ను కృష్ణయ్య కోరారు.

హే 'కృష్ణా' సమన్యాయమేదీ?



- కృష్ణ బోర్డుకు పోలవరం ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించిన కేంద్రం
- ఆందోళన చెందుతున్న తెలంగాణ నీటిపారుదలశాఖ నిపుణులు

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బోర్డు అధికారులకు పోలవరం బాధ్యతలు ఇవ్వడంతో సమన్యాయ సూత్రం అటకెక్కుతోందా..? కృష్ణా బోర్డులో పరోక్షంగా తమ మాట నెగ్గించుకోడానికి బోర్డు అధికారులకే పోలవరం బాధ్యతలు ఇచ్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పావులు కదిపిందా..? పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న పోలవరం ప్రాజెక్టు బాధ్యతల కారణంగా తెలంగాణకు కృష్ణా నీటి విషయంలో అన్యాయం జరిగే అవకాశం ఉందా..? అంటే అవుననే సమాధానాలు నిపుణుల నుంచి వస్తున్నాయి. కృష్ణా బోర్డు చైర్మన్ ఎస్‌కె శ్రీవాస్తవకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర జలవనరుల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శిగా ఉన్న ఆర్‌కె గుప్తాను డిల్లీలోని కేంద్ర జలసంఘం ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఇదేవిధంగా హైదరాబాద్ కేంద్రంగా కృష్ణా, గోదావరి బేసిన్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌గా ఆర్‌కె జైన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో కృష్ణా బోర్డు కార్యదర్శిగా ఉన్న ఆర్‌కె గుప్తా ఆంధ్రప్రదేశ్‌పై పక్షపాతం చూపించారన్న ఆరోపణలు, రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదుల నేపధ్యంలో బదిలీ చేశారు. ఆ సమయంలో గుప్తాకు ఉన్న పోలవరం అథారిటీ బాధ్యతలు అలాగే కొనసాగించారు. ఇప్పుడు అదే గుప్తాను పోలవరం బాధ్యతల నుంచి తప్పిస్తూ మళ్లీ కృష్ణా బోర్డు బాధ్యులకే అప్పగించడం తెలంగాణ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. పోలవరం నుంచి మళ్లించిన నీటిలో తెలంగాణ వాటా ఎంతన్న దానిపై తీవ్రంగా చర్చ జరుగుతున్న తరుణంలో బోర్డు అధికారులకు ఆ పనుల పర్యవేక్షణ అప్పగించారు. గతంలో గుప్తాను, ఇప్పుడు శ్రీవాస్తవకు ఆ బాధ్యతలు అప్పగించారు. పోలవరం నిర్మాణం వేగంగా జరగాలంటే, ఆంధ్రప్రదేశ్ సోయితో పని చేయాలి. కానీ ఆంధ్రప్రదేశ్ సోయిని కృష్ణా బోర్డు పనితీరులో కూడా చొప్పిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సమన్యాయం చేస్తూ, అనాదిగా నీటిపారుదలరంగంలో దగా చేయబడ్డ తెలంగాణపై కొంత ప్రేమ చూపించాలి. ఇక్కడ కృష్ణా బోర్డు అధికారులకు పోలవరం బాధ్యతలు వచ్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాధ్యులే లాబీయింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు సంఘటనలు దీన్ని బలపరిచేలా చేస్తున్నాయి. గత రెండు నెలల్లో కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ మూడు, నాలుగు సార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రహస్యంగా కలిసారు. ఒకసారి ప్రత్యేకంగా అమరావతిలో బోర్డు చైర్మన్ ఒక్కరే వెళ్లి చంద్రబాబును కలిసి, మాట్లాడారు. కృష్ణా బోర్డు సమావేశం తర్వాత మంత్రి దేవినేనిని రహస్యంగా కలిసారు. బోర్డు అధికారులు, సిబ్బంది అంతా హోటల్‌లో, దుర్గ దర్శనానికి వెళ్లగా, చైర్మన్ ఒక్కరే మంత్రి వద్దకు వెళ్లి, అరగంట పాటు చర్చించారు. ఇది జరిగిన నాలుగైదు రోజులకే పోలవరం అథారిటీ సభ్య కార్యదర్శిగా శ్రీవాస్తవకు అదనపు బాధ్యతలు ఇస్తూ కేంద్రం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

తెలంగాణ అధికారులకు వార్నింగ్‌లు?

కృష్ణా బోర్డులో పనిచేసే తెలంగాణ సిబ్బందిపై బోర్డు చైర్మన్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే తెలంగాణ సిబ్బందిని అందరినీ తన ఛాంబర్‌కు పిలిచి, మెమోలు ఇస్తానని, క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తానని అకారణంగా బెదిరించారని సమాచారం. దీంతో పాటు పట్టిసీమ, పురుషోత్తమ పట్నం, పోలవరంలో తెలంగాణ వాటా, వంటి అంశాలపై ఏకపక్షంగా, రహస్యంగా ఒక నివేదికను తయారు చేసి ఎకె బజాజ్ కమిటీకి అందజేసినట్లు తెలిసింది. ఇందుకోసం శ్రీవాస్తవ ఒక్కరే డిల్లీకి బయలుదేరి వెళ్లారు. దీనిపై బోర్డు సిబ్బందికి సమాచారమే లేదు. సమైక్య పాలనలో చెరువులే మాయమయ్యాయని, ఉన్న చెరువుల్లో నీళ్లు రాక, కరవుతో ఉన్నామన్న తెలంగాణ తండ్లాటను పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్ మేలు కోసమే మైనర్ ఇరిగేషన్ లెక్కలపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని ఇప్పటికే శ్రీవాస్తవపై ఆరోపణలు వస్తుండగా, తాజాగా ఆంధ్ర ఆర్థిక, సామాజిక ప్రయోజనాలతో ముడిపడివున్న పోలవరంలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో కృష్ణాబోర్డుకు సంబంధించి భవిష్యత్తులో తెలంగాణ ప్రయోజనాలు, సమన్యాయ సూత్రాలన్నీ అటకెక్కే అవకాశం ఉందని నిపుణులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని, పక్షపాతరహితంగా పనిచేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముంది.

తెలంగాణలోనూ 'నంద్యాల' ప్రభావం

మన తెలంగాణ/హైదరాబాద్ : నంద్యాల ఉప ఎన్నికల గెలుపు ప్రభావం తెలంగాణలోనూ ఉంటుందని టిడిపి ప్రధాన కార్యదర్శి ఎం. అమర్‌నాథ్ బాబు అన్నారు. డబ్బుతో, ప్రశాంత్ కిషోర్ లాంటి వాళ్లతో ఎన్నికలలో గెలవలేరని, ప్రజలు మరోసారి ఏకపక్ష తీర్పు ద్వారా తేల్చి చెప్పారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలలో టిడిపి ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం టపాసులు కాల్చి సంబురాలను పార్టీ కార్యకర్తలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల తోనే నంద్యాల ఓటర్లు టిడిపి పట్టం కట్టారని కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జి. బుచ్చిలింగం అన్నారు. టిడిపి నేతలు రమావత్ లక్ష్మణ్ నాయక్, బి.ఎన్.రెడ్డి, తాజుద్దీన్, అజ్మీరా రాజునాయక్, పి.సాయి బాబా, దీపక్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్‌గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.

భూ సర్వే భూటకం: కృష్ణసాగర్‌రావు

మన తెలంగాణ/హైదరాబాద్ : సమస్యల నుంచి ఎప్పటికప్పుడు ప్రజల దృష్టిని మళ్ళించడంలో సిద్ధహస్తుడైన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తాజాగా భూ సర్వే పేరుతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సర్వే ద్వారా ప్రభుత్వం సాధించాలనుకునే లక్ష్యం ఏమిటో స్పష్టం చేయక పోవడం చూస్తుంటే ఇది కూడా సకల జనుల సర్వే మాదిరిగా మిగిలి పోతుందేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

23, 24 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్‌లో సెప్టెంబర్ 23, 24 తేదీలలో తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ హమాలీస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నారు. సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్.కె.బాబుమియా అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ, సివిల్ సప్లయీస్ కార్పోరేషన్‌లో పని చేసే హమాలీలు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

గత 11 సంవత్సరాలుగా ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేస్తూనే ఇయస్ఐ చట్టాన్ని వారికి అమలు చేయడం లేదన్నారు. ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బియ్యా నికి సంబంధించిన సబ్సిడీలను బ్యాంకు అకౌంట్‌లో వేసే ఆలోచ నను ఉపసంహరించుకోవాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన హమాలీలకు నెలకు రూ.3 వేల పెన్షన్ చెల్లించాలని, దహన సంస్కారాలకు చెల్లిస్తున్న రూ.10 వేలను రూ.20 వేలకు పెంచాల ని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయ కులు ఎలమకంటి శ్రీనివాస్, గొరిగే నర్సింహ్మా, దేశబోయిన యాదయ్యా, వంకాయల పాటి జకరయ్యా, ఉపేందర్, పరుశరాం, సాంబన్న, మహబూబ్, సోమయ్య, కొమరయ్య, రాంబాబు ప్రసంగించారు.

70కోట్ల చేప పిల్లల పంపిణీ

- రేపు సింగూరు జలాశయం వద్ద రెండో విడత కార్యక్రమం ప్రారంభం
- ఏర్పాట్లను పూర్తి చేసిన యంత్రాంగం : తలసాని

మన తెలంగాణ/హైదరాబాద్: రెండో విడత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ఈ నెల 30 నుంచి సింగూరు జలాశయం నుంచి ప్రారంభి స్తున్నట్లు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సచివాలయంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.52 కోట్ల వ్యయంతో దాదాపు 70 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 77 జలాశయాలు, 4647 మత్స్యశాఖ చెరువులు, 20391 గ్రామ పంచాయతీ కుంటలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ, గ్రామస్థాయి అధికారులను భాగస్వాములను చేస్తామన్నారు. జిల్లాల్లోని జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలోని కొనుగోలు కమిటీల ద్వారా ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు పిలిచి చేప పిల్లల కొనుగోలు ధరలు నిర్ణయించామని, చేప పిల్లలను లెక్కించడానికి బెల్జియం దేశం నుంచి యంత్రాన్ని కొనుగోలు చేశామన్నారు. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో చేపలు లభ్యమయ్యే అవకాశాలు ఏర్పడతాయన్నారు. 6 నుంచి 8 మాసాల వరకు నీరు నిల్వ ఉండే చెరువులకు చేప పిల్లల పంపిణీలో మొదటి ప్రాధాన్యత ఇచ్చామని, వీటిలో 35 నుంచి 40 మిల్లీమీటర్ల పొడవున్న కట్ల, రోహు, బంగారు తీగ చేప పిల్లలను నిర్దేశిత ప్రాంతాల నుంచి సొసైటీల ఆధీనంలోని చెరువుల వద్దకు ఆక్సిజన్ నింపిన పాలిథిన్ బ్యాగులలో సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. ఏడాది పొడవునా నీళ్లుండే చెరువుల్లో, జలాశయాల్లో 80 నుంచి 100 మిల్లీమీటర్ల సైజు గల కట్ల, రోహు, మ్రిగా చేప పిల్లలను నేరుగా చెరువు వద్దకే పంపిణీ చేస్తామన్నారు. పంపిణీ చేయబడ్డ చేప పిల్లలను నాణ్యతా ప్రమాణాలు, పరిమాణం, వివిధ రకాలుగా తనిఖీ చేసిన తర్వాతనే లబ్ధిదారుల సమక్షంలో చేప పిల్లలను వదులుతామన్నారు. లబ్ధిదారులు చివరి వరకు చెరువు దగ్గరే ఉండాలని, అనుమానం వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. 5 వేల హెక్టార్ల నీటి విస్తీర్ణం కన్నా ఎక్కువగా ఉన్న జలాశయాల్లో మొదటి విడతగా 60 శాతం చేప పిల్లను ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో, మిగిలిన 40 శాతాన్ని రెండో విడతగా అక్టోబరు, నవంబరు మాసాల్లో తూకం పద్ధతిలో లెక్కించి, విడుదల చేస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.22 కోట్లు వెచ్చించి 27 కోట్ల చేప పిల్లలను జలాశయాలు, చెరువుల్లో వదిలామన్నారు. సుమారుగా 4200 మత్య సహకార సంఘాల్లోని 3 లక్షల మందికి లబ్ధి కలిగిందన్నారు. దీంతో పాటు మత్స్యశాఖ బలోపేతానికి ప్రభుత్వం 214 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపిందని, వెంటనే నియామకపు చర్యలు చేపట్టడం జరుగుతుందని మంత్రి శ్రీనివాస యాదవ్ వివరించారు. పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ చందా, గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ రాజయ్యా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చెన్నమనేని పౌరసత్వంపై ఆరు వారాల్లో విచారణ

- కేంద్ర హోంశాఖకు సుప్రీం ఆదేశం

మన తెలంగాణ/న్యూఢిల్లీ: వేములవాడ టిఆర్‌ఎస్ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్ బాబు భారత దేశ పౌరసత్వాన్ని రద్దు చెయ్యాలంటూ వేములవాడ నుండి పోటీ చేసిన బిజెపి అభ్యర్థి ఆది శ్రీనివాస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఆరు వారాలల్లో ఈ కేసును పూర్తి చేయాలని కేంద్ర హోంశాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టులో విచారణ ముగిసిన అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... రమేష్ బాబు 1993లో భారత దేశ పౌరసత్వాన్ని రద్దు చేసుకొని జర్మనీ దేశ పౌరసత్వాన్ని పొందారని, తిరిగి 2009లో భారత దేశ పౌరసత్వాన్ని పొందారని ఆరోపించారు. తప్పకుండా ఈ కేసులో తనకు న్యాయం జరుగుతుందని ఆది శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ వేసిన పిటిషన్ పై గతంలో విచారించిన జస్టిస్ కురియన్, జస్టిస్ నారిమన్‌లతో కూడిన ధర్మాసనం, ద్వంద్వ పౌరసత్వం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై షరతులతో కూడిన స్టే ఇచ్చింది. అయితే, ఆ స్టే 2009 ఎన్నికల్లో ఎంపికైన కాలానికే పరిమితమని అభిప్రాయపడిన ధర్మాసనం.. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత రమేశ్ ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని సమర్థిస్తూ కేసు కొట్టివేసింది. కాగా, ద్వంద్వ పౌరసత్వానికి సంబంధించిన పిటీషన్ పై విచారణ మాత్రం కొనసాగుతుందని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

సమ్మె తాత్కాలికంగా వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ నెల 29, 30వ తేదీల్లో తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ జెఎసి సోమవారం ప్రకటించింది. కార్మికుల సమస్యలపై కార్మిక సంఘాల జెఎసి నేతలతో ఆ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం చర్చలు జరిపారు. సమస్యలను పరిష్కారిస్తామని నవీన్ మిట్టల్ హామీనివ్వడంతో జెఎసి నేత ఏసురత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 7న సమావేశం కానున్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం!

- సురవరం సుధాకర్‌రెడ్డి
- విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించిన వామ పక్షాలు, కాంగ్రెస్ నాయకులు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో : గత పాలకులకంటే నేటి ప్రభుత్వాలు మరింత నిరంకుశత్వంగా పాలన కొనసాగిస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టడానికి వామపక్షాలు మరింత శక్తివంతమై, ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 ఏళ్ళక్రితం కాల్పుల్లో చనిపోయిన విద్యుత్ ఉద్యమ అమరవీరులకు వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో ముగ్గురు విద్యుత్ అమరవీరులు బాలస్వామి, విష్ణువర్ధన్, రామకృష్ణ స్మృత్యర్థం ఏర్పాటైన స్థూపం వద్ద వారు శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ ప్రధాన కార్యదర్శి, సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కె.గోవర్ధన్, పి.సంధ్య,(సిపిఐ–ఎంఎల్ న్యూమోక్రసీ), ఝాన్సీ (న్యూడెమోక్రసీ), జానకీరాములు (ఆర్ఎస్‌పి), మురహరి (ఎస్‌యుసిఐ(సి), పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, ఎం.ఆదిరెడ్డి, ఇ.టి. నరసింహా, పుస్తకాల నర్సింగ్‌రావు, (సిపిఐ), డి.జి. నర్సింహారావు, చెరుపల్లి సీతారాములు(సిపిఐ(ఎం)లున్నారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ బషీర్‌బాగ్ సాక్షిగా నాడు జరిగిన పోరాటం పెంచిన విద్యుత్ ఛార్జీలపై నిరసన మాత్రమే కాదని, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగిన మహా ఉద్యమమన్నారు. బి.వి.రాఘువులు మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజావ్యతి రేక విధానాలను కమ్యూ నిస్టులు ఎప్పుడూ తిప్పికొడుతూనే ఉంటారన్నారు. చాడవెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచాలంటే నేటికి ప్రభుత్వాలు జంకుతున్నాయంటే అందుకు నాటి బలిదానాల ఫలితమేనన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకొని నివాళ్ళర్పించారు.ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించే పాలకులకు బషీర్‌బాగ్ ఉద్యమం ఓ గుణపాఠమని, దానిని నుంచి పాఠాలు నేర్చుకోని ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కుమార్‌రావు, వినోద్‌రెడ్డి, నిరంజన్, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.







భూ సర్వేకు అభ్యంతరం లేదు.. సర్వే పద్ధతికే వ్యతిరేకం : షబ్బీర్

మన తెలంగాణ/హైదరాబాద్: త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న భూమి సర్వే టిఆర్ఎస్ సొంత వ్యవహారం కాదని, దీనిపై వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మహ్మద్ షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కేవలం అధికార పార్టీ ప్రజాప్రతినిధులనే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం మంచి పద్ధతి కాదని, దీనిపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. శాసనసభ మీడియా హాల్‌లో ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్ రెడ్డితో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సర్వేకు కాంగ్రెస్‌కు అభ్యంతరం లేదని, టిఆర్ఎస్ ప్రభుత్వం చేసే సర్వే పద్ధతికే తాము వ్యతిరేకమన్నారు. భూ సర్వేపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పోతుందని ఆరోపించారు. భూ సర్వేను సెప్టెంబర్ 10లోపు పూర్తి చేయడం అసాధ్యమన్నారు. మొదట హడావుడి చేయడం, ఆ తర్వాత వాటిని మూసివేయడం కెసిఆర్‌కు అలవాటేనని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎలాంటి సూచనలు చేసినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. సర్వేలో అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్‌ఎలు ఉంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. కెసిఆర్ చెబుతున్న సర్వేలపై తమకు నమ్మకం లేదని, గతంలో సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఇప్పటి వరకు ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు.

పంటకు భగీరథ తంటాలు

- పైపులైన్ పనుల కోసం ఐదు సార్లు చెరువును తెంపారు
- 800ఎకరాల్లో సాగు నీరుకు సమస్యలు, రైతన్న గగ్గోలు





మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి: మిషన్ భగీరథ పనుల కోసం చెరువు నీటిని పదేపదే అధికారులు వదిలివేయడంతో ప్రత్యక్షంగా 500 ఎకరాలు, పరోక్షంగా మరో 300 ఎకరాల సాగుకు ముప్పు ఏర్పడింది. చెరువును ఆధారంగా చేసుకొని సాగుకు సిద్ధపడ్డ రైతుల పరిస్థితి ఇప్పుడు దయనీయంగా మారింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల పరిధిలోని చిల్లేపల్లి రైతుల వ్యధ ఇది. సుమారు 170 ఎకరాల్లో చిల్లేపల్లి చెరువు విస్తరించివుంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, కాలువలు ప్రవహిస్తుండంతో చెరువు నిండుతోంది. దీంతో చుట్టుపక్కల 500 ఎకరాలను రైతులు సాగుచేస్తున్నారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉండడతో బోరు బావుల్లో కూడా జలాలు మరింత పెరిగి రావడంతో అదనంగా 300 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. తొలుత కురిసిన వర్షాలతోనే ఈ సీజన్ ప్రారంభంలోనే చెరువు నిండింది. దీంతో రైతులు వరి నాట్లు వేశారు. కాగా చెరువు చుట్టూ మిషన్ భగీరథ పైపులైన్ల పనులు సాగుతున్నాయి. చెరువులో నీరువుండటంతో భగీరథ పనులకు ఆటంకం కలుగుతోందని అధికారులు అలుగును పగులగొట్టేందుకు ప్రయత్నించగా గతంలో రైతులు అడ్డుకున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని చెరువు అలుగును త్రవ్వించి నీరును తీయించడంతో పొలాలకు నీరందలేదు. కొద్ది రోజులకు మళ్లీ వర్షాలు కురవడంతో చెరువుకు వస్తున్న వరదనీరు చూసి రైతులు అలుగుకు అడ్డుకట్టారు. తిరిగి అధికారులు దానిని తొలగించారు. ఇలా ఈ సీజన్‌లోనే చెరువు ఐదు సార్లు నిండగా ఐదు సార్లు అధికారులు తొలగించడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అసలే నీటికోసం అల్లాడుతున్న ఆయకట్టు రైతులు ఉన్న నీరు వృథాగా పోతుంటే గొల్లుమంటున్నారు. చింతకుంట్ల పాఠశాల నుండి చెరువు చుట్టూ పైపులైన్లు వేసే పనిని అధికారులు గత మూడు నెలల నుండి సాగిస్తుండగా వారానికి మూడు రోజుల మాత్రమే పని సాగిస్తున్నారని, ఆ పనులు పూర్తయ్యే సరికి మరో మూడు నాలుగు నెలలు పడుతుందని అప్పటిదాకా చెరువులో నీళ్ళు లేకుండా చేస్తే 800 ఎకరాల్లో పంట నష్టపోవడమే కాకుండా వ్యవసాయ కూలీలకు ఉపాది లేకుండా పోతోందని వాపోతున్నారు. సెప్టెంబర్ నెల దాటితే వర్షాలు కురవకుండా పోయి యాసంగి పంటలపై కూడా కోల్పోవాల్సివస్తుందని రైతులు వాపోతున్నారు. చెర్వువద్ద మిషన్ భగీరథ పనులు ఆలస్యంగా ప్రారంభించి నత్తనడకన కొనసాగిస్తూ సాగు భూములను బీడు భూములుగా మారుస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నేరేడుచర్ల పట్టణంలో ప్రధాన రోడ్డు మార్గం పక్కనుండి వెళ్ళాల్సిన భగీరథ పైపులైను మార్గాన్ని కొందరి ఆస్తులను కాపాడే ఉద్దేశంతో సుమారు మూడుకిలోమీటర్ల దూరం పెంచి పైపులు వేశారని, చింతకుంట్ల చెరువుకు మరో 150 అడుగులు వెనక్కి జరిపి పైపులైన్లు వేస్తే వందలమంది రైతులు, వ్యవసాయ కూలీలు వారి కుటుంబాలకు ఇంత ముప్పు ఉండేది కాదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని భగీరథ పైపులైన్ మార్గాన్ని మరో 150 అడుగుల దూరం జరిపితే ఆ పనులు సాఫీగా సాగడంతో పాటు, చెరువు నీటిని నిల్వ చేసి 800 ఎకరాల్లో పంటను కాపాడిన వారవుతారని రైతులు వేడుకుంటున్నారు.

భగీరథపై అధ్యయనానికి రాష్ట్రానికి మధ్యప్రదేశ్ బృందం

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులపై దేశంలోని పలు రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలు తమ అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపించాయి. తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జల్ నిగమ్ మర్యాదిత్ శాఖ ఇంజినీర్లు తెలంగాణకు వచ్చారు. మంగళవారం నుండి మూడు రోజుల పాటు వారు రాష్ట్రంలోని పలు ప్రాంతాలను పర్యటించనున్నారు. అంతకు ముందుగా ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు స్వరూపాన్ని తెలుసుకోనున్నారు.

సూక్ష్మ సేద్య పరికరాలపై 5 శాతం పన్నునే భరిస్తాం

మన తెలంగాణ/హైదరాబాద్: సూక్ష్మ సేద్యంపై పడుతున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) భారంతో గతంలో ఉన్న 5 శాతం వ్యాట్‌నే ప్రభుత్వం భరించనుంది. ఈ మేరకు వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారధి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూక్ష్మ సేద్యం పరికరాలపై ఇప్పుడు జిఎస్‌టి 18 శాతంగా అమలు చేస్తున్నారు. గతంలో ఇది ఇందులో 5 శాతం వ్యాట్‌గా ఉంది. దీనిని గరిష్టంగా రూ. 5 వేల వరకు ప్రభుత్వమే భరించింది. పెరిగిన జిఎస్‌టిలో అలాగే భరిస్తామని ఉత్తర్వులో పేర్కొన్నారు. కంపెనీలు 7% భరిస్తుందని, మిగతాది రైతులే కట్టుకోవాలని ఎల్. వెంకట్రామ్ రెడ్డి సోమవారం మన తెలంగాణకు తెలిపారు.



మిథానిలో రెండో దశకు శంకుస్థాపన

మన తెలంగాణ/హైదరాబాద్: మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిథాని)లో మూడు మీటర్ల ప్లేట్ మిల్, రెండో దశ ఆధునీకరణ పనులకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ శంకుస్థాపన చేశారు. కంచన్‌బాగ్‌లోని మిథానిని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిదశలో రూ.400 కోట్లతో పూర్తి చేసిన ఎఎఫ్ ఎల్ఆర్ఎఫ్ వి/విఒడి, ఫోర్జ్ ప్రెస్, రింగ్ రోల్ మిల్, ఇఎస్ఆర్, విఎఆర ఇబిఎం తదితరాల తొలి దశ ఆధునిక సౌకర్యాలను జాతికి అంతికమిచ్చారు. రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో ప్లేట్ మిల్, సోలార్ పవర్ ప్లాంట్, ఆర్మోంటింగ్ యూనిట్ టంగ్‌స్టన్ పవర్ ప్లాంట్, క్లోజ్‌డ్ డై ఫోర్జింగ్ అండ్ రీహీటింగ్ ఫర్నేస్‌లకు గాను రూ.1000 కోట్లను పెట్టుబడి పెట్టనున్నారు. మంత్రి మిథానిలో ప్రత్యేక మెల్టింగ్, ఫోర్జింగ్ సౌకర్యాలను పరిశీలిచారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మిథాని అభివృద్ధి చేస్తామన్నారు. అణు జలాంతర్గామి కోసం ప్రత్యేక స్టీల్ ఫోర్జింగ్, టి 72, టి 90 ట్యాంకుల కోసం బారెల్స్తో పాటు ధనుష్ బారెల్, పవర్ ప్లాంట్ రోటార్ ఫోర్జింగ్‌లను ఉత్పత్తి చేసేందుకు వ్యాక్యూమ్ డిగాస్సింగ్ (విడి), ఎలక్ట్రో స్లాగ్ రిఫైనింగ్ (ఇఎస్ఆర్)లతో కూడిన నూతన మెల్ట్ షాప్ అవసరముంది. మిథాని సిఎండి డాక్టర్ దినేశ్ కుమార్ లిఖి మాట్లాడుతూ, హర్యానా రోహ్‌తక్‌లో ఆర్మోజింగ్ యూనిట్ను, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో అల్యూమినియ్ అల్లోయ్ ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రక్షణ శాఖ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ ప్రవేశాల షెడ్యూల్

మన తెలంగాణ/హైదరాబాద్: ఎడ్‌సెట్ సర్టిఫికేట్ల పరిశీలనను సెప్టెంబరు 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి ఒక ప్రకటనలో పేర్కొంది. ఎడ్‌సెట్ ప్రవేశాల కమిటీ సోమవారం నాడు సమావేశమై షెడ్యూలును ఖరారు చేసింది. ఈ మేరకు ఆగస్టు 30న అధికారికంగా కౌన్సిలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనుండగా, సెప్టెంబరు 9 నుంచి 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. సమాచారంలో మార్పుచేర్పులకు సెప్టెంబరు 17వ తేదీన అవకాశం ఇవ్వగా, 20వ తేదీన సీట్ల కేటాయింపులు జరుగుతాయి. 25వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.


యాసంగి పంటల బీమా షెడ్యూల్

మన తెలంగాణ/హైదరాబాద్ : యాసంగి పంటలకు బీమా ప్రీమియం చెల్లింపు షెడ్యూల్‌ను రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ(ఎస్ఎల్‌సిసిఐ) నిర్ణయించింది. ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకంలో వరి, మక్కజొన్న, జొన్న, పెసలు, మినుములు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, మిరప, ఉల్లి, సెనగ పంటలతో పాటు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో మామిడి పంటలను నోటిఫై చేయాలని నిర్ణయించారు. ప్రీమియం చెల్లించాల్సిన గడువును శనగ పంటకు నవంబర్ 30 తేది, మొక్కజొన్న, మామిడికి డిసెంబర్ 15వ తేదీ, మిగతా పంటలకు డిసెంబర్ 31 గడువు తేదీ విధిస్తూ బీమా కంపెనీల నుంచి టెండర్లను ఆహ్వానించారు. సచివాలయంలో సోమవారం యాసంగి పంటల బీమాపై వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారధి ఎస్ఎల్‌సిసిఐ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యాసంటి పంటల బీమా అమలుపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. వానకాలం సీజన్‌లో పంటల బీమాలో ఉన్నట్లుగానే జిల్లాలను ఆరు క్లస్టర్‌లుగా విభజించారు. ఇందులో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలలో వేరుశనగ, ఆదిలాబాద్, గద్వాలలో శనగ, ఆసిఫాబాద్‌లో జొన్న పంటలకు మాత్రమే ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు చేయనున్నారు. మిగతా 25 జిల్లాలలో వరికి బీమా అమలు చేయనున్నారు. ఖచ్చితమైన సమాచారం కోసం క్రాప్ కటింగ్ ఎక్స్‌పర్‌మెంట్స్ యాప్‌ను వినియోగించాలని నిర్ణయించారు. మండలం యూనిట్‌గా చేసే బీమాలో విస్తీర్ణం 2 వేల నుంచి వెయ్యి హెక్టర్లకు తగ్గించారు. అలాగే ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ప్రీమియం చెల్లించిన రైతుల వివరాలను పొందుపర్చాలని బీమా కంపెనీలకు స్పష్టం చేశారు.

నియోజకవర్గాల అభివృద్ధికి రూ.105 కోట్లు విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎంఎల్ఎ, ఎంఎల్‌సి నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.105 కోట్లు విడుదల చేసింది. 2017, 18 సంవత్సరానికి గాను రెండవ త్రైమాసిక నిధుల క్రింద వీటిని విడుదల చేసినట్లు ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య సోమవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందులో ఎస్‌సి డెవలప్‌మెంట్ ఫండ్ రూ.16.22, ఎస్‌టి డెవలప్‌మెంట్ ఫండ్ రూ.9.53 కోట్లున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి రూ.75 లక్షల చొప్పున విడుదల చేయగా అందులో ఎస్‌సి డెవలప్‌మెంట్ క్రింద రూ.11,58,750. ఎస్‌టి డెవలప్‌మెంట్ ఫండ్ క్రింద రూ.6,81,000 కేటాయించారు. గవర్నర్ చేత నామినేట్ చేయబడ్డ, ఎంఎల్ఎల చేత ఎన్నుకోబడ్డ ఎంఎల్‌సిలకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.15 కోట్లు విడుదల చేసింది.

మండలి చైర్మన్, స్పీకర్‌తో మీడియా సలహా కమిటీ సమావేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : శాసనసభ మీడియా సలహా కమిటీ సోమవారం తొలిసారిగా సమావేశమైంది. శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారిలు ఈ సందర్భంగా మీడియా కమిటీ సభ్యులతో అసెంబ్లీలో జర్నలిస్టులకు ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. జర్నలిస్టుల సంక్షేమం, సౌకర్యాలకు సంబంధించిన సూచనలు చేస్తే, వాటిని అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తామని చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. కమిటీ తరచుగా సమావేశమవడం ద్వారా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ గతంలో శాసనసభ వైరుధ్యాలతో సాగేదని, తెలంగాణ ఏర్పడిన తరువాత వైవిధ్యంతో నడుస్తోందని తెలిపారు. దేశంలోనే అత్యుత్తమంగా సాగుతున్న చట్టసభల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. శాసనసభ కార్యదర్శి డాక్టర్ ఎస్.రాజా సదారామ్ మీడియాకు కల్పిస్తున్న సౌకర్యాలను, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించారు. తొలుత స్వామిగౌడ్, మధుసూదనాచారిలకు మీడియా సలహా కమిటీ తరుపున చైర్మన్ సూరజ్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. సమావేశంలో శాసనసభ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు సిఎం కెసిఆర్ సాయం

మన తెలంగాణ/హైదరాబాద్: కాలేయ మార్పిడి చేయాల్సిన అవసరం ఉన్న పేద బాలుడికి సిఎం కెసిఆర్ మానవతా హృద యంతో ముందు కొచ్చి ఆర్థిక సహాయం మంజూరు చేశారు. గజ్వేల్ పట్టణానికి చెందిన హనుమాన్ దాస్ కుమారుడైన దేవసాని శ్రీమాన్ (11 నెలలు) పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. వైద్య పరీక్షలు చేయించగా కాలేయానికి సంబంధించిన సమస్య తలెత్తిందని, కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారమని వైద్యులు చెప్పారు. దీంతో ఖర్చు భరించలేని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని పత్రికలలో వచ్చిన కథనాల ద్వారా సిఎం తెలుసుకున్నారు. వెంటనే సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డితో మాట్లాడారు. సిఎం ఆదేశం మేరకు కలెక్టర్ బాలుడి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలేయ మార్పిడికి సిఎం సహాయ నిధి నుంచి రూ. 25 లక్షలు మంజూరు చేసినట్లు వారికి చెప్పారు. దీనికి సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డి హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి తల్లిదండ్రులకు అందచేశారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా డాక్టర్లను కలెక్టర్ కోరారు.



బాలుడి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డి

కొత్తగా 300 అంగన్‌వాడీలు

నిర్మాణానికి వేదాంత ఫౌండేషన్ సహకారం



మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో కొత్తగా 300 అంగన్‌వాడీ మోడల్ భవనాలు ని ర్మించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావు తెలిపారు. 700 చ అడుగుల విస్తీర్ణం లో ఏర్పాటు చేసే ఈ భవనాల నిర్మాణానికి వేదాంత ఫౌండేషన్ ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా వెనుక బడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు వేదాంత ఫౌండేషన్ అంగీకారం తెలిపిందని మంత్రి తుమ్మల తెలియజేశారు. మొత్తం 11 రాష్ట్రాల్లో నాల్గు వేల భవనాలను నిర్మించేందుకు కేంద్రంతో వేదాంత ఎంవోయూ కుదుర్చుకుందని, అందులోభాగంగా తెలంగాణలో 300 అంగన్ వాడీ నూతన భవనాలను నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. అందుకు అవసరమైన భూములను ఆ సంస్థకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్, డైరెక్టర్ విజయేందిర బోయిలను మంత్రి తుమ్మల ఆదేశించారు. సచివాలయం లో సోమవారం తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో సమీ క్ష నిర్వహించారు. అంగన్‌వాడీ మోడల్ భవనాల నిర్మాణంపై సచివాలయంలో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు స్థానికంగా ఉన్న ప్రైమరీ పాఠశాలలో నడుస్తున్నాయన్నారు. అక్కడే ఈ కొత్త భవనాలకు స్థలాలను వేదాంత ఫౌండేషన్ వారికి వెంటనే అప్పగించాలని ఆదేశించారు. భవనాలకు అవసరమయ్యే స్థలాలను వేదాంతకు 15 రోజుల్లో అప్పగించాలన్నారు.

చౌక దుకాణాల ద్వారా రేషన్

రాష్ట్రంలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు సెప్టెంబర్ నుంచి చౌక ధరల దుకాణాల నుంచే రేషన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి దాకా స్థానికంగా ఉన్న స్టాక్ పాయింట్ డిపోల నుంచి కాకుండా లోకల్‌గా ఉండే రేషన్ షాపుల ద్వారానే ఇవ్వాలని, వచ్చే నెల నుంచే దీన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి దాకా అంగన్ వాడీ టీచర్లకు నిర్దేశించిన స్టాక్ పాయింట్ నుంచి పిల్లలకు అందించే బియ్యం సరఫరా అవుతోందని, ఇకపై అలా కాకుండా స్థానికంగానే వాటిని ఇవ్వడం ద్వారా వారికి కావాల్సినంత రేషన్‌తో పాటు సమయం కూడా కలిసి వస్తుందన్నారు. అలాగే అంగన్ వాడీ టీచర్ బయోమెట్రిక్ ఆధారంగా వారికి రేషన్ అందిస్తారని, ఆయా కేంద్రాల్లో ఉండే పిల్లల సంఖ్య మేరకు రేషన్ అందించనున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న 60 సంవత్సరాలు నిండిన అంగన్ వాడీ టీచర్లు, ఆయాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకైతే 60 వేలు, ఆయాలకు 30 వేల చొప్పున డబ్బులు చెల్లించనున్నట్లు తెలిపారు. కొంత మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వయో భారం కారణంగా విధులు నిర్వర్తించలేక పోతున్నట్లు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అంగన్ వాడీ టీచర్లు, ఆయాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు వివరించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఉన్న ఖాళీల మేరకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.


వివిధ శాఖల్లో పదోన్నతలు



మన తెలంగాణ/హైదరాబాద్: వివిధ శాఖ ల్లో 51 మందికి పదోన్నతి కల్పిస్తూ డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రత్యేక సిఎస్ ఎస్.కె.జోషి అధ్యక్షునిగా, జిఎడి ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా కన్వీనర్‌గా ఉన్న కమిటీ సోమవారం సమావేశంలో అభ్యర్థుల అర్హతలను పరిశీలించింది. ఆర్థిక శాఖలో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్లు (5), డిప్యూటీ డైరెక్టర్/ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్స్ (7), అకౌంట్ ఆఫీసర్స్/అసిస్టెంట్ డైరెక్టర్స్/లెక్చరర్స్ (8) మందికి పదోన్నతి కల్పించారు. పురపాలక శాఖలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌లుగా 15 మంది, విద్యాశాఖలో సివిల్, మెకానికల్, ఇసిఇ, ఫార్మసీ, సిసిపి విభాగాల అధిపతులుగా 11 మంది, సాంకేతిక విద్యలో జా యింట్ డైరెక్టర్/రీజినల్ డైరెక్టర్ ఒకరు, విద్యాశాఖలో జాయింట్ డైరెక్టర్లుగా ఇద్దరికి పదోన్నతి కల్పించారు.

అవినీతి వ్యతిరేక జెఏసి ఆవిర్భావం

ప్రభుత్వ శాఖల్లో లోపాల గుర్తింపునకు మేధావులతో ట్రిబ్యునళ్లు, అక్రమాలపై ప్రజల్లోకి వెళ్లి వివరణ



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ రంగాల మేధావులతో కొత్తగా 'తెలంగాణ అవినీతి వ్యతిరేక జెఎసి' ఆవిర్భవించింది. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న అవినీతిని ప్రజలకు వివరించనున్నట్లు జెఎసి ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రభుత్వ పథకాలను సమీక్షించి, వాటిలోని లోపాలను గుర్తించడంతో పాటు మేధావులతో ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జెఎసి తన ప్రకటనలో పేర్కొన్నది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా పాలన జరుగుతోందని, ముఖ్యమైన కార్యక్రమాల్లో కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయని జెఎసి అభిప్రాయపడింది. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన కేవలం కెసిఆర్ కుటుంబానికే పరిమితమైందని, మియాపూర్ లాంటి భూ కుంభకోణాల్లో మంత్రులు, సిఎంకు సంబంధించిన వ్యక్తుల పేర్లు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ప్రతి ఇంటికీ మంచినీరు పేరుతో వేల కోట్ల రూపాయాలు దుర్వినియోగం అవుతోందని జెఎసి తెలిపింది. టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజానీకం నైరాశ్యం చెందుతున్నారని వాపోయింది. ఉపాధి అవకాశాలకు, ఇతర ప్రజా ప్రయోగ కార్యక్రమాలకు నిధులను ఉపయోగించని ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సచివాలయాన్ని వదిలి బైసన్‌పోలోలో కొత్త సచివాలయ నిర్మాణానికి పూనుకుటుందని, ఇలా ప్రజాధనాన్ని దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించింది. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజా స్వామ్య విలువలు పతనమయ్యాయని, ప్రశ్నించేవారిని అణచివేస్తుందని, నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలిపింది. రాష్ట్రంలోప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగేట్టేందుకు, ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి తెలంగాణ మేధావులతో ఒక పౌర వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందులో భాగంగానే పలువురు మేధావులతో కలిసి తెలంగాణ అవినీతివ్యతిరేక జెఏసిని ఏర్పాటు చేసినట్లు తన ప్రకటనలో పేర్కొన్నది.

కమిటీ కార్యవర్గం

ప్రొఫెసర్ ఎం.కోదండరామ్(తెలంగాణ జెఎసి), కె.చంద్రశేఖర్(హైకోర్ట్ న్యాయ వాది), జహీరుద్దీన్‌అలీఖాన్(పాత్రికేయులు, సామాజిక వేత్త), జి.విద్యాధర రెడ్డి(న్యాయవాది, ఉద్యమనేత), కింగ్ షుక్ నాగ్ (రచయిత, పాత్రికేయులు)

గీతం యూనివర్సిటీకి రెండో గిన్నీస్ రికార్డు

మన తెలంగాణ/ హైదరాబాద్: గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థులు గిన్నీస్ రికార్డును సాధించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని శివాలి తన తల్లి కవితతో కలిసి రెండో గిన్నీస్ రికార్డు సాధించగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ మూడో ఏడాది విద్యార్థిని మానస జొన్నలగడ్డ " మిస్ ఇండియా ఏసియా పసిఫిక్... 2017 టైటిల్ విజేతగా నిలిచి విశ్వ వేదికపై గీతం జయకేతనాన్ని ఎగురవేసినట్లు గీతం ప్రో. విసి ప్రొ. ఎన్. శివ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాలి, ఆమె తల్లి కవిత కాగితాలను గుండ్రంగా చుడుతూ చేసే క్విల్లింగ్ కళలో 7011 పూలను అల్లి అంతకు ముందున్న 6241 రికార్డును అధిగమించారు. ఇక థాయిలాండ్‌లో జరిగిన అందాల పోటీలో మానస జొన్నల గడ్డ మిస్ ఇండియా ఏసియా పసిఫిక్ టైటిల్ విజేతగా నిలువడం పట్ల గీతం ప్రొ. విసి శివ ప్రసాద్, ప్రొఫెసర్లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



"ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోదలచినవారు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎంతటి మహాత్ముల పాదాలవద్ద నైన సరే వదులుకోరాదు.
– డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్"

జాతీయస్థాయిలో మహాకూటమి

సంపాదకీయం

'బిజెపిని తరిమికొడదాం – దేశాన్ని కాపాడుదాం' అనే సమరశంఖారావంతో ఆర్.జె.డి. అధినేత లాలుప్రసాద్ యాదవ్ ఆదివారం పట్నాలో నిర్వహించిన బ్రహ్మాండమైన సభలో పాల్గొన్న 17 ప్రతిపక్ష పార్టీల నేతలు బిజెపికి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటుకు పిలుపుయిచ్చారు. బీహార్‌లో బిజెపిని ఓడించిన 'మహాగద్బంధన్'కు వెన్నుపోటు పొడిచి బిజెపిని తిరిగి ఆలింగనం చేసుకున్న జెడి(యు) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, 'ప్రజల తీర్పుకు చేసిన ద్రోహాన్ని' ఎండగట్టేందుకు, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీ అయిన ఆర్.జె.డి. ఈ సభను ఏర్పాటుచేసి ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆహ్వానించింది. నితీష్‌కుమార్‌ను ధిక్కరించిన జెడి(యు) వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ యాదవ్ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశానికి కొనసాగింపు అనవచ్చు. బీహార్ రాష్ట్రంలో సగభాగం తీవ్రమైన వరదల్లో అవస్థలు పడుతున్నప్పటికీ చరిత్రాత్మక గాంధీ మైదాన్ జనాలతో కిక్కిరిసిపోవటం లాలుప్రసాద్ రాజకీయ ప్రభావానికి నిదర్శనం. యువత ఎక్కువగా హాజరుకావటం మరీ విశేషం. బిజెపి ప్రభుత్వం తన ప్రత్యర్థుల్ని వేధించటంలో భాగంగా బనాయించిన అవినీతికేసులతో తాను బెదరబోనని, బిజెపిని త్రికరణశుద్ధిగా ఆది నుంచి వ్యతిరేకిస్తున్నది తానేనని లాలు ప్రకటించారు. సభలో ప్రసంగించిన శరద్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తదితరులు బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ దుష్పరిపాలనను ఎండగట్టారు. ఈ మతవాద మితవాద ప్రభుత్వాన్ని సాధ్యమైనంత త్వరలో అంతం చేయటానికి ఇప్పటినుంచే ప్రజలు సమాయత్తం కావాలని పిలుపుయిచ్చారు. 2019 ఎన్నికల్లో నరేంద్రమోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు.

శరద్‌యాదవ్, మమతాబెనర్జీ, అఖిలేశ్ యాదవ్ ఈ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేదికపై దాదాపు 20 పార్టీల నాయకులుండటమే మహాకూటమి ఏర్పాటుకు నాంది అని శరద్ యాదవ్ అన్నారు. ఇంతకుముందు ఢిల్లీలో చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. ఇప్పుడు పట్నా కేంద్రమైందన్నారు. ఆనాడు నాస్‌బంది (బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు) ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని గద్దె దించితే, ఇవాళ నోట్‌బందీ మోడీ ప్రభుత్వాన్ని అంతం చేస్తుందని మమతాబెనర్జీ ప్రకటించారు.

జాతీయస్థాయిలో మహాకూటమి ఇప్పటికి ఒక ఆకాంక్ష మాత్రమే. కేవలం నాయకులు కలిసినంత మాత్రాన అది ఏర్పడదు. శరద్ యాదవ్ అన్నట్లు ఏర్పడిందనుకున్నా శక్తిమంతమైన రాజకీయశక్తి కాజాలదు. బిజెపి పట్ల వ్యతిరేకత ఒక్కటే ప్రత్యామ్నాయం కాజాలదు. ప్రజలను ఆకర్షించగలిగిన ప్రత్యామ్నాయ విధానాలతో, కార్యక్రమంతో విశాల ఐక్యతను నిర్మించాలి. ఆ ప్రాతిపదికగా సమష్టి నాయకత్వంతో రానున్న ఎన్నికల సమరం వరకు ప్రజలను సమీకరించి ఆందోళనబాటలో ప్రయాణించాలి. బీహార్ గద్బంధన్‌లో కాంగ్రెస్ భాగస్వామి అయినప్పటికీ లాలూ సభకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ లేదా ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరుకాలేదు. రికార్డు చేసిన సోనియా ప్రసంగం వినిపించారు. అదేవిధంగా వామపక్ష పార్టీల్లో సిపిఐ, సిపిఐ(ఎంఎల్)నాయకులు పాల్గొనగా, వాటిలో పెద్దదైన సిపిఐ(ఎం) పాల్గొనలేదు. మమతాబెనర్జీ పాల్గొనటం వారిని నిరోధించి ఉండవచ్చు. అంతేగాక బిజెపి, కాంగ్రెస్‌లకు సమదూరం పాటించాలన్న వారి గత మహాసభ తీర్మానం గుదిబండగా కొనసాగుతున్నది. యుపిలో బలమైన పార్టీల్లో ఒకటైన బిఎస్‌పి అధినేత మాయావతి పాల్గొనకపోవటానికి సమాజ్‌వాది పార్టీ హాజరు కారణం కావచ్చు. కాబట్టి జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పడాలన్నా, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని దేశ ప్రజల ముందుంచాలన్నా ఉమ్మడి కనీస కార్యక్రమం రూపకల్పనతోపాటు నాయకత్వ సమస్యను, రాష్ట్రాల్లో ప్రాంతీయ నాయకుల మధ్య వైరుధ్యాలను సామరస్యపరచుకోవటం ఎంతైనా అవసరం.

సెక్యులర్ పౌరస్మృతి కావాలి

వెంటవెంటనే మూడుసార్లు 'తలాక్' చెప్పి విడాకులు ఇచ్చే ఆనవాయితీని అడ్డుకొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన మెజారిటీ తీర్పు సరియైన లక్ష్యం దిశగా పడిన చిన్న అడుగు అని చెప్పవచ్చు. 'ట్రిపుల్ తలాక్' వంటి హేయమైన ఆనవాయితీని నిషేధించడంలో సుప్రీంకోర్టు స్థైర్యం చూపించింది. అయితే మన అత్యున్నత న్యాయస్థానానికి విధానపరమైన అంశాలను నిర్ణయించడం అలవాటుగా మారింది. తనకు ఏమాత్రం అనుభవం లేని అంశాల్లో కూడా విధానాలను శాసిస్తోంది. అయితే ఆ క్రమంలో ప్రాథమిక హక్కుల రక్షణ బాధ్యతను అది విస్మరిస్తోంది కూడా.

చూపు

భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 377 విషయంలో తీసుకున్న నిర్ణయం అందుకు నిదర్శనం. సజాతి శృంగారం నేరం కాదని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు తలక్రిందులు చేసింది. ప్రకృతి విరుద్ధమైన శృంగారాన్ని నేరంగా పరిగణించే క్లాజును సుప్రీంకోర్టు బలపరిచింది. ఈ అంశాన్ని చర్చించవలసిందిగా పార్లమెంటును కోరింది. సుప్రీంకోర్టు తన విధులను నిర్వర్తించకుండా దాటవేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బాబ్రీ మసీదు అంశంలో ప్రాథమిక హక్కుల ప్రస్తావన లేకపోవచ్చు కానీ వివాదంపై సామరస్యపూర్వకంగా అవగాహనకు రావాలని ఇరుపార్టీలను ఆదేశించడం అర్థంలేని విషయం. దశాబ్దాల కృషి తర్వాత కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోయిన పక్షాలను ఆ విధంగా కోరడం ఆశ్చర్యం.

377 సెక్షన్‌పై తీర్పు వంటి తీర్పుతో పోల్చదగ్గ వైఖరిని ప్రస్తుత తలాక్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు సభ్యులు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రదర్శించారు. తమకు ఆమోద యోగ్యంగా కనపడుతున్న చట్టాన్ని మార్చాల్సిన బాధ్యత పార్లమెంట్‌పై ఉందన్నారు. అసంతృప్తి అభిప్రాయాన్ని (డిసెంట్ నోట్) ప్రకటిస్తూ వారు ఇలా రాశారు – 'ఒక మతంలో అంతర్భాగంగా ఉన్న ఆచారానికి విరుద్ధమైన వైఖరిని ఆమోదించడం కోర్టు పని కాదు' అని. వేరే మాటల్లో చెప్పాలంటే 'ఒక ఆనవాయితీ లేదా సాంప్రదాయం ఎంత అక్రమమైనా మతపరమైన ఆమోదం ఉన్నంత కాలం దానిని కొనసాగించ వచ్చు.. ప్రాథమిక హక్కులను కాలరాసి అయినా సరే' అని అర్థం.

'ట్రిపుల్ తలాక్' ఇస్లాం విరుద్ధమని మరో జడ్జి జస్టిస్ కురియన్ జోసెఫ్ తెలిపారు. న్యాయబద్ధం కాని ఆచారాలను మతపరమైన అనుమతి ఉన్నా సరే ఖండించ వచ్చునని ఆయన అన్నారు. ఈ అంశం విషయంలో ఆయన న్యాయమూర్తులు ఖేహర్ , నజీర్‌లతో విభేదించారు. సిద్ధాంత పరంగా న్యాయమూర్తి జోసెఫ్ నిర్ణయం తీసుకున్నారు. అప్పటికప్పుడు తలాక్ చెప్పి విడాకులు ఇవ్వడం రాజ్యాంగంలోని 14వ అధికరణకు విరుద్ధమని న్యాయమూర్తులు నారీమన్, ఉదయ్ ఉమేష్ లలిత్ ప్రకటించారు. ఆ అధికరణ చట్టం ముందు అందరూ సమానమని చాటుతోంది. ఇస్లాం కీలక నియమాల్లో ట్రిపుల్ తలాక్ ఉందన్న వాదాన్ని వారు తోసిపుచ్చారు. మతం విశ్వాసాల ఆధారంగా అసమానతలు ప్రోత్సహించడాన్ని ఏ ప్రజాస్వామ్య దేశం ఆమోదించబోదని వారు పేర్కొన్నారు.



మోడీ తొందరపాటు ట్వీట్

ఈ తీర్పును ప్రశంసిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. అది ముస్లిం మహిళలకు సమానత్వాన్ని ప్రసాదించిందని, మహిళ సాధికారతకు ఆ తీర్పు శక్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. మహిళల హక్కుల గురించి మాట్లాడే నైతిక దన్ను మోడీకి లేదు. ఆయన తన భార్యను విడిచిపెట్టారు. ఆమె అస్తిత్వాన్ని గుర్తించడానికి నిరాకరించారు. ఆమె సొంతంగా తన జీవితాన్ని దిద్దుకొనే స్వాతంత్ర్యాన్ని కూడా నిరాకరించారు. ఆ విధంగా ఈ విషయంలో ఆయన కపటత్వాన్ని ప్రదర్శించారు. ఆయన చెప్పే ప్రతి ఒక్క విషయంలాగా ఈ ట్వీట్ కూడా అబద్ధం. ట్రిపుల్ తలాక్ ఆచారం అంతం కావడంతో ముస్లిం మహిళలకు సమానత్వం చేకూరిపోదు. కనీసం విడాకుల విషయంలో కూడా వారికి ఈ తీర్పు సమానత్వాన్ని ఇవ్వదు. తమ పురుషులు విడాకులు ఇవ్వడానికి చేస్తున్న పనినే ఇప్పుడు ముస్లిం మహిళలు చేస్తారన్నట్లుగా మనం భావించలేము.


షరియా ఎన్నడూ స్త్రీకి సమానత్వాన్ని ఇవ్వలేదు. అందుకే మత విశ్వాసాలు ఆధారంగాగల నియమావళి స్థానంలో 'సెక్యులర్ చట్టం' అవసరమని నారీమన్, లలిత్ తర్కం సూచిస్తోంది. అంటే మనకు 'సెక్యులర్ సివిల్ కోడ్' ఎంతయినా అవసరం. మతపరమైన విశ్వాసాలు ఇస్లాంకే కాక అన్ని మతాలకూ ఉన్నాయి కనుక వాటి మధ్య సమానత్వాన్ని ముందు సాధించాలి. అందుకు 'సెక్యులర్ సివిల్ కోడ్' ఒక్కటే శరణ్యం.

నారీమన్, లలిత్ తీర్పుల వెనుక హేతువును పరిశీలిస్తే పురుషులు, స్త్రీల మధ్య ఎటువంటి అసమానత్వమైనా రాజ్యాంగంలోని 14వ అధికరణకు ఉల్లంఘన అన్నది వారి వాదనకు ప్రాతిపదికగా కనపడుతుంది. అంటే అర్థం 'ముస్లిం పర్సనల్ లా'ను వర్తమాన సమానత్వం, న్యాయం భావాలకు అనుగుణంగా మార్చాలని. వివాహం, విడాకులు, బహుభార్యత్వం, వారసత్వ హక్కులు, దత్తత స్వీకారంవంటి అంశాలకు సంబంధించిన చట్టాలను స్త్రీ, పురుష సమానత్వ న్యాయానికి అనుగుణంగా మార్చాల్సి వుంటుందని వారి సూచన. అలా జరిగితే ఇక అవి ఇస్లామిక్ కాకుండా పోతాయి.

షరియా ఎన్నడూ స్త్రీకి సమానత్వాన్ని ఇవ్వలేదు. అందుకే మత విశ్వాసాలు ఆధారంగాగల నియమావళి స్థానంలో 'సెక్యులర్ చట్టం' అవసరమని నారీమన్, లలిత్ తర్కం సూచిస్తోంది. అంటే మనకు 'సెక్యులర్ సివిల్ కోడ్' ఎంతయినా అవసరం. మతపరమైన విశ్వాసాలు ఇస్లాంకే కాక అన్ని మతాలకూ ఉన్నాయి కనుక వాటి మధ్య సమానత్వాన్ని ముందు సాధించాలి. అందుకు 'సెక్యులర్ సివిల్ కోడ్' ఒక్కటే శరణ్యం.

జిఎస్‌టిపై సూరత్ పోరు

జియస్‌టి(వస్తు సేవల పన్ను)పట్ల సూరత్ వస్త్ర వ్యాపార కేంద్రాలు కత్తులు నూరుతున్నాయి. ఆ వ్యవస్థ అమలులోకి వచ్చిన గత జులై 1 నుంచి ఆ చిన్న తరహా కేంద్రాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. సూరత్‌లోని వేలాది వస్త్ర వాణిజ్య, నేత, అద్దకం కేంద్రాలు రోజుకు 40మిలియన్ మీటర్ల వస్త్రాన్ని తయారు చేస్తున్నాయి. అవన్నీ చాలావరకు అవ్యవస్థీకృత రంగంలోని వాణిజ్య కేంద్రాలు. వాటి సరఫరా వ్యవస్థ మొత్తం జియస్‌టి వల్ల అతలాకుతలమైంది. ఆ కేంద్రాలు చాలావాటికి జియస్‌టి బిల్లింగ్ వివరాలు లేనేలేవు. నగదు ద్వారానే వారి లావాదేవీలు సాగుతుండడంతో చాలామంది వాణిజ్యకేంద్రాల యజమానులు జియస్‌టి నెంబరు తీసుకోలేదు. అందువల్ల రవాణా, ఏజంట్లకు కమిషన్ చెల్లింపులు సర్వం గందరగోళంగా తయారై వ్యాపారం పూర్తిగా దెబ్బతింటోంది. దేశం మొత్తానికి ఒకే పన్ను, ఒకే మార్కెట్ కల్పించే లక్ష్యంతో తీసుకువచ్చిన ఈ పన్నుల సంస్కరణ తమను అయోమయంలో పడవేసినట్లు సూరత్ వస్త్రవ్యాపారులు మొత్తుకుంటున్నారు.



జియస్‌టి వ్యవస్థ వలన తమ వ్యాపారం విస్తృత, వ్యవస్థీకృత వాణిజ్యసంస్థల చేతుల్లోకి పోతుందని వారు భయపడుతున్నారు. జియస్‌టి నెంబరు కోసం నమోదుకావడం, అందువల్ల పన్నుల పరిధి విస్తరించడం, పారదర్శకత వంటి లక్ష్యాలు తమ చిన్నతరహా వాణిజ్యకేంద్రాలు మోయలేనివి కావడంతో తమ వ్యాపారం మూసుకుని, భారీ వాణిజ్యవేత్తల ఊడిగం చేయాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు.

జియస్‌టి వ్యవస్థ వలన తమ వ్యాపారం విస్తృత, వ్యవస్థీకృత వాణిజ్యసంస్థల చేతుల్లోకి పోతుందని వారు భయపడుతున్నారు. జియస్‌టి నెంబరు కోసం నమోదుకావడం, అందువల్ల పన్నుల పరిధి విస్తరించడం, పారదర్శకత వంటి లక్ష్యాలు తమ చిన్నతరహా వాణిజ్యకేంద్రాలు మోయలేనివి కావడంతో తమ వ్యాపారం మూసుకుని, భారీ వాణిజ్యవేత్తల ఊడిగం చేయాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా జియస్‌టి వల్ల కాగితం పని ఎక్కువై మరింతగా అకౌంటెంట్లు అవసరపడతారని, అకౌంటింగ్ బుక్‌ల నిర్వహణ బాధ్యత ఎక్కువై ఈ పైపై పనులకే సమయం వృధా అవుతుందని కూడా వారు భయపడుతున్నారు. వీటివల్ల వచ్చే అదనపు ఖర్చులను ఆ చిన్నతరహా వాణిజ్యకేంద్రాలు భరించలేవు.

కౌన్సిల్ చర్యలపట్ల అసంతృప్తి

జులై 1న సూరత్ వస్త్ర వ్యాపారులు సమ్మె ప్రారంభించారు. అయితే ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వారి డిమాండ్లపై జియస్‌టి కౌన్సిల్ పరిశీలన జరుపుతుందని హామీ ఇవ్వడంతో 18రోజుల తర్వాత సమ్మె విరమించారు. జియస్‌టిని మొత్తంగా ఎత్తివేస్తే 'ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ చెయిన్'దెబ్బతింటుందన్న కారణంపై జైట్లీ ఆ డిమాండ్‌ను తిరస్కరించారు. కౌన్సిల్ జియస్‌టి పన్ను రేటును 'జాబ్‌వర్క్'కు తగ్గించింది. అలాగే థర్డ్‌పార్టీ సేవలకు (కుట్లు, ఎంబ్రాయిడరీ పనుల వంటివి) 5%పన్ను వర్తింపచేసింది. ఇంతకు ముందు అది 18శాతం ఉండేది. అయితే వస్త్ర వ్యాపారులు అసంతృప్తి వ్యక్తంచేశారు. వారు తిరిగి సమ్మె చేస్తారన్న వదంతులు వ్యాపిస్తున్నాయి.

పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో సూరత్‌లో మాదిరిగా జియస్‌టికి గట్టిగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రేవు నగరం కావడంతో సూరత్ ఈ నిరసనలకు కేంద్రంగా నిలిచింది. అహ్మదాబాద్ 270కి.మీ.ల దూరంలో గుజరాత్ దక్షిణ ప్రాంతపు నగరం సూరత్ ఉత్తర ముంబయి నుంచి కూడా అదే దూరంలో ఉంది. సూరత్ వాణిజ్యానికి ముందునుంచి పేరుపొందింది. వస్త్ర ఉత్పత్తి కేంద్రాలు కూడా అక్కడ ఎప్పటినుంచో ఉన్నాయి. 1980దశకంలో ఆ నగరం నూలు వస్త్రం నుంచి సింథటిక్ వస్త్రానికి మారింది. నేడు సూరత్‌లో దేశంలో తయారయ్యే మొత్తం మిల్లు వస్త్రంలో 40శాతం ఉత్పత్తి అవుతున్నది.

సూరత్ వస్త్ర వ్యాపారంలో అధికంగా కతియావారీలు, మార్వాడీ లు ఉన్నారు. కతియావారీలు గుజరాత్ సౌరాష్ట్ర ప్రాంత అగ్రకులస్తులు. మార్వాడీలు రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం నుంచి వచ్చినవారు. వీరి వ్యాపార చాకచక్యం దేశమంతా పేరొందింది. అంబానీలు, బిర్లాలు వంటి ప్రసిద్ధ వ్యాపార సామ్రాజ్యాలు మార్వాడీలవే.

అకౌంట్ నిర్వహణ భయాలు

ఆర్థిక వ్యవస్థకు చెందిన చాలా రంగాలలో మాదిరిగానే సూరత్ వస్త్ర వాణిజ్యంలో కూడా సరఫరాల వ్యవస్థపై జియస్‌టి ప్రభావం గురించి భయాందోళనలు నెలకొన్నాయి. ధరలు, ఖర్చులు పెరుగుతాయా లేక వ్యాపార పద్ధతి చాలా సులభతరమౌతుందా అన్నది వారు చెప్పలేకపోతున్నారు. ముఖ్యంగా అకౌంట్ల నిర్వహణ గురించి భయాలు ఎక్కువగా ఉన్నాయి. సూరత్‌లో చాలామంది వస్త్ర వ్యాపారులు చదువుకున్నవారు కాదు.

అందుచేత అకౌంట్ల నిర్వహణ, బిల్‌బుక్‌ల తయారీ పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. పైగా నగదుతో సాగే లావాదేవీలు ఇప్పుడు బ్యాంక్ అకౌంట్ల ద్వారా సాగించడం వారికి చాలా కష్టం. ఎందుకంటే తక్కువ లాభాలతో నడిచే కేంద్రాలు వారివి. అందువల్ల అదనంగా పెరిగే జియస్‌టి ఖర్చుల భారాన్ని వారు మోయలేరు. చాలామంది చిన్న వ్యాపారులు పన్నులు కట్టకుండా నెట్టుకు వస్తున్నారు. వారంతా తప్పనిసరి పన్నుల వ్యవస్థలోకి ప్రవేశించడాన్ని నిరసిస్తున్నారు. ఎగవేసిన పన్నులే తమకు మిగిలే లాభమని చాలా మంది వ్యాపారులు చెప్పారు.

2014–15లో మన దేశం చైనానుండి 2.62బిలియన్ డాలర్ల విలువచేసే వస్త్రాలను దిగుమతి చేసుకుంది. ఇది దేశం మొత్తం వస్త్రాలు, దుస్తుల దిగుమతిలో 60శాతం. మొత్తం పది వాణిజ్య భాగస్వామ్య దేశాలనుంచి భారత్ వాటిని దిగుమతి చేసుకుంటోంది. చైనా దిగుమతులపై 'యాంటీ డంపింగ్ సుంకం' విధించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ డిమాండ్‌తో 2016మేలో సూరత్ వస్త్ర వాణిజ్యవేత్తల సంఘాల సమాఖ్య వారు కేంద్ర జౌళిశాఖామంత్రికి లేఖ రాశారు. చైనానుంచి దిగుమతి చేసుకునే వస్త్రాలపై ఆ సుంకాన్ని తప్పనిసరిగా విధించాలని వారు గట్టిగా కోరారు.

చైనా దిగుమతులవల్ల సూరత్‌లోని వస్త్ర తయారీ కేంద్రాలు 50శాతం దాకా నెలరోజులపాటు మూసుకోవలసి వచ్చిందని కూడా ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. చైనా వస్త్రం చాలా చౌక కావడంతో తమ వస్త్రానికి గిరాకీ పడిపోయిందని చెప్పారు. దేశంలో అవ్యవస్థీకృత రంగం పెద్దనోట్ల రద్దు చర్యతో మూలుగుతోంది. జియస్‌టి వచ్చి 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు' చేసింది. జియస్‌టి కౌన్సిల్ ఈ వ్యాపారుల ఆందోళనను తప్పనిసరిగా పట్టించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

'రైతు భారతం' పుస్తకానికి వ్యాసాలు పంపించండి

ఎడిటర్‌కు లేఖలు

'సెప్టెంబర్ 21న న్యూఢిల్లీ విజ్ఞానభవన్‌లో నేషనల్ కో–ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సహకార భారతి' కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. సహకార వ్యవస్థ భారతదేశంలో మరింత బలోపేతం కావాలసిన అంశం గురించి, ఆ రంగంలో తీసుకురావలసిన సంస్కరణల గురించి, రైతుల సంక్షేమానికి కల్పించవలసిన ప్రోత్సాహకాలు, రాయితీల గురించి నిష్ణాతులు సూచనలు ఇవ్వనున్నారు. అతి ముఖ్యమైన 1250 మంది ని మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా 'ముద్ర అగ్రికల్చర్ & స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో– ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' ఆధ్వర్యంలో ప్రధాని చేతుల మీదుగా 'రైతు భారతం' పుస్తకాన్ని ఆవిష్కరింపజేస్తున్నాము. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషలలో ఈ పుస్తకం ప్రచురితమవుతోంది. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇటీవల ఢిల్లీ నుండి వాద్ నగర్‌కు నాలుగు రాష్ట్రాలలో 900 కి.మీ.లు, 'రైతు చైతన్యయాత్ర' పేరుతో జరిపిన 'పాదయాత్ర'లో అనేక మంది రైతులతో జరిపిన ముఖాముఖి చర్చల వివరాలను కూడా పొందుపరుస్తున్నాము.

పార్లమెంట్ స్థాయీ సంఘం తాజా నివేదికాంశాల ప్రకారం బ్యాంకుల, సహకార సంఘాల గురించి రుణవసతికి నోచుకుంటున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య 17 శాతానికి పడిపోయింది. ఎక్కువమంది రైతులకు అధిక మొత్తంలో పరపతి సదుపాయం కల్పిస్తునే ప్రైవేటు వడ్డీ భారం తగ్గుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ అంశాన్ని రిజర్వు బ్యాంకు , నాబార్డు లోతుగా పరిశీలించవలసి వుంది. ఫసల్ బీమా పథకాన్ని మరింత విశదీకరించి అన్ని రకాల పంటలకు వర్తింపచేసే విధంగా మార్పులు చేర్పులు చేయవలసి వుంది. వ్యాపారులకు, రైతులకు మధ్య వున్న దళారీ వ్యవస్థ నిర్మూలనకు కఠినమైన చట్టాలు తీసుకురావలసివుంది. సగటు రైతు కుటుంబం నెల ఆదాయం 6000 రూపాయల లోపేనని జాతీయ స్థాయి అధ్యయనం నిగ్గుతేల్చడంతో యావత్ దేశ ప్రజల నివ్వెర పోయే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వేతన సిఫార్సుల ప్రకారం అట్టడుగు ఉద్యోగి జీతం 18000 వుండగా అందులో మూడోవంతు ఆదాయం కూడా రైతన్న కుటుంబానికి లేదంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఊహించుకోవచ్చు. ఈ నేపథ్యంలో రైతాంగ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి 'రైతు భారతాన్ని' ఆవిష్కరించవలసివుంది. ఇటువంటి అమూల్యమైన అంశాలతో రూపొందిస్తున్న 'రైతు భారతం' పుస్తకాన్కి సలహాలు, సూచనలు, వ్యాసాలు స్వీకరిస్తున్నాము. వీటిని సెప్టెంబర్ 7వ తేదీలోగా పంపించాలని మనవి. ఉత్తమ వ్యాసాలకు కొంతమేర నగదు బహుమతులు అందజేయబడును.

తిప్పినేని రామదాసప్ప నాయుడు
ఛైర్మన్, ముద్ర వ్యవసాయ
నైపుణ్యాభివృద్ధి బహుళార్థ సహకార సంఘం
9989818212

తెలుగు - హిబ్రూకు మాతృభాష

హిబ్రూ భాషలో ''అబ్బ, ఇమా (అమ్మ), అవ్త (అవ్వ), కాయ, ఒరి (వరి), అక్క, అనాస, లే (లేదు), కై (చేయి), లబ్ (గుండె), కాసు (డబ్బు), ఇర్ (ఊరు), ఎట్జ (చెట్టు), ఎజి (ఏది), అను (నేను), దలుతు (తలుపు), ఒకెల్ (ఆకలి), ఒకట (బయట), గెషం (వర్షం), జ్వినో (జున్ను), కోస్ (కోపం), లిమన్ (నిమ్మ), లవన్ (వెల్ల/తెల్లని), కాలు (పాలు), కిసె (కుర్చీ), సొప, మర(పడమర), నెమ (చీమ) '' వంటి తెలుగు పదాలున్నాయి.

పాత నిబంధన లో కూడా ''ఈశయ్య, రామయ్య, సేరయ్య, మీరయ్య'' అనే తెలుగు పేర్లు ఉన్నాయి. కొత్త నిబంధనలో ''జక్కయ్య, అగ్రిప్ప, తబిత (సబిత), మేరి (కుమారి)'' వంటి తెలుగు పేర్లున్నాయి. హిబ్రూ అంటే ''అబీరా'' అని అర్థం. మహా భారత కాలంలో పశ్చిమ తీర ప్రాంతంలో నివసించే వారిని ''అబీరా జాతి'' అని పిలిచే వారు. వీరు హరప్పా నుండి, కేరళ తీరం తెలుగు రాష్ట్రాల వరకు విస్తరించారు. వీరి మాతృ భాష తెలుగు. అబీరా అనే మాట ''అరవ, అరబ్బీ, హిబ్రూ, అరప్పా (హరప్పా)'' గా మారిపోయింది. అందువలన హిబ్రూలు తెలుగు ప్రాంతం నుండి వలస వెళ్ళిన అబీరా జాతి ప్రజలని, తెలుగు హీబ్రూ భాషకు మాతృ భాష అని చెప్పవచ్చును.

పుట్లూరు రాంనర్సింహా రెడ్డి,
9505 885 249,



యువత

హైదరాబాద్, మంగళవారం, 29, ఆగస్టు, 2017

విజయాల చిందు పివి సింధు

సై అంటే సై అనే సైనా

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

ఆటల్లో అదుర్స్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన పూసర్ల వెంకట సింధు హైదరాబాద్‌లో జన్మించింది. తల్లిదండ్రులిద్దరూ వాలీబాల్ ప్లేయర్లు. వారి నుంచి స్పోర్ట్స్ వారసత్వంగా పొందినా బ్యాడ్మింటన్ ఆడేందుకే మొగ్గు చూపింది. సింధు తండ్రి రమణ రైల్వే ఉద్యోగి, అర్జున అవార్డు గ్రహీత. తల్లి విజయ కూడా వాలీబాల్ క్రీడాకారిణి. తన ఎనిమిదేళ్ల వయసులో గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలిచి వార్తల్లో నిలవడం సింధుపై ప్రభావం చూపింది. అతని స్ఫూర్తిగా బ్యాడ్మింటన్ ఆడడం ప్రారంభించింది సింధు. ఎనిమిది సంవత్సరాలకు ఆట మొదలుపెట్టి 17 సంవత్సరాల వయసులో డబ్లుబిఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 20 లో చోటు సాధించి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఆనాటి నుంచి నేటి వరకు ఒక్కో మెట్టు ఎక్కడమే తప్పించి దిగే అవకాశం లేదన్నట్టుగా తన కెరీర్‌ను మలుచుకుంది. ఇటీవలి ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం సాధించి మరోసారి తన సత్తా చాటింది. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇప్పటికే ఒక రజతం, రెండు కాంస్యాలు, ఒలింపిక్స్‌లో మరో రజతం తన ఖాతాలో వేసుకుంది 22 ఏళ్ల సింధు. కేవలం ఓవర్‌నైట్‌లో విజయాలను సాధ్యపడలేదు సింధుకు. తన విజయాల వెనక 14 ఏళ్ల కఠోర శ్రమ, పట్టుదల, కృషి ఉన్నాయి. తన కెరీర్‌ను చూసినట్లైతే... గత ఏప్రిల్‌లో డబ్లుబిఎఫ్ ర్యాంకింగ్సులో కెరీర్ అత్యుత్తమ రెండో ర్యాంకును సొంతం చేసుకుంది. ఆగష్టు 2013లో చైనాలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన మొట్ట మొదటి మహిళగా రికార్డు సృష్టించింది. కామన్వెల్త్ గేమ్స్(2014)లో సింధు సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. అదే సంవత్సరం డెన్మార్క్‌లో జరిగిన బిడబ్లుఎఫ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించింది. మకావు ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్‌లో సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. తిరిగి ఆగష్టు 2016లో రియో ఒటింపిక్స్‌లో ఫైనల్‌కు చేరుకుని, ఫైనల్‌కు చేరిన మొట్టమొదటి భారత మహిళగా రికార్డుకెక్కింది. ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన మొట్టమొదటి పిన్న వయసు భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది. ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన సైనాను దాటుకొని రజతంతో మరో మెట్టెక్కింది సింధు. ఇటీవల స్కాట్లాండ్‌లో జరిగిన బిడబ్లుఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో హోరాహోరీ పోరాడి ఓడిన సింధు రజతాన్ని సొంతం చేసుకుంది.

అవార్డులు : నాలుగవ అతిపెద్ద పౌర సన్మానమైన పద్మశ్రీ అవార్డు 2015 లో. రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు 2016లో. అర్జున అవార్డు 2013లో అందుకుంది సింధు. ఎఫ్ఐసిసిఐ బ్రేక్ త్రూ స్పోర్ట్స్ పర్సన్ అవార్డు2014లో. ఇదే సంవత్సరం ఎన్‌డిటివి వారి ఇండియన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు. ఇవే కాకుండా మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజయం తర్వాత బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు రూ.10 లక్షలు. మలేషియా మాస్టర్స్ విజయం తర్వాత బిఎఐ రూ.5 లక్షలు. ఒలింపిక్స్‌లో రజతం సాధించడంతో సింధుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు భారీ నజరానాలను ప్రకటించాయి. రెండు రాష్ట్రాల్లో ప్రైజ్ మనీతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్ వన్ ఆఫీసర్(ఆర్‌డిఒ)గా ఉద్యోగం కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం రూ.5 కోట్లు, భూమి రివార్డుగా ప్రకటించగా, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రూ.3 కోట్లు, డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం, వెయ్యి గజాల స్థలాన్ని ప్రకటించగా, ఇటీవలే ఉద్యోగంలో చేరింది సింధు. ఈ విజయం తర్వాత ఢిల్లీ గవర్నమెంటు రూ.2 కోట్లు, తాను పని చేసే భారత్ పెట్రోలియం కార్పోరేషన్ వారు రూ.75 లక్షలు, ఉద్యోగోన్నతి కల్పించారు. ఇవే కాకుండా వివిధ రాష్ట్రాల, యువక కేంద్రాల, స్పోర్ట్స్ అథారిటీల నుంచి కూడా సింధు రివార్డులు పొందింది.

ఇటీవలి ప్రపంచ బ్యాడ్మంటన్ చాంపియన్‌షిప్ ఫైనల్లో రజతానికే పరిమితమైన సింధు దాన్నుంచి స్ఫూర్తి పొందానంటూనే రాబోయే రోజుల్లో స్వర్ణపతకం సాధించేందుకు ప్రయత్నిస్తానని చెప్పింది. స్వర్ణం సాధించడం ఎంతో దూరం లేదని తన ఆట తీరు చెబుతోంది.



పద్మ భూషణ్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు ఆగష్టు 29 నేషనల్ స్పోర్ట్స్ డే. జాతీయ క్రీడ అయిన హాకీలో మూడు సార్లు గోల్డ్ మెడల్ సాధించిన ఘనత ఇతనిది. భారత హాకీని హిమాలయాలంత ఎత్తుకు తీసుకువెళ్లి చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించాడు. తన 22 ఏళ్ల హాకీ కెరీర్‌లో 400 గోల్స్ చేసి రికార్డు సృష్టించాడితడు. ఆర్మీలో మేజర్ హోదాలో చేరిన ధ్యాన్‌చంద్ సింగ్ చిన్న వయసులోనే హాకీ నేర్చుకొని, అనతి కాలంలోనే లెజండరీ ప్లేయర్‌గా ఎదిగాడు. ఎంతగా అంటే భారత మూడో అత్యుత్తమ పౌర సన్మానమైన పద్మభూషణ్ అందుకునేంత. భారత హాకీ చరిత్రలో ధ్యాన్‌చంద్ తర్వాత ఇంతవరకు ఈ అవార్డును అందుకున్న వారు లేరు. భారత హాకీని హిమాలయాలంత ఎత్తుకు తీసుకువెళ్లాడు ధ్యాన్ చంద్. దేశ హాకీని ఉన్నతంగా నిలిపిన ధ్యాన్ చంద్ గౌరవార్థం అతని పుట్టిన రోజును నేషనల్ స్పోర్ట్స్ డే గా నిర్వహిస్తున్నారు. ఈ రోజున ఢిల్లీలోని ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో ఇండియన్ హాకీ టీముల మధ్యన ఫ్రెండ్లీ మ్యాచులు నిర్వహిస్తారు. అటల్లో మేటిగా రాణించినవారికి ధ్యాన్ చంద్ అవార్డు ఇచ్చి సత్కరిస్తారు. ఈ సందర్భంగా ఆటల్లో ఆణిముత్యాలై, తెలుగు జాతికి కీర్తికిరీటాలను అందిస్తున్న తెలుగు క్రీడాకారుల కృషిని వారు సాధించిన ఘన విజయాలను ఒక్కసారి గుర్తు చేసుకుందామా...

బ్యాడ్మింటన్ రంగంలో తనదైన క్రీడాశైలిని కనబరుస్తూ ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు కీర్తి, ప్రశంసలు కురిపిస్తున్న సైనా నెహ్వాల్ ఎన్నో విజయాలు సాధించింది. ఒలింపిక్ క్రీడలలో క్వార్టర్ ఫైనల్ చేరడమే కాకుండా ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ సాధించిన తొలి మహిళగా అవతరించింది. అంతేగాక, 2010 జూన్ 20న సింగపూర్‌లో జరిగిన సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ సూపర్ సిరీస్ టైటిల్‌ను నెగ్గి రెండు సూపర్ సిరీస్ టైటిళ్ళు సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా పేరు పొందింది. అందుకు భారత ప్రభుత్వం నుంచి కూడా అరుదైన గౌరవం సంపాదించుకుంది. 2009లో అర్జున, 2010లో రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న, 2010లో రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా పద్మశ్రీ, 2016లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మభూషణ్ అవార్డులు అందుకున్నది మన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్. అంతేగాక, 2015లో బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్‌లో సైనా నెం.1 ర్యాంకును సాధించింది. హర్యానాలోని హిస్సార్‌లో హర్వీర్ సింగ్, ఉషారాణి దంపతులకు 1990 మార్చి 17న సైనా నెహ్వాల్ జన్మించింది. తల్లిదండ్రులిద్దరూ హర్యానా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సాధించినవారే కావడం ఆమెకు బ్యాడ్మింటన్‌లో రాణించడానికి మరింత ప్రోత్సాహం లభించింది. 2003లో సైనాకు 13ఏళ్ల వయసు ఉన్నప్పుడు చెకొస్లోవేకియా జూనియర్ ఓపెన్‌లో స్వర్ణపతకం దక్కించుకున్నారు. 2004లో కామన్వెల్త్ యూత్ క్రీడలలో రజత పతకం, 2005లో ఏషియన్ శాటిలైట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో స్వర్ణపతకం సాధించింది.

ఒలింపిక్ క్రీడలలో క్వార్టర్ ఫైనల్ చేరడమే కాకుండా ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్‌తో శిక్షణ తీసుకున్న సైనా పలు అంతర్జాతీయ టోర్నమెంట్లలో విజేతగా నిలిచింది.

2006లో ఫిలిప్పీన్స్ ఓపెన్ బ్యాడ్మింటన్‌ను గెలిచి 4–స్టార్ ఓపెన్‌ను గెలిచిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించటంతో సైనా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆ టోర్నమెంట్‌లో 86వ సీడ్‌గా ప్రవేశించిన ఆమె పలు టాప్‌సీడ్‌లను ఓడించి చివరకు విజేతగా నిలిచింది. అదే సంవత్సరం BWF ప్రపంచ చాంపియన్‌లో రన్నరప్‌గా నిలిచింది. 2007లో ఇండియా నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి, జాతీయ క్రీడలలో బ్యాడ్మింటన్ స్వర్ణాన్ని గెలుచుకున్నది. 2008లో ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌ను సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించింది. చైనా మాస్టర్ సూపర్ సీరీస్‌లో సెమీస్ వరకు వెళ్లింది. ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి, అదే సంవత్సరం కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో స్వర్ణపతకం సాధించింది. ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కూడా టైటిల్ సాధించింది. 2008లోనే ఒలింపిక్ క్రీడలలో సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్ చేరుకొని ఇందులోనూ ఈ ఘనత సాధించిన తొలి భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఒక్క వెలుగు వెలిగింది. 2015 మార్చిలో ప్రపంచ నెంబర్ వన్ ర్యాంకు పొంది ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా అవతరించింది. 2015 ఆగస్టులో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించింది. ఫైనల్లో ఓడినా ఫైనల్స్‌కు వెళ్లిన తొలి భారతీయురాలిగా సైనా అవతరించింది. 2017 ఆగస్టులో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సైనా కాంస్య పతకం గెలుచుకున్నారు. భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సైనాకు రూ.5లక్షలు రికార్డు ఇస్తామని ప్రకటించింది.

సైనా నెహ్వాల్ హర్యానాలో చౌదరి చరణ్‌సింగ్ హర్యానా అగ్రికల్చరల్ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. తరువాత ఆమె కుటుంబం హైదరాబాద్‌కు రావడంతో మెహదీపట్నంలో సెయింట్ ఆన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివింది. ఈమె కరాటేలో కూడా ప్రతిభావంతురాలు. సైనాకు కరాటేలో బ్రౌన్ బెల్ట్ చాంపియన్ దక్కింది. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో రాటుదేలిన శిక్షణ పొందిన సైనా దేశం గర్వించేలా బ్యాడ్మింటన్‌లో అనేక విజయాలు సాధించింది.

క్రికెట్ క్వీన్ మిథాలి



పరిచయం అక్కర్లేని పేరు మిథాలీరాజ్‌ది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్. తన కెప్టెన్సీలో భారత మహిళా జట్టుని రన్నరప్‌గా నిలిపింది. మహిళల వరల్డ్ కప్‌లో వెయ్యికి పైగా పరుగులు చేసిన ఏకైక మహిళా బ్యాట్స్ ఉమెన్. ఇలా ప్రపంచ మహిళా క్రికెట్లో ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. మహిళలు క్రికెట్ ఆడతారనే విషయం వరల్డ్ కప్ ముందు వరకూ పెద్దగా తెలియదు. అంతగా ప్రచారం కూడా లేదు. ఇంగ్లండులో మిథాలీ సేన వరుస విజయాలు సాధించాక ఫైనల్ చేరాకగానీ, మహిళా క్రికెట్ సత్తా ఏంటో తెలిసొచ్చింది. కాస్త ఆదరణ కూడా దక్కింది. రన్నరప్‌గా గెలిచాక ప్రశంసల జోరుపెరిగింది. అవార్డులు దక్కుతున్నాయి. వన్డేలో ఆరువేల రన్స్ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. వరల్డ్ కప్‌లో భారత జట్టును రెండుసార్లు ఫైనల్‌కు చేర్చిన ఘనత మిథాలీది. నిలకడైన ఆటతీరుతో సూపర్ కెప్టెన్‌గా నిలిచింది. క్రికెట్‌ను ఆటగానే చూడాలని జండర్ వివక్షతో చూడొద్దని ఎన్నో ఏళ్లుగా మిథాలీ పోరాడుతుంది. టి 20 వరల్డ్ కప్‌ను ఇండియాకు అందించడమే తన లక్ష్యమంటోంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న మిథాలీ సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్‌లో చదువుకుంది. 2003లో అర్జున అవార్డు అందుకుంది. 2015లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. మాజీ రంజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ బీఎమ్‌డబ్యూ కారును బహుమానంగా ఇచ్చి మిథాలీని సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం మిథాలీకి రూ. కోటి నగదుతోపాటు బంజారాహిల్స్‌లో 600గజాల నివాస స్థలాన్ని అందించింది.

గురిలో అర్జున్ జ్యోతి

అంతర్జాతీయ విలువిద్యా క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ అర్జున పురస్కారాన్ని నేడు అందుకోనున్నారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని నడింపల్లిగ్రామానికి చెందిన వెన్నం సురేంద్ర కుమార్ కబడ్డీ క్రీడాకారుడు. తన కుమార్తె భవిష్యత్తు కోసం విజయవాడలో స్థిరపడ్డారు. నాలుగేళ్ల వయసులోనే జ్యోతి సురేఖ ఈత విన్యాసాలతో లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. అనంతరం విలువిద్యపై గురిపెట్టి అనతికాలంలోనే పట్టు సంపాదించింది. 13 ఏళ్ల వయసులో తొలిసారిగా అంతర్జాతీయ వేదికపై మెరిసింది. 2009లో టైజునాలో మెక్సికన్ గ్రాండ్ టోర్నీలో, అండర్ 19 విభాగంలో ఒలింపిక్ రౌండ్‌లో స్వర్ణపతకం గెల్చుకుంది. అదే వేదికపై మూడు రజత పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సంపాదించి, వెనుదిరిగి చూడలేదిక. 2011లో టెహరానులో జరిగిన ఆసియా ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలో మహిళా కాంపౌండ్ టీం సభ్యురాలిగా కాంస్య పతకం గెల్చుకుంది. 2015లో ప్రపంచవిశ్వవిద్యాలయాల విలువిద్యా పోటీలకై ఎంపికై, దక్షిణ కొరియా దేశంలోని గ్యాంగ్‌జూ నగరంలో నిర్వహించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల విలువిద్యా పోటీల్లో పాల్గొంది. గ్యాంగ్‌జ క్రీడా గ్రామంలో నిర్వహించిన వరల్డ్ యూనివర్సైడ్ గేమ్స్ 2015 వేడుకలోల భారత జట్టుకు నాయకత్వం వహించింది. గౌరవ



వందనం చేసింది. ఈ అరుదైన గౌరవం దక్కిన తొలి రాష్ట్ర క్రీడాకారిణి జ్యోతి.

సాకర్ సార్వభౌమ సయ్యద్ హకీం

ఫుట్‌బాల్ ఆటకే తన జీవితాన్ని అంకితం చేసినందుకు గాను హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ హకీంను ధ్యాన్‌చంద్ పురస్కారంతో సత్కరించనుంది కేంద్ర ప్రభుత్వం. హైదరాబాద్‌కు చెందిన హకీం కుటుంబం రెండు తరాలుగా భారత సాకర్ ఎదుగుదలకు ఎంతో కృషి చేసింది. హకీం తండ్రి దివంగత సయ్యద్ అబ్దుల్ రహీం జాతీయ సాకర్ జట్టు కోచ్‌గా భారత్‌కు రెండుసార్లు ఆసియా కప్ స్వర్ణాలు అందించాడు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో జట్టును సెమీ ఫైనల్స్‌కు చేర్చిన ఘనత ఆయనది. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న హకీం 1960 రోమ్ ఒలింపిక్స్‌లో ఆరో స్థానంలో నిలిచిన భారత జట్టులో సభ్యునిగా ఉన్నారు. తన 25 ఏండ్ల సాకర్ కెరీర్‌లో 33 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు హకీం. ఖతార్ వేదికగా 1988లో జరిగిన ఆసియా కప్‌లో రాణించిన భారత జాతీయ జట్టులో సభ్యునిగా ఉన్నాడు. అవార్డులు రివార్డులు లేకున్నా ఏనాడూ నిరాశకు లోనవలేదు. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించినా సాకర్‌పై మమకారాన్ని మాత్రం వదులుకోలేదు. తండ్రి బాటలో నడుస్తూ, 1989 నుంచి భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఎందరో ఆటగాళ్లను తీర్చిదిద్దాడు. సాకర్‌కే జీవితాన్ని అంకితం చేసి ఎన్నో బాధ్యతలు నిర్వర్తించాడు. ఫిఫా ఇంటర్నేషనల్ రిఫరీగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ డీన్‌గా, సాయ్ ప్రాంతీయ క్రీడా డైరెక్టర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. గతంలో వైమానిక దళ స్క్వాడ్రన్ లీడర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం 78 ఏండ్ల వయసులోను అలుపు లేకుండా అండర్ 17 సాకర్ ప్రపంచ కప్‌కోసం సాయ్ చీఫ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గాను సేవలందిస్తున్నారు. ఇప్పుడు ధ్యాన్ చంద్ పురస్కారాన్ని ప్రకటించినందుకు, తన ప్రతిభను గుర్తించినందుకు హకీం సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



టెన్నిస్ రాకెట్ సాకేత్

ఆసియా క్రీడలలో సానియా మీర్జాతో కలిసి 2014లో జరిగిన మిక్స్డ్ డబుల్స్ పోటీలో మనదేశానికి స్వర్ణపతకం సాధించాడు సాకేత్ మైనేని. ఆంధ్రప్రదేశ్‌లోని ఉయ్యూరుకు చెందినవాడు. 11 ఏళ్ల నుంచే టెన్నిస్ ఆడటం ప్రారంభించాడు. టెన్నిస్ కోసం హైదరాబాద్‌కు తరలివచ్చింది కుటుంబం. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన క్రీడా పురస్కారాల్లో తెలుగు టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని అర్జున్ అవార్డు దక్కించుకున్నారు. సింగిల్స్, డబుల్స్ ఆటలో సత్తా చూపాడు. తన ఫోకస్ ఎప్పుడూ సింగిల్స్ మీదేనంటాడు. రాబోయే డేవిస్ కప్‌కు ఆడబోతున్నాడు. ఇండియాని వరల్డ్ గ్రూప్‌లో తీసుకెళ్లాలనేది తన లక్ష్యమంటున్నాడు.



మేధావులతో బిసి కమిషన్ సుదీర్ఘచర్చ



మన తెలంగాణ/హైదరాబాద్: బిసి కులాల వర్గీకరణ, సంచార కులాలు, ఎంబిసిల గుర్తింపు తదితర అంశాలపై పలువురు మేధావులతో బిసి కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. బిసిల అభ్యున్నతికి ఇప్పటి వరకు అందిన పలు సిఫార్సులు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న పథకాలు, కార్యక్రమాలను సమీక్షించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం బిసిల అభ్యున్నతిపై బిసి కమిషన్ వర్క్‌షాపు నిర్వహించింది. ఇందులో బిసి కమిషన్ ఛైర్మన్ బి.ఎస్.రాములు, సభ్యులు డా.వకులాభరణం కృష్ణ మోహన్‌రావు, డా.అంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, పలు సామాజిక పరిశోధనా సంస్థల అధిపతులు, పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ స్థాయిలోని కాకాకాలేల్కర్, మండల్ కమిషన్ నివేదికలు, సంచార కులాలకు సంబంధించిన బాలకృష్ణ రెనెకె, ఇడాటె కమిషన్ నివేదికలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతరామన్, మురళీధర్‌రావు, జస్టిస్ ధాళ్వా సుబ్రహ్మణ్యం నివేదికలలోని సిఫార్సులను, అలాగే తమిళనాడుకు చెందిన సత్యనాథన్, జస్టిస్ జనార్దనమ్, కర్నాటకలోని హావనూర్ కమిషన్, చిన్నప్పరెడ్డి కమిషన్, కేరళలోని కుమార పిళ్ళై, దామోదర తదితర కమిషన్లపై వారు చర్చించారు. బిసిల అభివృద్ధికి వివిధ రాష్ట్రాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను కూడా వారు పరిశీలించారు.



స్వచ్ఛత, భద్రతపై దృష్టి పెట్టాలి

దక్షిణ మధ్య రైల్వే ఎజిఎం జాన్ థామస్

మన తెలంగాణ/హైదరాబాద్ : వర్షాకాలంలో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛత, భద్రతపై ప్రత్యేక దృష్టిని పెట్టాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం ఆయన వివిధ విభాగాల అధిపతులతో కలిసి ఆరు డివిజన్ల రైల్వే మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రతకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన స్టేషన్లు, రైళ్లలో తనిఖీలను చేపట్టాలన్నారు. భద్రత, రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపిస్తున్న సిగ్నల్, లోకొ వైఫల్యాలను నివారించాలన్నారు. రైల్వే ఆసుపత్రిలో పారిశుధ్యతపై శ్రద్ధ కనబరచాలని, ఔషధాల పంపిణీని సరిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఛీఫ్ ఆపరేషన్ మేనేజర్ ఎన్.మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

లాంగ్‌మార్చ్‌పై దాడి గర్హనీయం : సిపిఐ

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లోని కోర్‌డర్మాలో మహా ప్రదర్శనకారులపై జరిగిన దాడిని సిపిఐ తీవ్రంగా ఖండించింది. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావిస్తూ ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా లాంగ్ మార్చ్ సాగుతోంది. జార్ఖండ్‌లో ఈ యాత్రను ఉద్దేశించి విద్యార్థి నేత కన్హయ్య కుమార్ ప్రసంగిస్తున్న సమయంలో అల్లరిమూకలు ఆదివారం దాడికి దిగాయి. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ సాగుతున్న లాంగ్ మార్చ్ ద్వారా కేంద్రంలోని మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు మహాయాత్ర సాగుతోంది. అయితే ఈ యాత్రకు విశేష స్పందన రావడంతో సహించలేక జార్ఖండ్‌లో కూడా దాడికి దిగారని ఇంతకు ముందు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో లాంగ్‌మార్చ్ విచ్ఛిన్నానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ వర్గాలు దాడులకు దిగాయని సిపిఐ విమర్శించింది. జార్ఖండ్‌లో దాడికి దిగిన వారు చివరికి విద్యార్థినేతలతో పాటు సిపిఐ నాయకులు, పార్టీ కార్యకర్తలపై కూడా హత్యాయత్నాలకు దిగారని ఇది దారుణచర్య అని సిపిఐ ఖండించింది. ఇలాంటి దాడులను ప్రజాస్వామికవాదులంతా ఖండించాలని, లాంగ్‌మార్చ్ పట్ల మరింత సంఘీభావం ప్రదర్శించారలని పార్టీ వర్గాలు ఓ ప్రకటన వెలువరించాయి.

రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కెఎస్ఆర్ బెంగుళూరు, హౌరా సూపర్‌ఫాస్ట్ ప్రత్యేక రైలు ఆగస్టు 29న మధ్యాహ్నం 3.10 గంటలకు కెఎస్ఆర్ బెంగుళూరు నుండి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు హౌరా చేరుకుంటుంది. హౌరా, యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ప్రత్యేక రైలు ఆగస్టు 3న హౌరా నుండి ఉదయం10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు యశ్వంత్‌పూర్‌కు సాయంత్రం 6.25 గంటలకు చేరుకుంటుంది. బెంగుళూరు కంటోన్మెంట్, మాల్డా టౌన్ వన్ వే సూపర్‌ఫాస్ట్ ప్రత్యేక రైలు ఆగస్టు 30న రాత్రి 11.40 గంటలకు బెంగుళూరు కంటోన్మెంట్ నుండి బయలుదేరి శుక్రవారం సాయంత్రం 5.15 గంటలకు మాల్డా టౌన్‌కు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు విజయవాడ తదితర స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఎసి టూ టైర్, ఎసి త్రీ టైర్, స్లీపర్, సెకెండ్ క్లాస్ కోచ్‌లుంటాయి.

నేడు 'ఎంబిబిఎస్' కౌన్సెలింగ్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎంబిబిఎస్‌లో ప్రవేశాల కొరకు వెబ్ ఆధారిత కౌన్సిలింగ్‌లో భాగంగా మోపప్ రౌండ్ కొరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను ఆగస్టు 29న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎంపిక చేసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎ కేటగిరీ క్రింద కేటాయించిన సీట్లలో మూడ దశ కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత కూడా ప్రవేశం పొందని అభ్యర్థుల కారణంగా మిగిలిన ఖాళీ సీట్లకు ఈ అవకాశం కల్పిస్తున్న కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడాలని సూచించారు. అదే విధంగా మూడవ, నాల్గవ దశ కౌన్సిలింగ్‌లో భర్తీ కాని బిడిఎస్ సీట్ల కోసం సెప్టెంబర్ 3,4 తేదీల్లో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు.

గొర్రెల గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)




వ్యాప్తంగా 6 వేలకు పైచిలుకు గొర్రెలు చనిపోయినా, ఏ ఒక్క గొర్రెకు బీమా వర్తించక, పరిహారం అందడం లేదు. లబ్దిదారుడిని ఆదుకోవాల్సిన బీమా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇన్సూరెన్సు కంపెనీకి పంటపడిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల అధికారిక సంఖ్య 69,682గా ఉంది. అంటే యూనిట్‌కు 20 గొర్రెలు ఒక పొట్టేలు చొప్పున మొత్తం 14,63,322 గొర్రెలు పంపిణీ చేశారు. కానీ గొర్రెల, మేకల ఫెడరేషన్ వెబ్‌సైట్ తెలంగాణ జీవసమృద్ధి ప్రకారం 29,278 యూనిట్లు రిపోర్ట్ చేసినట్లు పేర్కొనడం గమనార్హం. ఇందులోనూ బీమా చేసిన యూనిట్ల సంఖ్య కేవలం 8796 మాత్రమే అంటే 1,84,716 గొర్రెలకే బీమా చేశారు. అధిక సంఖ్యలో గొర్రెలు చనిపోయినా ఇన్సురెన్సు కంపెనీకి ప్రభుత్వం రిపోర్ట్ చేసింది కేవలం 13 యూనిట్లుగా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వీటిలోనూ ఏ ఒక్కదానికి పరిహా రం అందలేదు. నిబంధనల ప్రకారం పాలసీ జనరేట్ అయిన తరువాత, 15 రోజులకు గొర్రె ఏదైనా కారణం చేత చనిపోతేనే పరిహారం అందిచాలి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల సంఖ్య 4556గా అధికారులు నివేదించారు. ఇన్సూరెన్సు కంపెనీకి రిపోర్ట్ చేసింది మాత్రం 1139 యూనిట్లుగా ఉండటం గమనార్హం. ఇందులోనూ ఫోటో తీసిన గొర్రెల యూనిట్ల సంఖ్య 174 కాగా, 965యూనిట్లు ఫోటో లు లేకుండా ఉన్నవి. ప్రతి జిల్లాలోనే ఇలాగే ఉంది. ఈ లెక్కన ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల పూర్తి వివరాలు కొనుగోలు చేసిన వెంటనే ఇన్సురెన్సు కంపెనీకి అందాల్సి ఉంది. ఇప్పుడు అది జరగడం లేదు. దీంతో గొర్రెలు చనిపోయినా బీమా రావడం లేదు. ఈ క్రమంలో ఒక్కసారే గొర్రెలన్నింటికీ ఏదైనా అంటువ్యాధి వచ్చి చనిపోతే లబ్దిదారుడు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

పంపిణీ చేసిన గొర్రెలే మళ్లీ కొనుగోలు ! : బీమా సరిగ్గా చేయకపోవడంతో ముందుగా లబ్దిదారులకు పంపిణీ చేసిన గొర్రెలే మళ్లీ ఇతర రాష్ట్రాలలో దర్శనమిస్తున్నాయి. మళ్లీ వీటినే కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నారే విమర్శలు వస్తున్నాయి. దీంతో యదేచ్ఛగా రీసైక్లింగ్ అవుతున్నాయి. అసలు గొర్రెల రీసైక్లింగ్ జరగకుండా ప్రభుత్వం ముందుగానే రాష్ట్రంలో ఉన్న గొర్రెలన్నింటికి చెవిపోగులు కుట్టించాలని ఉత్తర్వులు (జిఓ నంబర్ 52) జారీ చేసింది. ఇప్పుడు ఈ ఉత్తర్వులు తుంగలో తొక్కారు. మళ్లీ పోగులు వేయకుండానే గొర్రెలను కొనుగోలు చేసి మళ్లీ వాటిని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి కొనుగోలు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

'నిమ్స్'లో రోగులకు ఆన్‌లైన్ సేవలు

● ఆరోగ్య విభాగాల మధ్య కంప్యూటర్‌తో అనుసంధానం




మన తెలంగాణ/హైదరాబాద్ : సమాచార వ్యవస్థను సంపూర్ణంగా వినియోగించుకోవడం ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలనందించాలని నిమ్స్ నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ కౌంటర్, సంబంధిత వైద్యులు, రోగ నిర్ధారణ కేంద్రం, ఫార్మసీల మధ్య రోగి చేత బట్టుకుని కాగితాలతో వెళ్లకుండా ఆన్‌లైన్‌లో సమాచార మార్పిడి ద్వారా రోగి భారాన్ని తగ్గించాలని భావిసున్నది. సమాచార వ్యవస్థతో పాటు రికార్డుల వ్యవస్థను కూడా ఆన్‌లైన్ చేయనున్నారు. తొలి దశలో బయటి రోగుల సేవలన్నింటిని కంప్యూటరైజేషన్ పరిధిలోకి తీసుకురానున్నారు. ఇందుకోసం ఆసుపత్రికి వచ్చే రోగులకుప్రత్యేక గుర్తింపు సంఖ్యను (సెంట్రల్ రిజిస్ట్రేషన్ నెంబర్) ఇవ్వనున్నారు. దీర్ఘకాలంలో రోగి వివరాలను ఆధార్‌కు అనుసంధానం చేయనున్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఒక సారి రోగి ఆధార్ నెంబర్‌ను అవుట్ పేషెంట్ ఫాంలో ఆ రోగి వివరాలు నమోదవుతాయని తెలుస్తోంది. దీనితో ఒపి విభాగంలోని వైద్యుని వద్దకు రోగి నేరుగా వెళ్లే వీలు కలుగుతుంది. ఒక సారి ఆధార్ నెంబర్ అనుసంధానం తర్వాత ఆ రోగి వివరాలు వైద్యుని వద్దకు, రోగ నిర్ధారణ కేంద్రానికి ఆన్‌లైన్‌లో వెళతాయి. వైద్యులు చూసిన తర్వాత ఆ రోగికి ఏవైనా పరీక్షలు అవసరమని భావిస్తే వైద్యులు ఆ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే సిఫారసు చేస్తారు. రోగి నేరుగా రోగ నిర్ధారణ కేంద్రానికి వెళ్లవచ్చు. పరీక్షల తర్వాత వాటి ఫలితాల కోసం మరోసారి ఆసుపత్రికి రాకుండా ఆన్‌లైన్‌లో తీసుకునే సౌకర్యం కల్పించనున్నారు. అవే ఫలితాలను ఆన్‌లైన్‌లో సంబంధిత వైద్యునికి చేరవేస్తారు. వైద్యులు సూచించిన ఔషధాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొనే వీలు లేకుండా హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్) ద్వారా వైద్యుని నుండి ఆన్‌లైన్ ఔషధాల పేర్లతో సహా వివరాలు ఫార్మసీకి చేరుకుంటుంది. మొత్తం ప్రక్రియలో పేపర్ వాడకం తగ్గడంతో పాటు రోగి పని సులువుగా మారడంతో పాటు రిజిస్ట్రేషన్, వైద్యులు, రోగ నిర్ధారణ కేంద్రం, ఫార్మసీ మధ్య అవసరమైన అనుసంధానం ఏర్పడి సేవలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డు నిర్వహణ సులభంగా మారి రద్దీ తగ్గే అవకాశముంది.

మొబైల్ యాప్‌తో వైద్య సేవలు : త్వరలో పలు సేవలనందించే మొబైల్ యాప్‌ను తీసుకు రావాలని భావిస్తున్నారు. దీనితో ఆన్‌లైన్ విచారణ, రిజిస్ట్రేషన్స్ కోసం ఉపయోగించుకోవడంతో పాటు ల్యాబ్ రిపోర్ట్స్‌ను డౌన్‌లోడ్‌తో పాటు అందుబాటులో ఉన్న బెడ్స్ వివరాలు, స్పెషల్ క్లినిక్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ బిల్ పేమెంట్ తదితర సేవలందించాలని భావిస్తున్నారు.ఈ విధానంలో రోగు ల తమ పరీక్షల రిపోర్టులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముండడంతో వారు ఫలితాల కోసం మరోసారి ఆసుపత్రికి రావాల్సిన అవసరముండదు. అని ల్యాబ్‌లకు తిరగాల్సిన పని లేకుండా అన్నింటిని ఒక చోటికి చేర్చాలని యోచిస్తున్నారు.అలాగే స్పెషలిస్టుల అపాయింట్‌మెంట్‌ను ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకునే అవకాశం కూడా అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

సింగిల్ విండోతో రోగులకు మేలు : సింగిల్ విండో విధానంతో రోగులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.మనోహర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రోగులకు మెరుగైన సేవలనందించే విషయంపై ఆయన మన తెలంగాణతో మాట్లాడుతూ, తొలి దశలో సమాచార వ్యవస్థ, రికార్డు వ్యవస్థలపై దృష్టి సారించామన్నారు. బయటి రోగుల సేవలను ఆన్‌లైన్ చేయడం ద్వారా రోగులకు ఎంతో మేలు చేకూరనుందని, పలు చోట్లకు తిరిగే అవసరం ఉండదని అన్నారు. నెల రోజుల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.

డోక్లాం వివాదం సుఖాంతం

(మొదటిపేజీ తరువాయి)



ఇరు దేశాలు సరైన రీతిలో తమ వైఖరిని స్పష్టం చేశాయని, తమతమ లాభనష్టాలను బేరీజు వేసుకున్నాయని, ఈ క్రమంలో శాంతియుత ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఇరు దేశాలు శాంతియుత అంగీకారానికి రావడంతో ఉభయదేశాల సైనిక దళాలు వెనక్కి వెళ్లడం మొదలైంది. ఈ ప్రాంతానికి భారతదేశం 350 మంది సైనిక సిబ్బందిని పంపించింది. సిక్కింకు సమీపంలోని డోక్లామ్ నుంచి భారతీయ సైనికులు వెనుదిరుగుతున్నారు. జూన్ 16 నుంచి రెండు దేశాల మధ్య డోక్లామ్ వివాదం రాజుకుంటూ వచ్చింది. ఈ వివాదాస్పద ప్రాంతంలో చైనా సైన్యం రహదారి నిర్మాణానికి పాల్పడటాన్ని భారతీయ సైన్యం అడ్డుకుంది. దీనితో పరస్పర వాడివేడి వ్యాఖ్యలు, చివరికి బల ప్రయోగపు సంకేతాల వరకూ పరిస్థితి వెళ్లింది.

కాపలా సాగుతుంది : చైనా : చైనా బలగాలు ఈ ప్రాంతాల నుంచి వైదొలుగుతున్నాయా? లేదా అనేది స్పష్టం కాలేదు. భారత విదేశాంగ శాఖ కానీ, చైనా అధికార వర్గాలు కానీ దీని గురించి నిర్థిష్టంగా వివరణ ఇవ్వలేదు. అయితే భారతీయ బలగాలు వెనక్కి వెళ్లిపోతున్న విషయాన్ని చైనా వెల్లడించింది. బీజింగ్‌లో చైనా విదేశాంగశాఖ ప్రతినిధి హ్యూవా ఛ్యూయింగ్ డోక్లాం పరిణామాలపై విలేకరులతో మాట్లాడారు. భారతీయ సైన్యం వెనక్కిపోతున్న విషయాన్ని నిర్ధారించుకన్నామని తెలిపారు. పరిస్థితికి అనుగుణంగా చైనా స్పందిస్తూ ఉంటుందని, సర్వసత్తాకత కొనసాగుతుందని స్పష్టం చేశారు.భారతీయ సైనికులు, అక్కడి తమ పనిముట్లతో పాటు తమ భూభాగంలోకి వెళ్లిపొయ్యారని, చైనా బలగాలు ఇప్పటికీ ఈ ప్రాంతంలో పహారా కాస్తున్నాయని ఆమె తెలిపారు.చారిత్రక ఒప్పందాల మేరకు చైనా సార్వభౌమాధికార పరిరక్షణ, అదే సమయంలో ప్రాదేశిక సమగ్రత భద్రతకు దిగుతుందని వ్యాఖ్యానించారు. చైనా రాజధాని చైనాలోని క్సియామెన్‌లో ఐదు దేశాల బ్రిక్స్ సదస్సు వచ్చే నెల 3 నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న తరుణంలో ఓ వైపు అంగీకారం కుదిరిన వార్తలు, మరో వైపు చైనా అధికార ప్రకటన కొంత అయోమయానికి దారితీసింది.

ఏకపక్ష విరమణ పనే లేదు : భారత్ : ఢిల్లీలో విదేశాంగ ప్రతినిధి వివరణ వెలువరించారు. ఏకపక్ష ఉపసంహారణ అవసరం భారత్‌కు లేదని, ఉభయపక్షాలు వైదొలగడమే కీలక అంశం అని స్పష్టం చేశారు. భారతీయ దళాలే వెనక్కి వెళ్లడం జరిగితే ఇక రాజీ మార్గానికే అర్థం లేదని తెలిపారు. ఇరు దేశాల సైనికుల ఉపసంహరణ వేగవంతం అవుతుందని, ఉద్రిక్తతల నిలయం నుంచి సైనికులు తలపడే పరిస్థితి నివారణ జరుగుతుందని వివరించారు. గత కొద్ది వారాలుగా ఇరు పక్షాల మధ్య దౌత్యపరంగా డోక్లామ్‌పై సంప్రదింపులు సాగుతూ వచ్చాయని, ఇందులో భాగంగానే ఇప్పుడు ఈ అంగీకారం కుదిరిందని భారత ప్రతినిధి తెలిపారు. దేశ ప్రయోజనాల గురించి ఆందోళన వ్యక్తం చేయాల్సిన పనిలేదని,మన అభిప్రాయాలను తెలియచేశామని వివరించారు.

రాజీవ్ స్వగృహకు డైరెక్టర్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా రాజీవ్ స్వగృహకు కార్పొరేషన్ లిమిటెడ్‌కు ప్రభుత్వం బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌ను నియమించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి చిత్ర రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ఎక్స్ ఆఫిషియో ఛైర్మన్‌గా గృహనిర్మాణ శాఖ స్పెషల్ సిఎస్ వ్యవహరించనున్నారు. అలాగే డైరెక్టర్స్‌గా రెవిన్యూ స్పెషల్ సిఎస్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎమ్‌డిలు, గృహ నిర్మాణ కమిషనర్లు డైరెక్టర్లుగా ఉండనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

బంగారం పట్టివేత

మన తెలంగాణ/శంషాబాద్ : అక్రమంగా విదేశాల నుంచి 1506గ్రాముల బంగారం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బంగారంను స్వాధీనం చేసుకున్నా సంఘటన సోమవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది.కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఎయిర్ ఏసియా ఫ్లైట్ ఎకె 069లో వచ్చిన ఒక ప్రయాణికుడు, దుబాయ్ నుంచి వచ్చి న మరో ఫ్లైట్ ఎయిర్ ఇండియా నెం.952లో వచ్చిన మరో ఇద్దరు వచ్చారు. ఈ ముగ్గురు అక్రమంగా విదేశాల నుంచి బంగారాన్ని తరలిస్తునట్లు సమాచారం అందింద న్నారు. దీంతో ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నాలుగు బంగారు చైన్లు,24క్యారెట్ల ఆరు బంగారు కడసులు ఉన్నట్లు తెలిపారు. వీటి బరువు 1506గ్రాముల ఉన్నట్లు తెలిపారు. బంగారాన్ని స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. ఈ బంగారం విలువ రూ.45,01,445 లక్షలు ఉంటుందన్నారు. వీరిని తదుపరి విచారణ కోసం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

విభజన కమిటీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌పిఎఫ్‌లో ఆరుగురు, కార్మిక శాఖలో ఇద్దరు ఉద్యోగుల కేటాయింపులపై చర్చించారు. అయితే వైద్య శాఖలో 13 మందిలో ముగ్గురిని, ఒక ఎస్‌పిఎఫ్ ఉద్యోగిని తెలంగాణకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కార్మిక శాఖకు చెందిన ఇద్దరిని, మగ్గురు ఎస్‌పిఎఫ్ ఉద్యోగులను ఎపికి కేటాయించాలని తీర్మానించారు. కేవలం తొమ్మిది మంది ఉద్యోగుల విభజనపై నిర్ణయం తీసుకున్నారు. మిగతా ఉద్యోగులపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. డిప్యూటీ కలెక్టర్లు, నాన్ క్యాడర్ ఎస్‌పి, డిఎస్‌పిలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ల సీనియార్టీ జాబితాను ఖరారు చేసి సెప్టెంబర్ 30వ తేదీలోపు ప్రకటిస్తామని ఎపి ప్రధాన కార్యదర్శి డిఒపిటి కార్యదర్శికి తెలిపారు. సీనియార్టీ ఖరారు అయిన తరువాత ఈ ఉద్యోగుల విభజన చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 55,870 రాష్ట్రస్థాయి ఉద్యోగుల విభజన పూర్తయిందన్నారు. ఇందులో ఎపికి 31,611 మంది, తెలంగాణకు 24,259 మంది కేటాయించడం జరిగిందని వివరించారు. ఎపి స్థానికత కలిగిన 24 మంది సెక్షన్ ఆఫీసర్ల (ఎస్‌ఒ)ను తెలంగాణకు కేటాయించిన అంశాన్ని తెలంగాణ ప్రధాన కార్యదర్శి లేవనెత్తారు. అయితే ఈ అంశాన్ని రెండు రాష్ట్రాలు తేల్చుకోవాలని, కేంద్రానికి సంబంధం లేదని డిఒపిటి కార్యదర్శి స్పష్టం చేశారు.

తెరలేచిన మరో ఆట

(మొదటిపేజీ తరువాయి)

వెలివేస్తున్నట్లు నిర్ణయించి అధికార ప్రకటన వెలువరిస్తున్నామని పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. దినకరన్ ఈ మధ్యకాలంలో పార్టీలో చేపట్టిన నియామకాలు, బహిష్కరణలు చెల్లుబాటు కావని ముఖ్యమంత్రి కె పళనిస్వామి తెలిపారు. జయలలిత మరణం తరువాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లుగా చేసిన ప్రకటన చెల్లుబాటులోకి రాలేదని, ఆమె నియామకానికి ఎన్నికల సంఘం కూడా ఆమోదం తెలియచేయలేదని, ఈ దశలో శశికళకు పార్టీతో ఎలాంటి సంబంధాలు లేవని, ఉన్నట్లుగా భావించుకుంటే చెల్లుబాటు కాదని, పార్టీ నుంచి ఆమెను, దినకరన్‌ను బహిష్కరిస్తున్నామని పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి పళనిస్వామి అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. దీనికి ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరు అయ్యారు. శశికళను పార్టీ నుంచి బహిష్కరించడం తమిళనాడులో కీలకంగా మారింది. శశికళ ఆధ్వర్యంలో ఉన్న జయ టీవీ,నమదు ఎంజిఆర్ పత్రికను పార్టీ నియంత్రణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నమదు ఎంజిఆర్ పత్రిక జయ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఉంది. దీనికి శశికళ యజమానురాలుగా ఉన్నారు. జయ టీవీని మ్యాజిక్ . కామ్ నిర్వహిస్తోంది. పార్టీ తీసుకున్న నిర్ణయాలను తరువాత అన్నాడిఎంకె ఎంపీ ముతుకరప్పన్ విలేకరులకు తెలిపారు. పార్టీ అధినేత్రి జయలలిత మరణం తరువాత పార్టీలో ఏర్పడ్డ చీలిక తరువాత ఈ మధ్యనే రెండు వర్గాలు కలిసిపోవడం వంటి పరిణామాలపై శశికళ మేనల్లుడు దినకరన్ తిరుగుబాటుకుదిగారు. సొంతగా రాష్ట్ర వ్యాప్త పర్యటన తలపెట్టారు. శశికళకు వ్యతిరేకులుగా నిలిచిన వారందరిని పార్టీ నుంచి ఆయన తన ఉప ప్రధాన కార్యదర్శి హోదాలో తొలిగిస్తూ వచ్చారు. అయితే శశికళపై, దినకరన్‌పై వేటుపడింది. ఇక వారు ఏ నిర్ణయాలు తీసుకున్నా చెల్లనేరవని , అయినా పార్టీ నిబంధనావళి మేరకు దినకరన్ నియామకం జరగలేదని ,ఎన్నికల సంఘం కూడా దీనిని నిర్ధారించలేదని ముతుకరప్పన్ చెప్పారు.పార్టీలో చివరికి పళనిస్వామిని కూడా బహిష్కరిస్తున్నట్లు దినకరన్ ప్రకటనలు చేయడం, తమ వైపు ఎమ్మెల్యేల బలం ఉందని చెపుతూ ఉండటంతో దినకరన్‌కు జైలులో ఉన్న శశికళకు చెక్ పెట్టేందుకు అధికార పార్టీ వర్గాలు నిర్ణయించినట్లు వెల్లడైంది. అయితే సోమవారం నాడు జరిగిన పార్టీ సమావేశానికి ఎందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారనే అంశంపై అధికారికంగా వివరణ ఇవ్వలేదు.

40 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు? : పార్టీ సర్వసభ్య సమావేశానికి 40 మంది ఎమ్మెల్యేలు హాజరు కాలేదని వెల్లడి అయింది. దీనితో ఏకమైన పళని, పన్నీరు శిబిరాలలో ఆందోళన నెలకొంది. వీరంతా దినకరన్‌కు అనుకూలంగా ఉన్నారనే వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికే 27 మంది పార్టీ ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని విండ్‌ఫ్లవర్ రిసార్ట్‌లో తమ క్యాంప్‌లో ఉన్నారని దినకరన్ చెపుతూ వస్తున్నారు. అయితే సర్వసభ్య సమావేశం గురించి తమకు ముందుగా ఆహ్వానం లేదని, అయినా తాము దినకరన్ వెంటనే నడుస్తామని పార్టీ ఎమ్మెల్యే తంగ తమిళ సెల్వన్ తెలిపారు. డిఎంకెకు మద్దతుగా తాము నిలుస్తామనే వార్తలను ఖండించారు. అధికార శిబిరంలో చాలా మంది తమ వైపువారు ఉన్నారని, వారంతా సమయం చూసుకుని దినకరన్ శిబిరంలో చేరుతారని ఆయన చెప్పడం రాజకీయ దుమారానికి దారితీసింది. దినకరన్, డిఎంకెలతో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని ఈ దిశలో తెరవెనుక ప్రయత్నాలు జోరందుకున్నట్లు తెలిసిందని సుబ్రహ్మణ్యస్వామి స్పందించడం కీలకంగా మారింది. మరోవైపు మారిన పరిస్థితుల్లో అసెంబ్లీలో బలాల బలాల సమీకరణలు మారినందున అసెంబ్లీలోనే బలపరీక్ష జరగాల్సి ఉందని డిఎంకె, దినకరన్ వర్గాలు వేర్వేరుగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాయి.

20 ఏళ్లు

(మొదటిపేజీ తరువాయి)

తాను చెప్పినట్లు వింటారనే దీమాతో ఉన్న గుర్మీత్ ఈ తీర్పుతో షాక్‌కు గురయినట్లు వెల్లడైంది. కన్నీరు పెట్టుకున్నారని తెలిసింది. జైలు శిక్షలతో పాటు గుర్మీత్ ఒక్కో కేసులో రూ 15 లక్షల జరిమానా చెల్లించుకోవల్సి ఉంటుందని జడ్జి ఆదేశించారు. వీటిలో రూ 14 లక్షల వరకూ బాధితురాళ్లకు వేర్వేరుగా వెళ్లుతాయి. గుర్మీత్ డేరాలోనే ఉంటూ బలవంతంగా ఆయన చేతుల్లో లైంగికంగా బలయిన ఈ బాధితులకు చెందేలా చేస్తారు. గుర్మీత్ సామాజిక కార్యకర్త అని, ప్రజాహిత కార్యక్రమాలు చేశారని ఆయనపై దయ చూపాలని ఆయన తరపు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. తమ క్లయింట్‌కు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సిబిఐ కోర్టు తీర్పును తాము హైకోర్టులో సవాలు చేస్తామని లాయర్లు తెలిపారు. అయితే ఈ వాదనను ప్రాసిక్యూషన్ వారు తోసిపుచ్చారు. ఇలాంటి ఘోర నేరాలకు సంబంధించి కఠినంగానే వ్యవహరించాలని, భవిష్యత్తులో ఈ విధమైన నేరాలు జరగకుండా శిక్ష తీవ్రత ఉండాలని సూచించారు. గుర్మీత్‌ను ఉంచిన స్థానిక సునారియా జైలులోని గదిలోనే తీర్పు వెలువరించారు. శుక్రవారం నుంచి ఆయన ఖైదీలా ఉంటున్నారు. తనకు శిక్ష ఖరారు చేస్తున్న తరుణంలో గుర్మీత్ వెక్కివెక్కి ఏడ్చినట్లు, చేతులు జోడించి క్షమాభిక్ష వేడుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. స్థానిక జైలు రోహ్‌తక్‌కు శివార్లలో ఉంది. ఈ ప్రాంతంలో శుక్రవారం నుంచే భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జైలు సమీపంలోని హెలిపాడ్ వద్దకు న్యాయమూర్తి హెలికాప్టర్ వస్తున్న దశలో భారీ సంఖ్యలో భద్రతా బలగాలు మోహరించుకుని ఉన్నాయి.

క్షమించరాని నేరం - జడ్జి : గుర్మీత్‌కు శిక్ష ఖరారు సందర్భంగా న్యాయమూర్తి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. జరిగింది క్షమించరాని నేరం అని, నమ్ముకుని వచ్చి ఆశ్రమంలో ఉంటున్న వారిని లొంగదీసుకుని అత్యాచారానికి పాల్పడటం దారుణం అన్నారు. అమానుషంగా వ్యవహరించిన గుర్మీత్‌కు యావజ్జీవ శిక్ష విధించాలని బాధితురాలు తెలిపారని గుర్తు చేశారు. గుర్మీత్‌ను సాధారణ ఖైదీలాగా చూస్తూ, తాము పేర్కొన్నట్లుగా కఠిన కారాగారశిక్ష అమలు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విఐపిలాగానే ఇప్పటికీ గుర్మీత్‌ను పోలీసులు చూస్తున్నారనే వార్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపిస్టుకు సకల సౌకర్యాలు కల్పిస్తారా? అని ప్రశ్నించారు. న్యాయమూర్తి తీర్పు తరువాత చాలా సేపటి వరకూ గుర్మీత్ అక్కడే నిలబడి ఉన్నట్లు, బయటికి రావడానికి నిరాకరించినట్లు వెల్లడైంది. అయితే పోలీసులు వచ్చి బలవంతంగా ఆయనను జైలుకు తరలించారు. అంతకు ముందు వైద్యపరీక్షలు నిర్వహించి సాధారణ ఖైదీల దుస్తులు అందించారు. తరువాత ఆయనకు కేటాయించిన సెల్‌కు తరలించారు.

అధికారులతో సిఎం ఖట్టర్ భేటీ...ఇంటర్నెట్ కట్

సోమవారం తీర్పు నేపథ్యంలో హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సీనియర్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పార్టీ నేతలు, కొందరు మంత్రులు కూడా పాల్గొన్నారు. సిఎం నివాసంలో జరిగిన సమావేశంలో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. తీసుకోవల్సిన జాగ్రత్తలను బేరీజు వేసుకున్నారు. అంతకు ముందు రోహ్‌తక్ జిల్లా కలెక్టర్ అతుల్ కుమార్ స్పందిస్తూ అల్లరిమూకలపై కాల్పులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అనేక ప్రాంతాలలో ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు. జైలు ఆవరణకు పది కిలోమీటర్ల పరిధి వరకూ ఎవరిని అనుమతించలేదు. మరో వైపు పంచ్‌కుల, సిర్సా, ఉత్తరప్రదేశ్ సమీప రాష్ట్రాలలో హై అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల 144 సెక్షన్‌ను కొనసాగించారు. ప్రధాన రహదారులపై పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. ఇక హర్యానా పంజాబ్‌లలో జాగ్రత్త చర్యలలో భాగంగా ఉదయం 11 గంటల వరకూ మొబైల్ ఇంటర్నెట్ సేవలనునిలిపివేశారు. శిక్షలపై తీర్పు వెలువడుతున్నందున ఉద్రిక్తతలకు తావు ఇవ్వకుండా ఉండేందుకు ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గుర్మీత్ ఆశ్రమానికి చాలా సేపటి వరకూ ఇంటర్నెట్ ఫోన్ సౌకర్యాలను నిలిపివేశారు. డేరా దరిదాపుల్లో భద్రతా సిబ్బంది పహారా కాసింది. కొందరు శిష్యులు డేరా వదిలి వెళ్లినా ఇప్పటికీ అసంఖ్యాకంగా లోపలే ఉన్నట్లు వెల్లడైంది.

కమలంపై కారు గేమ్!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుండటంతో నేతల ముందటి కాళ్ళకు బంధాలు పడుతున్నాయి. ఏది ఏమైనా ముందుకు సాగుదామని అనుకునేలోగా కేంద్రం తీసుకున్న ఏదో నిర్ణయంపై ఆయన తీయని పొగడ్త వినిపించి తమ కంటే ముందుగానే ప్రజల్లో మోడీని దేవుడిలా చూపడం చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో పోలుపోని పరిస్థితిలో రాష్ట్ర బిజెపి పడిపోయింది. మరోవైపు టిఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ పోరాట బాణాన్ని ఎక్కుపెట్టింది. టిడిపికి రాష్ట్రంలో చెప్పుకోతగ్గ నేతలు లేకున్నా ఉన్న కొంత మంది కూడా గట్టిగానే ప్రభుత్వంపై పోరాటానికి దిగుతున్నారు. వామపక్షాలు కూడా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందిస్తూనే ఉన్నాయి. వీరికి తోడుగా తెలంగాణ జెఎసి కూడా సర్కార్ వైఫల్యాలను ఎండగట్టేందుకు తనదైన శైలిలో ప్రజల ముందుకు వెళ్తోంది. కానీ బిజెపి ఏం చేస్తుందో ఎవరికీ అంతు చిక్కని స్థితిలో ఉంది. విపక్షాలతో గొంతు కలపలేక, అధికారపక్షంతో అంటకాగలేక డోలాయమాన స్థితిలో పడింది. మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన జిఎస్‌టి బిల్లుపై ముందుగానే స్పందించి మద్దతివ్వడంతో పాటు , ఎన్‌డిఎ భాగస్వామి టిడిపి అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కంటే ముందుగానే అసెంబ్లీలో ఆమోదం తెలిపింది కెసిఆర్ ప్రభుత్వం. నోట్ల రద్దుపై కొందరు రాష్ట్ర మంత్రులు సన్నాయి నొక్కులు నొక్కినా కెసిఆర్ మాత్రం బాహటంగానే స్వాగతించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బేషరతుగా కెసిఆర్ మద్దతు 0ఇచ్చారు. రాష్ట్రపతి అభ్యర్థిగా రాష్ట్రానికి వచ్చిన కోవింద్‌కు అమోఘమైన రీతిలో స్వాగతం పలికి అద్భుతమైన సన్మానం చేసి ఫిదా చేసుకున్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు ఘన సన్మానం చేసి ప్రసంశలను అందుకున్నారు. గతంలోనూ మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావుకు, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయలకు పౌర సన్మానం చేసి ఔరా అనిపించారు. ఇవన్నీ రాష్ట్ర బిజెపి నాయకత్వానికి కొంత ఇబ్బందికర పరిస్థితులను తెచ్చి పెడుతున్నాయి. మూడు రోజుల రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్‌షా చేసిన ఆరోపణలపై కెసిఆర్ పరుషంగా మాట్లాడినా అందుకు తగిన రీతిలో స్పందించలేని పరిస్థితి బిజెపిది. ఎంఐఎంతో సన్నిహితంగా ఉంటూ బిజెపిని ఇరుకున పెట్టే ఎన్నో నిర్ణయాలు తీసుకున్నా పోరాటం చేయడంలో కమలనాథులు విఫలమయ్యారు. తన సర్వేలలో బిజెపికి తెలంగాణలో స్థానం లేదని, వస్తే గిస్తే ఒక్క సీటు వస్తుందని చెప్పి దిమ్మ తిరిగేలా చేసినా సరైన జవాబిచ్చే స్థితిలో బిజెపి నాయకత్వం లేకుండా పోయింది. ఈ విషయాలన్నింటినీ గుర్తించిన పార్టీ కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. రాష్ట్రంలో బిజెపి బలపడేందుకు రాష్ట్ర నాయకత్వంతో సంబంధం లేకుండా పార్టీ అగ్ర నాయకత్వం దృష్టి పెట్టింది. తెలంగాణలో పార్టీ విస్తరణ కోసం స్వయంగా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పర్యవేక్షిస్తున్నారు. 2019 ఎన్నికల్లో స్థానిక నాయకులతో సంబంధం లేకుండానే గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణపై అమిత్‌షా స్వయంగా దృష్టి కేంద్రీకరించడంతో పాటు టిఆర్ఎస్‌లోని కొందరి నేతలపై వల వేసినట్లు తెలియడంతోనే కెసిఆర్ ఆయనపై కయ్యానికి కాలు దువ్వారని అంటున్నారు.

నంద్యాలలో టిడిపి

(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. నంద్యాలలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపొందగా, పనాజిలో బిజెపి అభ్యర్థులు, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్, వాల్‌పోయ్‌లో ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి విశ్వజిత్ రాణె, బావనలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఎఎపి) అభ్యర్థి రామ్‌చందర్ గెలిచారు. ఈనెల 23న జరిగిన ఉప ఎన్నికల జరగగా, సోమవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో పనాజి నుంచి పోటీ చేసిన పారికర్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి గిరీశ్ చోదంకర్‌పై 4803 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పారికర్‌కు 9862 ఓట్లు పోల్‌కాగా, చోదంకర్‌కు 5059 ఓట్లు వచ్చాయి. పారికర్ మాట్లాడుతూ ఉప ఎన్నికలో భారీ విజయంతో గెలుపొందడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కోటి ఎకరాలకు సాగునీరే సిఎం లక్ష్యం : మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/ధర్మపురి: రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగు నీరు అందించి బీడు భూములను సశ్యశ్యామలం చేయడమే సిఎం కెసిఆర్ లక్ష్యమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించి దేశంలోనే గొప్ప జిల్లాగా మార్చబోతున్నామన్నారు. జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి ఎంపి బాల్క సుమన్‌లతో కలిసి హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 32కోట్ల వ్యయంతో చేపట్టిన తిమ్మాపూర్, రాయపట్నం ఎత్తి పోతల పథకం ద్వారా 3400 ఎకరాలకు సాగునీరంది స్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎల్లంపల్లి ప్రాజెక్టును సంవత్సర కాలంలో అనుసంధానం చేయనున్నామన్నారు. రూ.1000 కోట్లతో వరద కాలువను రిజర్వాయర్‌గా మార్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ద్వారా40 వేల ఎకరాలకు సాగునీరందించనున్నామన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాలు పూర్తవడం రైతుల వరమని చెప్పారు. నియోజక వర్గంలోని రాజారం, జైన,దొంతాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయ్యాయని, నెల రోజుల్లో వాటిని కూడా ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు.

మెడికల్ కాలేజ్ కోసం అఖిల పక్ష నేతల పాదయాత్ర



మన తెలంగాణ/ సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డికి మెడికల్ కాలేజ్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం నేతలు సంగారెడ్డిలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. స్థానిక ఐబి నుంచి కొత్త బస్టాండ్ వరకు ఈ ర్యాలీ జరిగింది. టిజెఎసి చైర్మన్ అశోక్‌కుమార్, కన్వీనర్ బీరయ్య యాదవ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దిన్‌లు మాట్లాడుతూ సంగారెడ్డిలో మెడికల్ కాలేజ్ మంజూరు చేయడానికి ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలని, సిఎంకు నివేదించాలని డిమాండ్ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌ను ఉద్యోగుల కోసం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని వైద్య విభాగాలకు సూపర్ స్పెషలిస్టులను నియమించాలన్నారు. లేనిపక్షంలో అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అందోల్ కృష్ణ, నీలిదండు నరేష్, పిఆర్‌పిఎస్ చైర్మన్ అనంతయ్య, జిల్లా కోకన్వీనర్లు లక్ష్మయ్య, మల్లయ్య, విద్యార్థి సంఘం నాయకులు ఎర్రొళ్ల పోచయ్య, పిడిఎస్‌యు సురేష్, బిసి విద్యార్థి సంఘం నాయకుడు ఈశ్వర్, సంగమేశ్వర్, యాదగిరి, టిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూమి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు సాబేర్ అలీ, వాజిద్ బేగ్, సిపిఐ నాయకులు తాజొద్దిన్, రహమాన్, జెఎసి నాయకులు తుల్జారెడ్డి, మురళి, మల్లారెడ్డి, సురేష్, ఆశప్ప, సామ్యూల్, మాణిక్యం, లక్ష్మయ్య, జగదీష్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నపురి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మన తెలంగాణ/ హత్నూర : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కలఖానాపూర్ శివారులోని రత్నపురి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహంలో సోమవారం అర్ధరాత్రి అగ్రికల్చర్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనకపల్లి సహస్ర(17) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి గ్రామానికి చెందిన రాజశేఖర్, అరవిందలకు కూతురు సహస్ర, కుమారుడు ఉన్నారు. గత సంవత్సరం ఎస్ఎస్‌సిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెండవ టాపర్‌గా నిలిచి సహస్ర ప్రశంసలు అందుకుంది. రత్నపురి వ్యవసాయ కళాశాలలో సీటు రావడంతో అడ్మిషన్ పొంది హాస్టల్‌లో ఉంటూ చదువుకొంటుంది. హాస్టల్‌లో సౌకర్యాలు లేవని, సహచర విద్యార్థుల ప్రవర్తన తీరు బాగాలేదని, తాను ఇక్కడ ఇమడలేకపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పి మెనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్ళారు. సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని కళాశాల సిబ్బంది తెలిపారన్నారు. నచ్చజెప్పి తమ బిడ్డను తిరిగి పంపడంవల్లే తమకు దక్కకుండా పోయిందంటూ ఆమె రాసిన సూసైడ్‌నోట్ చూపిస్తూ రోదించడం పలువురిని కలచివేసింది. తన కూతురు సహస్ర మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిన్నారం సిఐ వెంటేశం, హత్నూర ఎస్సై రాజేష్‌నాయక్‌లు విచారణ చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న సిఐ తెలిపారు.

కూరగాయల రవాణాకు బస్సు సౌకర్యం కల్పించాలి

మన తెలంగాణ/ మహేశ్వరం : రంగారెడ్డి జిల్లాను కూరగాయల జోన్‌గా ప్రకటించి విమానాల ద్వారా ఇతర దేశాలకు కూరగాయలు ఎగుమతి చేస్తామన్న కెసిఆర్ ప్రభుత్వం కూరగాయలు నగరానికి తరలించడానికి కూడా కనీసం బస్సు సౌకర్యం కల్పించడం లేదని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు ఆరోపించారు. సోమవారం మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన రైతు పంచాయితీ కార్యక్రమంలో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా రైతులు పండించిన కూరగాయలను శంషాబాద్ విమానాశ్రయం నుండి ఎగుమతి చేస్తామని రైతులకు మేలు జరుగుతుందని చెప్పిన ప్రభుత్వం నేడు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. విమానాలు వస్తున్నాయి, పోతున్నాయి. కాని, కూరగాయలు పోతున్నాయా అని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర మార్కెట్ సౌకర్యాలు కల్పించడంలో కెసిఆర్ ప్రభుత్వం పూర్తి గా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, కిసాన్‌మోర్చా నాయకులు పి. సుగుణాకర్‌రావు కె.ప్రతాప్‌రెడ్డి జి.ప్రేమేందర్‌రెడ్డి ప్రేమ్‌రాజ్‌యాదవ్ అంజన్‌కుమార్‌గౌడ్ ఎన్ శ్రీవర్ధన్‌రెడ్డి పి.నర్సిమ్హారెడ్డి జి.రామచంద్రరెడ్డి బి.నర్సింహారెడ్డి బి.పాపయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఉస్మానియాలో అగ్నిప్రమాదం

పరుగులు తీసిన రోగులు, సహాయకులు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : ఉస్మానియా ఆసుపత్రి కులీ కుతుబ్‌షా భవనంలోని నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ మనీషా సహాయ్ ఛాంబర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎసిలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వెదజల్లడంతో రోగులు, వారి సహాయకులు పరుగులు తీశారు. వైద్యసిబ్బంది అగ్నిప్రమాద సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సేఫ్టీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో వైద్య సిబ్బంది, రోగులు భయాందోళనకు గురైపరుగులు తీశారు. ఈ ప్రమాదంలో నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఒడి ఛాంబర్ పూర్తి స్థాయిలో దగ్ధమైంది. ప్రమాదవశాత్తు ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఉస్మానియాలో ఫైర్ సేఫ్టీపై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. పలుచోట్ల కనీసం ఫైర్ సిలిండర్‌లు కూడా అందుబాటులో లేవు. ఉన్న చోట కూడా కాలం చెల్లినవే దర్శనమిస్తున్నాయి. దీంతో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ప్రాథమిక దశలో ఎలాంటి చర్యలు తీసుకునే పరిస్థితి కనబడటం లేదు.

కృష్ణా నదిగర్భంలో మైనింగ్‌ను ఆపండి

మానవ హక్కుల కమిషన్‌కు రైతు ఫిర్యాదు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : గనుల శాఖ నిబంధనలను ఉల్లంఘించి టిడిపి అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కృష్ణా నదిగర్భంలో సాగిస్తున్న ఇసుకు మాఫియాకు చెక్ పెట్టాలంటూ కృష్ణా జిల్లాకు చెందిన రవి అనే రైతు సోమవారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే జివో 3066ను ఉల్లంఘించి విజయవాడ–మచిలీపట్నం రహదారి నిర్మాణ పనుల్లో నది ప్రవాహక ఇసుకను వాడుతున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. క్రిష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామ పరిధిలో ఉన్న కృష్ణా నదిగర్భంలో అధికార పార్టీకి చెందిన పలువురు కాంట్రాక్టర్లు 12 ఎకరాల స్థలం పరిధిలో కేవలం ఒక మీటరు లోతున ఇసుకను (మైనింగ్) తవ్వేందుకు గనుల శాఖ నుంచి అనుమతి పొందారు. అయితే నిబంధనలను వీరు పూర్తిగా ఉల్లంఘించి 12 ఎకరాలలో అనుమతి ఉండగా ఏకంగా 100 ఎకరాలలో 5 మీటర్ల నుంచి 8 మీటర్ల లోతున ఇసుకను (మైనింగ్) తోడేస్తు పర్యావరణ పరిరక్షణను సమూలంగా నాశనం చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. సదరు కాంట్రాక్టర్లు కృష్ణా ట్రిబ్యునల్ నిబంధనలకు సైతం ఉల్లంఘిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు.

పిడిఎస్ బియ్యాన్ని దోచేస్తున్నారు

▸▸ పెరుగుతున్న అక్రమార్కుల కేసులు
▸▸ ఈ-పాస్‌తో అక్రమాలకు తెర



మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : ప్రజా పంపిణీ బియ్యంను అందిన కాడికి అక్రమార్కులు దోచుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులను ఒక్కొక్కటిగా నిలిపి వేస్తుండగా పంపిణీ అవుతున్న బియాన్ని సైతం పూర్తి స్థాయిలో పేదలకు దక్కకుండా చేస్తున్నారు చీకటి వ్యాపారులు. మార్కెట్ మధ్య దళారులు రేషన్ డీలర్లతో కుమ్మక్కై పెద్ద ఎత్తున పిడిఎస్ బియ్యాన్ని ప్రక్కదారి పట్టిస్తున్నారు. నిత్యం ఉమ్మడి జిల్లాలో ఏదో ఒక మూల పేదల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ పట్టుబడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. శనివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లాలో గత అక్టోబర్ నుండి మే నెల వరకు ప్రజా పంపిణీ బియ్యం అక్రమార్కులు 44 మందిపై కేసులు నమోదు చేయగా, 8 మంది కిరోసిన్ అక్రమార్కులు, చౌక ధరల దుకాణాల డీలర్లపై 17 కేసులు నమోదయ్యాయి. వీరి వద్ద నుండి రూ.6192,948 విలువ గల సరుకులను అధికారులు స్వాదీనం చేసుకున్నారు. యాదాద్రి జిల్లాలో అక్టోబర్ నుండి 6 నెలల కాలంలో బియ్యం అక్రమార్కులపై 18 కేసులు నమోదుకాగా, కిరోసిన్‌ను దారి మళ్లించిన ఒకరిపై , 15 మంది డీలర్లపై కేసులు నమోదు చేశారు. రూ.77,27,093 విలువ గల సరుకులను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో నమోదైన 71 కేసులలో రూ.2,18,13,319 విలువ గల సరుకులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4,50,030 ఆహార భద్రతాకార్డులు ఉండగా, 990 చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతీ మనిషికి ఆరు కేజీల చొప్పున 8638.539 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పేదలకు ప్రభుత్వం బియ్యాన్ని సరఫరా చేస్తుండగా చౌక ధరల దుకాణా డీలర్లు, దళారీలు, కొందరు పౌరసరఫరాల, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తున్నారు. వీటిని రైస్ మిల్లుల్లో పాలీష్ చేసి అధిక ధర గల సన్నబియ్యంతో కలిపి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బియ్యాన్ని, కిరోసిన్‌ను ప్రక్కదారి పట్టించే అక్రమార్కులపై 1955 నిత్యావసర వస్తువుల చట్టం క్రింద విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా పెడుతున్నారు. అయినప్పటికీ జిల్లాలో బియ్యాన్ని, కిరోసిన్‌ను అక్రమార్గం పట్టిస్తూనే ఉన్నారు. ఎక్కడో చోట విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నప్పటికీ దళారీల దోపిడి మాత్రం ఆగడంలేదు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలకు ఈపాస్ విధానంతో చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 990 రేషన్ దుకాణాలతో ఈపాస్ మిషన్‌తో పాటు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు ఇచ్చి వచ్చే నెలలో డీలర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. బయోమెట్రిక్ విధానంతో రేషన్‌కార్డు యజమాని, వారి కుటుంబ సభ్యులు వేలిముద్రలు సేకరించి నెలనెల సరుకులు తీసుకునే సమయంలో బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తీసుకుంటారు. వేలిముద్రలను మిషన్ ఆమోదిస్తేనే సరుకులు ఇస్తారు. దీంతో డీలర్ల వద్ద ఎంత సరుకు నిల్వ ఉందన్న విషయం ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు చేరుతుంది. దీంతో అక్రమాలకు తెర దించే అవకాశం ఉంది. డీలర్లకు శిక్షణ ముగిసిన వెంటనే అక్టోబర్ నుండి ఈపాస్ విధానాన్ని అమలు పర్చనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే మా విధి : రేణుకా చౌదరి



మన తెలంగాణ/బూర్గంపహాడ్ : ప్రజా సమస్యల పరిష్కారానికే స్టాండింగ్ కమిటీ పని చేస్తుందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ రేణుకాచౌదరి అన్నారు. సోమవారం ఐటిసి కర్మాగారంలో సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చరిత్రలోనే మొట్టమొదటి స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. ఐటిసి కలుషిత రసాయన పదార్థాలతో విషపూరితంగా మారుతున్న గోదావరి జలాలను పరిరక్షించుకునేందుకు దక్షిణాధి గోదావరి పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఖమ్మం జిల్లాలో అడవులు ఎక్కువగా ఉండేవని, అదేవిధంగా వాటర్, గనులు, గ్రానైట్‌లు ఉన్నాయని, విచ్చలవిడిగా మైనింగ్, పొల్యూషన్ మంచినీరు వ్యర్థజలాలు ఉండటం వలన అడవులు అంతరించిపోతున్నాయన్నారు. జల, వాయు కాలుష్యాలు అధికంగా ఉన్నాయని రేణుకాచౌదరికి సారపాకలోని తాళ్లగొమ్మూరు ఎస్‌టికాలనీ వాసులు గోడును వెల్లబోసుకున్నారు. పంటలు సైతం పండటం లేదని, కాలుష్యం వలన జ్వరాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, చిన్నపిల్లల వ్యాధులు అనేకం వస్తున్నాయని, ఐటిసి యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిల బృందంలో ఉత్తరాధి రాష్ట్రాలకు చెందిన ఎంపిలు, నానా పటేల్, సుక్రంసింగ్, వంద్రోచౌహన్, ఇరవై మంది ఎంపీలు ఉండగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆర్‌టిసి శ్రీమన్నారాయణరెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

లా కమిషన్ కొత్త బిల్లుపై హైకోర్టు న్యాయవాదుల నిరసన



మన తెలంగాణ/హైదరాబాద్/చార్మినార్ : సెంట్రల్ లా కమిషన్ బోర్డు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2017 అమెండ్‌మెంట్ లా బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ హైకోర్టు న్యాయవాదులు సోమవారం హైకోర్టు వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. లా కమిషన్ సిఫార్సుతో ప్రవేశపెట్టిన కొత్త చట్టంతో న్యాయవాదులకు, కక్షిదారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీని వల్ల విదేశీ న్యాయవాదులు కూడా న్యాయస్థానంలో వాదించే అవకాశం ఉందన్నారు. న్యాయవాది కేసును సరిగా వాదించలేని పక్షంలో సంబంధిత న్యాయవాదికి లక్షలాది రూపాయల పరిహారం విధించే అవకాశం ఉందన్నారు. వృత్తికి ప్రమాదకరంగా మారిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

ప్రభుత్వ విద్య వైపు విద్యార్థుల చూపు

ఉప ముఖ్యమంత్రి కడియం

మన తెలంగాణ/సంగారెడ్డి : రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వం విద్యా వ్యవస్థను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో రూ.5.15కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.325 కోట్లతో నూతన విద్యా భవనాలను నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందన్నారు. ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతాప్రభాకర్, జడ్‌పి చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్, జడ్‌పిటిసి మనోహర్ గౌడ్, సిడిసి చైర్మన్ విజయేందర్‌రెడ్డి, ఆర్‌జెడి ఎల్లయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో రైతే రాజుగా మారే పరిస్థితులు

▸▸ వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి : అప్పులు తీసుకునే పరిస్థితి రైతులకు పోయి రైతే రాజుగా మారే రోజులు దగ్గరలో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కంది మండలంలో వ్యవసాయ కళాశాల ఆవరణలో నిర్మించిన బాలికల, బాలుర వసతి గృహాలను స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూమౌలిక వసతులను ప్రభు త్వం అందిస్తుందని, ఇప్పటికే 52 గదులతో బాలికలకు, బాలురకు రూ.7.24కోట్లతో రెండు భవనాలను నిర్మించామని, మరో 52 గదులను పై అంతస్తులో నిర్మించేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారని, దానికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తమ బాధ్యతను తాము నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోని కంది కళాశాలకు మంచి పేరును తీసుకురావాలన్నారు. అంతకు ముందు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కిషన్‌రావు మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముకగా ఉన్నాడని, మనిషికి గుండె ఎంత అవసరమో మానవాళికి రైతు గుండెకాయ లాంటివాడన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నకు క్షామం కలుగకుండా క్షేమంగా ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కళాశాలకు మరో52 గదులను నిర్మించుకునేందుకు నిధులు మంజురు చేయాలని మంత్రిని కోరారు. అదేవిధంగా కళాశాల వరకు రహదారి ఏర్పాటుకూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాజమణి మురళీయాదవ్, కంది సర్పంచ్ ఉమారాణి శంకర్‌గౌడ్, జెసి వాసం వెంకటేశ్వర్లు, జెడ్‌పిటిసి మనోహర్‌గౌడ్, సిడిసి చైర్మన్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల వైస్ చాన్సలర్ ప్రవీణ్‌రావు, కళాశాల డీన్ సదాశివరావు, కళాశాల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం మంట కలిసిన వేళ..

ఎంజిబిఎస్‌లో పసికందును వదిలిపెట్టి పోయిన వైనం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో : ఓ పసికందును ఫ్లాట్‌ఫారంపై వదిలి వెళ్లింది మానవత్వం లేని ఓ తల్లి. సుమారు ఐదు రోజుల పసికందును సోమవారం ఉదయం ఎంజిబిఎస్‌లోని ప్లాట్‌ఫారంపై వదిలివెళ్లడం కలకలం సృష్టించింది. పాల కోసం ఏడుస్తున్న చిన్నారిని గుర్తించి అక్కడి సిబ్బంది చిన్నారి తల్లిదండ్రుల కోసం చుట్టుపక్కల వెతికినా ఎవరు కనిపించలేదు. ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలపడంతో వారు అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అమీర్‌పేట్‌లోని చైల్డ్‌కేర్ సెంటర్ ప్రతినిధులకు సమాచారం అందించి పాపను పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేందర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎంజిబిఎస్ 50వ ప్లాట్‌ఫారం వద్ద బెంచీపై పసికందును స్వీపర్ లక్ష్మీ కంట్రోలర్ చంద్రశేఖర్‌రెడ్డి వద్దకు చేర్చింది. అనంతరం పోలీసులు చైల్డ్‌కేర్ సెంటర్ నిర్వాహకులను పిలిపించి వారికి అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.


తెలంగాణ వక్ఫ్ ఆస్తుల కుంభకోణంపై సిబిఐచే విచారణ జరిపించండి

▸▸ ప్రధానికి కేంద్ర వక్ఫ్ బోర్డు మెంబర్ లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : తెలంగాణలో వక్ఫ్ బోర్డుకు చెందిన వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతం అయిన ఉదంతంపై సిబిఐచే విచారణ జరిపించాలని కేంద్ర వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుడు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ సయ్యద్ ఎజాస్ అబ్బాస్ నక్వీ ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాసారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసితో పాటు దారుసలాం బ్యాంకు చైర్మన్, తెలంగాణ వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుడు అక్బర్ నిజాముద్దీన్‌లు తెలంగాణలో వక్ఫ్ బోర్డు ఆస్తులను కాజేశారని ఆ లేఖలో నక్వీ ఆరోపించారు. గతంలో అక్బర్ నిజాముద్దీన్‌పై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారని ఈ సందర్భంగా ఆయన ప్రధానికి గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా మణికొండ గ్రామంలోని 'దర్గా హుస్సేన్ షా వలి' వక్ఫ్ బోర్డుకు చెందిన 1654 ఎకరాల స్థలాన్ని అక్బరుద్దీన్ ఆక్రమించుకున్నాడని నక్వీ ఆరోపించారు. దీంతో పాటు హైదరాబాద్, ఇతర జిల్లాలలో వేలాది ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆక్రమించడంతో పాటు ఇతరులకు విక్రయించారని 72 పేజీలతో కూడిన సాక్ష్యాధారాలను ఆయన ప్రధానికి పంపించారు. 1998 నుంచి 2016 వరకు ఈ భూములను ఆక్రమించుకుని తమ పేర్లు, బినామీ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన ఆరోపించారు. మొత్తం వ్యవహారంపై సిబిఐచే దర్యాప్తు చేయిస్తే నిజ నిజాలు బయటపడతాయని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వారికి పరోక్షంగా మద్దతు నిలవడంతో వారి అక్రమాలు బయట పడడం లేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంపై సిబిఐచే విచారణ జరపాలని కేంద్ర వక్ఫ్ బోర్డు కమిటీ మెంబర్ ప్రధానికి లేఖ రాయడంపై తెలంగాణ వక్ఫ్ బోర్డు అధికారుల్లో ఆందోళన మొదలైంది.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ.1000 కోట్లు

▸▸ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం టౌన్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ రూ. 1000 కోట్లు కేటాయించడం హర్షణీయమని రవాణా శాఖమంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైష్ణవి గార్డెన్‌లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి కమిటీ జిల్లా అధ్యక్షుడు చిన్నంగి వెంకటేశ అధ్యక్షతన జిల్లాలో చేపపిల్లల సరఫరాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎలెసిడిసి ద్వారా మత్స్య పరిశ్రమకు రూ. 1000 కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇప్పటికే వికారాబాద్, మేడ్చెల్‌లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి కమిటీ అవగాహన సదస్సులు పూర్తి చేశామని తెలిపారు. కొత్తగా ఏర్పడ్డ ఉమ్మడి మూడు జిల్లాలో రూ. 3.40 కోట్లు చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో కరువుగా ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరంకు స్పెషల్‌గా సాగునీరు తేచ్చె విధంగా కృషి చేస్తామని అన్నారు. శివన్నగూడ ఎత్తిపోతల పథకం ద్వారా 2 టిఎంసిల నీటిని తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వర్షాలు లేక రైతులు మత్స్య కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపిపి మర్రి నిరంజన్‌రెడ్డి, జెడ్‌పిటిసి పి. అయిలయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు వెంకట్‌రెడ్డి, ఆర్‌డిఒ మధూకర్‌రెడ్డి , మత్స్య సొసైటీ ఎడి రాజారాం, సూపర్‌వైజర్ కె. చంద్రయ్య, ఇబ్రహీంపట్నం మత్స్య సొసైటీ అధ్యక్షుడు నాస మహదేవ్ పాల్గొన్నారు.

మాఫియా నేపథ్యంలో...

త్వరలోనే 'మహానుభావుడు'గా ప్రేక్షకులను పలకరించబోతున్నాడు శర్వానంద్. ఆ తర్వాత శర్వా మరో రెండు సినిమాలు చేయబోతున్నాడు. అందులో ఒకటి రాఘవేంద్రరావు తనయుడు ప్రకాష్ కోవెలమూడి దర్శకత్వం వహించే సినిమా ఒకటి కాగా... మరొకటి స్వామిరారా, కేశవ చిత్రాల దర్శకుడు సుధీర్‌వర్మతో చేయబోతున్నాడు. ఇందులో ముందుగా సుధీర్ వర్మ సినిమానే మొదలవుతుంది. క్రైమ్ థ్రిల్లర్లంటే చాలా మక్కువ చూపించే సుధీర్ వర్మ... శర్వాతో చేసే సినిమాను కూడా ఆ బ్యాక్‌డ్రాప్‌లోనే తీయబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రం మాఫియా నేపథ్యంలో కొనసాగుతుందట. శర్వానంద్ ఇందులో సామాన్యుడి స్థాయి నుంచి మాఫియా అధినేతగా ఎదిగే పాత్రలో కనిపిస్తాడు. ఒక వ్యక్తి జీవితంలోని వివిధ దశల్ని ఈ సినిమాలో చూపిస్తారని... ఇందులో శర్వా వివిధ వయసుల్లో కనిపిస్తాడని తెలిసింది. సెప్టెంబర్‌లో ఈ చిత్రం పట్టాలెక్కుతుందని సమాచారం.



చైతన్య పెళ్లి సింపుల్‌గా... రిసెప్షన్ గ్రాండ్‌గా...



నాగార్జున

చిత్ర పరిశ్రమలో వస్తున్న కొత్త ట్రెండ్స్‌ను అందిపుచ్చుకుంటూ... కాలానుగుణంగా మారుతూ ప్రయోగాత్మక సినిమాలతో అభిమానులను అలరిస్తున్న సీనియర్ స్టార్ అక్కినేని నాగార్జున. 'విక్రమ్' చిత్రం నుంచి 'ఓం నమో వెంకటేశాయ' వరకు లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్, భక్తి రస చిత్రాలతో ఆయన అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఓంకార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజుగారి గది-2' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు నాగార్జున. షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో విడుదలకాబోతోంది. ఇక మంగళవారం నాగార్జున పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సీనియర్ స్టార్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

హర్రర్, కామెడీ థ్రిల్లర్...

ప్యాచ్‌వర్క్ మినహా 'రాజుగారి గది2' పూర్తయింది. రీరికార్డింగ్ జరుగుతోంది. ఇది హర్రర్, కామెడీ థ్రిల్లర్. నా వైపు నుంచి కామెడీ తక్కువ ఉంటుంది. వెన్నెల కిషోర్, ప్రవీణ్, అశ్విన్ కామెడీ కడుపుబ్బ నవ్విస్తుంది. సినిమాలో సందర్భానుసారంగా కామెడీ ఉంటుంది.

ఓంకార్ పర్‌ఫెక్షనిస్ట్...

హర్రర్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. కామెడీ ఉంటూ ప్రేక్షకులను నవ్వించే సినిమాలను ఇష్టపడతాను. లక్కీగా అలాంటి సినిమా చేస్తున్నాను. దర్శకుడు ఓంకార్ పర్‌ఫెక్షనిస్ట్. అతను అనుకున్నది సరిగ్గా చేస్తాడు. ఈ సినిమా కోసం ఫుల్ స్క్రిప్ట్ రాసుకున్నాడు.

డిఫరెంట్ క్యారెక్టర్ నాది...

రాజుగారి గది సినిమాకు, ఈ సినిమాకు సంబంధమే లేదు. రాజుగారి గది మంచి హిట్ అయింది కాబట్టే ఆ టైటిల్‌ను తీసుకొని 'రాజుగారి గది2' చేయడం జరిగింది. ఇందులో నాది డిఫరెంట్ క్యారెక్టర్. ఎదుటి మనిషి మనసులో ఏముందో సులభంగా కనిపెట్టేసే పాత్ర నాది. రియల్ లైఫ్‌లో అలాంటివారిని ఇద్దరు, ముగ్గురిని కలిశాను. ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం జరిగిన విషయాలు ఇప్పటికీ గుర్తుంటాయి వాళ్లకి.

'హలో' హీరోయిన్ ఎంపిక ఆలస్యం...

విక్రమ్ దర్శకత్వంలో అఖిల్ చిత్రం 'హలో' చాలా బాగా వస్తోంది. టైటిల్ కూడా అందరికీ నచ్చింది. ఈ సినిమాకు హీరోయిన్ ఎంపిక బాగా ఆలస్యమైంది. దాదాపు 30, 40 మందికి స్క్రీన్ టెస్ట్ చేశాం. 'గీతాంజలి'లో గిరిజలా, 'ఏమాయ చేసావె'లో సమంతలా కొత్తగా ఉండే అమ్మాయి కావాలనుకున్నాం. చివరికి ప్రియదర్శన్ కూతురు కళ్యాణిని హీరోయిన్‌గా ఎంపిక చేశాం.

నేను ఇచ్చిన టైటిల్...

టైటిల్‌కు తగ్గ సినిమా 'హలో'. తను ప్రేమించిన అమ్మాయి దగ్గర నుంచి ఒక హలో కోసం ఎదురుచూస్తుంటాడు హీరో. ఇది నేను ఇచ్చిన టైటిల్. ఆరు నెలల నుంచి యూనిట్ అంతా సినిమా టైటిల్ గురించి ఆలోచించారు. చివరికి నేను 'హలో' టైటిల్‌ను ఖరారు చేశాను.

అది అంతగా నచ్చలేదు...

'సోగ్గాడే చిన్ని నాయనా'లో బంగార్రాజు క్యారెక్టర్‌కు ఎంత పాపులారిటీ వచ్చిందో తెలిసిందే. నాకు కూడా ఆ క్యారెక్టర్ పేరుతో సినిమా చేయాలని ఉంది. దర్శకుడు కళ్యాణ్‌కృష్ణ ఒక లైన్ చెప్పాడు. అది అంతగా నచ్చలేదు. మళ్లీ ప్రిపేర్ అయిన మంచి కథ చెప్తే తప్పకుండా చేస్తాను. అయితే అది 'సోగ్గాడే చిన్ని నాయనా'కు సీక్వెల్ మాత్రం కాదు.

కర్ణుడి పాత్ర చెయ్యమని అడిగారు...

'మహాభారతం' సినిమాలో నటించమని నన్ను అడిగిన మాట వాస్తవమే. కానీ ఆ సినిమా చేస్తానా లేదా అనేది ఖచ్చితంగా చెప్పలేను. అందులో కర్ణుడి పాత్ర చెయ్యమని అడిగారు. ఆ సినిమా 2018లో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

క్రిస్టియన్, హిందూ సంప్రదాయాల్లో...

చైతన్య, సమంతల పెళ్లి అక్టోబర్ 6న జరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకే రోజు క్రిస్టియన్, హిందూ సంప్రదాయాల్లో పెళ్లి చేస్తాం. పెళ్లి సింపుల్‌గా చెయ్యాలని వాళ్లే అనుకున్నారు. ఆతర్వాత రిసెప్షన్ గ్రాండ్‌గా చెయ్యాలని మేం ప్లాన్ చేస్తున్నాం.



'పైసా వసూల్' ఆడియో సక్సెస్ మీట్‌లో మోహన్‌బాబు, ఎ.కోదండరామిరెడ్డి, బాలకృష్ణ, పూరి జగన్నాథ్, వి.ఆనంద ప్రసాద్, శ్రియా, ఛార్మి, పులగం చిన్నారాయణ, భాస్కరభట్ల తదితరులు

బాలయ్య వండర్‌ఫుల్ యాక్టర్

నందమూరి బాలకృష్ణ హీరోగా భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన చిత్రం 'పైసా వసూల్'. ఈ సినిమా ఆడియో సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ, శ్రియా, పూరి జగన్నాథ్, ముస్కాన్, కైరాదత్, వి.ఆనందప్రసాద్, అన్నే రవి, పులగం చిన్నారాయణ, భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు. మోహన్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఎ.కోదండరామిరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మంచు మోహన్‌బాబు మాట్లాడుతూ ''ప్రపంచమే గర్వించదగిన మహానటుడు మా అన్నయ్య నందమూరి తారకరామారావు. నా తల్లిదండ్రులు, గురువును ఎలా గుర్తుపెట్టుకుంటానో మా అన్నయ్యను కూడా ప్రతిరోజు గుర్తుచేసుకుంటా. మా అన్నగారి కుమారుడు బాలకృష్ణ సినిమా కోసం మద్రాస్‌లోని ఓ కార్యక్రమాన్ని రద్దు చేసుకొని ఇక్కడికి వచ్చాను. ఇది నా ఇంట్లో వేడుక కాబట్టి వచ్చాను. బాలయ్య గురించి ఇవాళ కొత్తగా చెప్పనక్కర్లేదు. ఆయన సినిమాలు సిల్వర్ జూబ్లీలు, గోల్డెన్ జూబ్లీలు జరుపుకున్నాయి. బాలయ్య వండర్‌ఫుల్ యాక్టర్. తను చేసిన ప్రతి సినిమాలోనూ ఒక వెరైటీ, ఒక డైలాగ్ ఉంటుంది. పూరి అంటే నాకు చాలా ఇష్టం. నేను, ప్రభాస్ కలిసి అతని డైరెక్షన్‌లో 'బుజ్జిగాడు'లో నటించాం''అని అన్నారు.నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ''దర్శకుడు పూరి జగన్నాథ్‌తో ఎప్పటినుంచో సినిమా చేయాలనుకున్నా కాస్త ఆలస్యమైంది. చివరికి అతనితో 'పైసా వసూల్' వంటి మంచి సినిమా చేశాను. ఇక ప్రేక్షకుల మీద నమ్మకంతో నాన్నగారు ఎన్నో మంచి సినిమాలు చేశారు. ఆయన అందించిన ధైర్యం, ఆవేశం, స్ఫూర్తితోనే నేను సినిమాలు చేస్తున్నాను. ఈ సినిమా కోసం పోర్చుగల్‌లో 36 రోజులు షూటింగ్ చేశాం. గౌతమిపుత్ర శాతకర్ణి సినిమాను 79 రోజుల్లో పూర్తిచేస్తే... ఈ సినిమాను 78 రోజుల్లో పూర్తి చేశాం. అలా ఒక్కో సినిమాకు ఒక్కో రోజును తగ్గించుకుంటూ వస్తున్నాం. సినిమా చాలా భారీగా ఉంది. సెట్స్, కార్ ఛేజ్‌లు భారీగా ఉన్నాయి. ముందుగా సినిమాను సెప్టెంబర్ 29న విడుదల చేయాలని అనుకున్నాం. కానీ ఐదు వారాల ముందే సెప్టెంబర్ 1న సినిమాను విడుదల చేస్తున్నాం''అని తెలిపారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ ''బాలయ్యతో ఇన్నాళ్లు సినిమా చేయకుండా ఎంతో మిస్ అయ్యాను. ఆయన వంటి హీరోను నేను ఇప్పటిదాకా చూడలేదు. క్రమశిక్షణ, అంకితభావం ఉన్న నటుడు ఆయన. నందమూరి తారకరామారావు లక్షణాలన్నీ ఆయన కుమారుడు బాలయ్యలో ఉన్నాయి. ఈ సినిమాలో కొత్తవాళ్లు చాలా మంది చేశారు. వాళ్లందరినీ ఆయన ప్రోత్సహించారు. నిర్మాత ఆనందప్రసాద్‌తో పనిచేయడం చాలా బావుంది. ఐదు వారాల ముందు ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది''అని చెప్పారు. నిర్మాత వి.ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ ''ఖమ్మంలో ఒకటిన్నర లక్షల మంది సమక్షంలో సినిమా ఆడియోను విడుదల చేశాం. అర గంట కుంభవృష్టి పడింది. అయినా ప్రేక్షకులు సీటు నుంచి కదల్లేదు. ఇంత చక్కటి అవకాశాన్నిచ్చిన బాలయ్యబాబుకు ధన్యవాదాలు. ఆయనతో సినిమా చేయాలనే నా కోరిక తీరింది. ఆయనతో ముందు ముందు మరిన్ని సినిమాలు చేస్తాను. ఇక బాలకృష్ణ 101వ చిత్రం 'పైసా వసూల్' సందర్భంగా ఆయన అభిమానుల్లో 101 మంది పేద విద్యార్థులకు సాయం చేస్తున్నాం. ఈ చిత్రం విడుదల సందర్భంగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు ఇస్తాం. సెప్టెంబర్ 1న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'''అని తెలిపారు.

పవర్‌ఫుల్ విలన్‌పై గెలిచిన సామాన్యుడు



'యుద్ధం శరణం' ఆడియో విడుదల కార్యక్రమంలో రాజమౌళి, కీరవాణి, డి.సురేశ్‌బాబు, రానా, నాగచైతన్య తదితరులు

నాగచైతన్య హీరోగా వారాహి చలన చిత్రం బ్యానర్‌పై కృష్ణ ఆర్.వి.మారిముత్తు దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. సీనియర్ హీరో శ్రీకాంత్ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. వివేక్‌సాగర్ సంగీతమందించిన ఆడియో సీడీలను కీరవాణి ఆవిష్కరించి రాజమౌళికి అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ''ఓ రోజు నేను ఈ సినిమా షూటింగ్ చూసేందుకు వెళ్తే... ఓ ఫ్యామిలీ ఫంక్షన్ జరుగుతుంటే దానిని కెమెరాతో షూట్ చేస్తున్నట్లుగా అక్కడి వాతావరణం ఉంది. దీంతో ఈ సినిమాపై నా నమ్మకం మరింత పెరిగింది. సినిమా ట్రైలర్ చూశాక ఈ సినిమా సూపర్‌హిట్ అవుతుందనిపించింది. నాగచైతన్య కథలు ఎంచుకునే తీరు నచ్చింది. విలన్‌గా శ్రీకాంత్ గెటప్ బావుంది. వివేక్‌సాగర్ సంగీతం చక్కగా కుదిరింది''అని అన్నారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ ''నాగచైతన్య ఎప్పటి నుండో తెలుసో దర్శకుడు కృష్ణ కూడా అప్పటి నుండే తెలుసు. చైతన్యకు అతను బెస్ట్ ఫ్రెండ్. ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కుతోంది. ఈ సినిమా ఈ ఏడాది విడుదలైన సినిమాలన్నింటిలోకంటే పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు. నాగచైతన్య మాట్లాడుతూ ''టీజర్ విడుదలైనప్పుడు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ చూసి మా యూనిట్‌కు ఎంతో బలం వచ్చింది. నాది, ఈ సినిమా డైరెక్టర్ కృష్ణది డేట్ ఆఫ్ బర్త్ ఒకటే. చిన్నప్పటినుంచి ఇద్దరం కలిసి చదువుకున్నాం. సెప్టెంబర్ 8న విడుదలయ్యే ఈ సినిమా యుద్ధంలో తను డైరెక్టర్‌గా గెలిచి నిలుస్తాడు. నికేత్ విజువల్స్ కారణంగా సినిమాలో అందరూ బాగా కనపడుతున్నారు. ఓ సామాన్యుడు పవర్‌ఫుల్ విలన్‌పై ఎలా గెలిచాడన్నదే కథ. ఇందులో హీరో ఎక్కడా ఆయుధాన్ని ఉపయోగించడు. వివేక్ సాగర్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుంది''అని చెప్పారు. దర్శకుడు కృష్ణ ఆర్.వి.మారిముత్తు మాట్లాడుతూ ''చైతన్య నా బెస్ట్ ఫ్రెండ్. అతను నన్నెంతగానో ప్రోత్సహించాడు. సురేష్‌బాబు ఎంతో గైడ్ చేశారు. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం మాకుంది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.సురేష్‌బాబు, లగడపాటి శ్రీధర్ తదితరులతో పాటు చిత్ర బృందం పాల్గొంది.



అనుష్క

'సైరా... నరసింహారెడ్డి'లో అనుష్క?

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బయోపిక్ 'సైరా... నరసింహారెడ్డి' సినిమాలో నటించనున్నాడు చిరంజీవి. ఇటీవల టైటిల్‌తో పాటు లోగోను రిలీజ్ చేసిన రోజునే సినిమాలోని నటులు, టెక్నికల్ టీంతో ఓ చిన్నపాటి టీజర్‌ను కూడా లాంచ్ చేశారు. ఇందులో హీరోయిన్‌గా నయనతార నటిస్తున్నట్లుగా ప్రకటించారు కూడా. అయితే ఇప్పుడు ఈ సినిమాలో అనుష్క కూడా నటిస్తుందనే టాక్ వినిపిస్తోంది. నిజానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బయోపిక్‌కు ముగ్గురు హీరోయిన్‌లు అవసరం అనే మాట ముందు నుంచి వినిపిస్తోంది. ఇద్దరు భార్యలతో పాటు ఆయన జీవితం పంచుకున్న మరో మహిళ రోల్ కూడా ఈ సినిమాలో ఉంటుందని అంటున్నారు. అందుకోసమే ముగ్గురు హీరోయిన్‌లను ఎంపిక చేస్తున్నారని... ఒక రోల్‌కు నయనతారను ప్రకటించగా... మరో పాత్ర కోసం అనుష్కను సంప్రదించగా ఆమె నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని తెలిసింది. మూడో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ హీరోయిన్‌ను తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. ప్రస్తుతం అనుష్క చేతిలో భాగమతి చిత్రం మినహాయిస్తే మరో ప్రాజెక్ట్ ఏదీ లేదు. భాగమతి షూటింగ్ పూర్తయిపోయింది కూడా. విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ జరుగుతోంది. అంటే అనుష్క చేతిలో ప్రస్తుతం సినిమాలు లేవనే చెప్పాలి. పైగా బాహుబలి చిత్రంలో దేవసేన పాత్రతో దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ తెచ్చుకున్న అనుష్క... 'సైరా... నరసింహారెడ్డి' చిత్రంలో భాగమైతే ఈ సినిమాకు దేశ వ్యాప్తంగా మంచి క్రేజ్ రావడం ఖాయం.



తమన్నా

తమన్నా స్పెషల్ సాంగ్

తాజాగా ఎన్టీఆర్ నటిస్తున్న 'జై లవ కుశ' సినిమాకు మరో ఆకర్షణ జతకానుంది. ఈ సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ స్పెషల్ సాంగ్ చేయనుంది. ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు మిల్కీ బ్యూటీ తమన్నా. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందే ఈ పాటకు ఈ ముద్దుగుమ్మ అయితే బాగుంటుందని భావించిన దర్శకనిర్మాతలు ఆమెను ఫైనల్ చేశారట. ఈ ఆఫర్‌కు తమన్నా వెంటనే ఓకే చేసిందట. అయితే ఫిల్మ్‌మేకర్స్ నుంచి ఈ విషయంపై ఇంకా ప్రకటన రావాల్సి ఉంది. ఎన్టీఆర్ గత చిత్రం 'జనతా గ్యారేజ్'లో కూడా స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ 'పక్కా లోకల్...' అనే ప్రత్యేక గీతంలో హుషారుగా స్టెప్పులు వేసి అలరించింది. అలాగే తమన్నా కూడా గతంలో అల్లుడు శీను, జాగ్వార్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్‌లో ప్రేక్షకులను మురిపించింది. ఇప్పుడు 'జై లవ కుశ' సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాల్సిందే.

అక్టోబర్ 12న 'ఆక్సిజన్'



గోపీచంద్, అను ఇమ్మాన్యుయేల్


గోపీచంద్ కథానాయకుడిగా ఏ.ఎం.జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆక్సిజన్' పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. రాశీఖన్నా, అను ఇమ్మాన్యుయల్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీసాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్.ఐశ్వర్య నిర్మిస్తున్నారు. త్వరలో ఆడియో విడుదల కానున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 12న విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎస్.ఐశ్వర్య మాట్లాడుతూ ''గోపీచంద్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా 'ఆక్సిజన్'. ముంబయ్, గోవా, సిక్కిం, చెన్నై ప్రాంతాల్లో నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని రూపొందించాం. యువన్ శంకర్ రాజా సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియోను త్వరలో విడుదల చేసి అక్టోబర్ 12న చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం''అని అన్నారు. జగపతిబాబు, కిక్ శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యు సింగ్, అమిత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వెట్రిఛోటా కె.నాయుడు, యాక్షన్ః పీటర్ హెయిన్స్, ఎడిటింగ్ః ఎస్.బి.ఉద్ధవ్, కొరియోగ్రఫీః బృంద, పాటలుః శ్రీమణి, రామజోగయ్య శాస్త్రి.

సోషల్ మీడియా కష్టాలు

బాలీవుడ్ తార రాధికా ఆప్టేను బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ అని ఎవరైనా ఒప్పుకోవాల్సిందే. కెరీర్ మొదట్లో తెలుగులో కూడా నటించింది ఈ భామ. రక్త చరిత్ర, లెజెండ్ సినిమాల్లో నటించి టాలీవుడ్‌లో హీరోయిన్‌గా మంచి పాపులారిటీని తెచ్చుకుంది. బాలీవుడ్‌లో ధోని వంటి సినిమాలలో మెరిసిన రాధికా ఆప్టే ఓ సమయంలో టాలీవుడ్‌పై వివాదస్పద వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత టాలీవుడ్‌లో సినిమాలు చేయలేదు. అయితే ఆమెకు ఇప్పుడు సోషల్ మీడియా కష్టాలు వచ్చాయి. కొంతకాలం క్రితం ఆమె ఫేస్ బుక్ అకౌంట్ హ్యాక్ అవగా ఎలాగోలా కష్టపడి మళ్లీ తన స్వాధీనం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ తన ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయిందని వాపోతోంది రాధికా ఆప్టే. ''నా ఫేస్‌బుక్ అకౌంట్ మరోసారి హ్యాకింగ్‌కు గురైంది. దయచేసి ఎవరూ మెసెంజర్‌లో నాకు మెసేజ్‌లు చేయవద్దు'' అంటూ ట్వీట్ చేసింది ఈ భామ. ఒక ఫ్లాట్‌ఫామ్ హ్యాక్ అయితే దాన్ని చెప్పేందుకు మరో సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవడం విశేషం. ప్రస్తుతం రాధికా ఆప్టే తమిళ్, హిందీ చిత్రాలతో పాటు రెండు ఇంగ్లీష్ సినిమాల్లో కూడా నటిస్తుండడం విశేషం. రెండేళ్ల వరకు తన డైరీ ఖాళీ లేదని చెబుతోందంటే... రాధిక ఎంత ఫుల్ బిజీ అనే సంగతి అర్థమవుతుంది.



రాధికా ఆప్టే



ఉబెర్ కొత్త సిఇఒ దారా ఖోస్రోషాహి


శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాకు చెందిన క్యాబ్ సంస్థ ఉబెర్‌కు కొత్త సిఇఒగా దారా ఖోస్రోషాహిను నియమించారు. ట్రావిష్ కలానిఖ్ స్థానంలో ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. దీంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉబెర్ కంపెనీ కొత్త సిఇఒ నియామకం పూర్తి అయింది. అందరి అంచనాలకు భిన్నంగా అమెరికా ట్రావెల్ కంపెనీ ఎక్స్‌పీడియాకు చెందిన దారా ఖోస్రోషాహిని సిఇఒగా ఉబెర్ ఎంపిక చేసింది. ఈ ఏడాది జూన్‌లో వ్యవస్థాపకుడు, మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ట్రావిస్ కాలనిక్ తన పదవికి రాజీనామా చేయడంతో ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు ఉబెర్ సిఇఒ రేస్‌లో కనిపించని ఇరాన్‌కు చెందిన ఖోస్రోషాహిని కొత్త సిఇఒగా ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ కంపెనీగా గుర్తింపు పొందిన ఉబెర్‌లో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో కంపెనీ వాటాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో సిఇఒ రాజీనామా చేయక తప్పలేదు. ఆరోపణలపై సంస్థ అంతర్గత విచారణను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో లైంగిక వేధింపు, వివక్షత, బెదిరింపు, అనైతిక ప్రవర్తన తదితర ఆరోపణలతో ఉబెర్ అప్పటికే 20 మంది ఉద్యోగులను తొలగించింది.

ఇన్ఫోసిస్‌లో ఉత్సాహం

● నిలేకనీ పునరాగమనంతో భారీ లాభాల్లో స్టాక్ ● బిఎస్‌ఇలో 5 శాతం పెరిగిన కంపెనీ షేరు

న్యూఢిల్లీ: కొత్త చైర్మన్‌గా నందన్ నిలేకనీని నియమించడంతో ఈక్విటీ మార్కెట్లలో ఇన్ఫోసిస్ షేరు ఉత్సాహంగా కనిపించింది. సోమవారం దాదాపు 5 శాతం మేరకు లాభపడింది. ఒకానొక దశలో షేరు విలువ 4.49 శాతం పెరిగి రూ.953.50ను తాకింది. ఇటు సెన్సెక్స్, అటు నిఫ్టీ రెండింటిలోనూ ఇన్ఫోసిస్ షేరు అతిపెద్ద గెయినర్‌గా నిలిచింది. గణేష్ చతుర్థి సందర్భంగా గత వారాంతం శుక్రవారం నాడు మార్కెట్లకు సెలవు.. మూడు రోజుల విరామం తర్వాత ప్రారంభమైన మార్కెట్లో ఇన్ఫోసిస్ కొనుగోళ్ల సందడితో కళకళలాడింది. ఇన్ఫోసిస్ చైర్మన్‌గా నందన్ నీలేకని బాధ్యతలు చేపట్టడంతో ఆ కంపెనీ షేర్లు లాభాల బాట పట్టాయి. స్టాక్‌మార్కెట్‌లో ఇన్ఫీ షేర్లు 5 శాతం మేర పెరిగి ఇన్వెస్టర్ల సంపద రూ.9000 కోట్లకు పైననే ఎగిసింది. నాలుగు రోజుల క్రితం నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నిలేకని పదవి స్వీకరించారు. సుదీర్ఘ వీకెండ్ తర్వాత ప్రారంభమైన స్టాక్ మార్కెట్‌లో నిలేకని పునరాగమనం ఇన్ఫీపై సెంటిమెంట్ బలపర్చింది.

విశాల్ సిక్కా ఇన్ఫీ సిఇఒ పదవి నుంచి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఇటీవల కంపెనీ షేర్లు భారీగా కుదేలైన విషయం తెలిసిందే. రెండు రోజుల్లోనే 15శాతం దాకా నష్టాలను చవిచూశాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.35వేల కోట్లకు పైగా క్షీణించింది. ఈ నేపథ్యంలో ఇన్ఫీ సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని పునరాగమనం చేశారు. ఇన్ఫీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో మదుపర్లు కంపెనీ షేర్ల వైపు మొగ్గుచూపడంతో సోమవారం లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూ ల ప్రభావంతో దేశీయ సూచీలు ఉత్సాహంతో కదలాయి. ఐటీ, ఫార్మా రంగాల షేర్ల అండతో లాభాల్లో దూసుకెళ్తు న్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 155 పాయింట్లు లాభపడి 31,750 పాయింట్ల వద్ద ముగిసిం ది. ఇక నిఫ్టీ 9,900 మార్క్‌ను దాటింది. నిఫ్టీ 56 పా యింట్ల లాభంతో 9,912 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్‌టిపిసి, యస్ బ్యాంక్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటామోటార్స్, టాటా స్టీల్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.



సిఇఒ వేటలో నిలేకనీ

ఇన్ఫోసిస్ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నందన్ నిలేకనీ సంస్థలో కొత్త సిఇఒ నియామకం, ఇతర అం శాలపై దృష్టి పెట్టారు. విశాల్ సిక్కా ఆకస్మికంగా సిఇఒ పదవికి రాజీనామా చేయడంతో కంపెనీలో ఆందోళనకర పరిస్థితులు నెలకొనగా, వెంటనే నిలేకనీ చైర్మన్‌గా నియ మించిన విషయం తెలిసిందే. ఆయన రాకతో కంపెనీ షేరు లాభాల్లో పయనించగా, పరిస్థితులు నిలకడగా మా రాయి. గత కొంత కాలంలో బోర్డు, వ్యవస్థాపకుల మధ్య విభేదాలు పెరిగిన నేపథ్యంలో ఈ సమస్యలను పరిష్కరిస్తూనే, మరోవైపు కంపెనీకి కొత్త సిఇఒ ఎంపికపైనా నిలేకని దృష్టి పెట్టారు. ఇన్ఫీలో పరిస్థితులు చక్కదిద్దడంతోపాటు సిఇఒ ఎంపిక తన ప్రధాన కర్తవ్యమని ప్రకటించిన నీలేకని ఆ పనిలో బిజీగా ఉన్నారు. పలు బిజినెస్ దిగ్గజాల పేర్లను ఇన్ఫీ సిఇఒ పదవికి పరిశీలిస్తున్నారు. గతంలో సంస్థలో పనిచేసిన సీనియర్లు హెల్త్ కేర్ లైఫ్ సైన్సెస్ హెడ్ మోహిత్ జోషి, డిప్యూటీ సిఇఒ రవికుమార్, ప్రస్తుత తాత్కాలిక సిఇఒ ప్రవీణ్ రావులు సిఇఒ పదవి రేసులో ఉన్నారు. ప్రధానంగా జిరాక్స్ బిపిఒ బిజినెస్ సిఇఒగా ఉన్న అశోక్ వేమూరి ఈ రేసులో ముందు వరసలో ఉన్నారు. ఇన్ఫోసిస్‌లోకి నందన్ నీలేకని పునరాగమనంతో ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచింది. అలాగే సంస్థ స్థిరత్వం, కంపెనీ ప్రాభవాన్ని, చరిత్రను నిలుపుతానని హామీ ఇవ్వడంతో సోమవారం మార్కెట్లో కంపెనీ షేరు 5 శాతానికి పైగా పెరిగింది.



హోస్ట్ అనలిటిక్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విస్తరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ ఫెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఇపిఎం) సొల్యూషన్స్ అందించడంలో ప్రసిద్ధిగాంచిన హోస్ట్ అనలిటిక్స్ హైదరాబాద్‌లోని తమ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను దేశమంతా విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్ అండ్ డి సెంటర్‌లో 25 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడంతో రాబోయే మూడేళ్లలో తమ ఇంజనీరింగ్ వర్క్‌ఫోర్స్‌ను భారీగా విస్తరించనున్నట్లు హోస్ట్ అనలిటిక్స్ సిఇఒ డెవ్ కెల్లోగ్ తెలిపారు. హైదరాబాద్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో సోమవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న ఉత్సాహపూరితమైన వ్యాపార వాతావ రణమే తమ సంస్థ సహకరిస్తోందని, వి లవ్ హైదరాబాద్ అన్నారు. సమాచార భద్రత విషయంలోనూ అత్యంత ప్రభావవంతంగా పనిచే స్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఇప్పటికే 150 మందికి పైగా వ్యక్తులను ఉద్యోగాల్లోకి తీసుకుందని, ఇందులో అగ్రశ్రేణి ఇంజనీరింగ్, క్లౌడ్ ఇపిఎం సాఫ్ట్‌వేర్ ప్రతిభావంతులున్నారన్నారు. తమ సంస్థపై 10 మిలియన్ డాలర్ల స్టార్టప్స్ నుంచి 10 బిలియన్ డాలర్ల మల్టీనేషనల్ వరకూ హోస్ట్ ఎనలిటిక్స్‌పై ఆధారపడటంతో పాటుగా ఆర్థిక ప్రణా ళిక, బడ్జెటింగ్, మోడలింగ్, కన్సాలిడేషన్స్, రిపోర్టింగ్‌లో సహకారం అందిస్తుందన్నారు. తమ కంపెనీ కార్యకలాపాలు అమెరికాలో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇన్ఫీ సంక్షోభంలో రవి వెంకటేషన్‌కు అండగా కిరణ్ మజుందార్ షా

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ స్వతంత్ర డైరెక్టర్ రవి వెంకటేషన్‌పై కొందరు వాటాదారుల నుంచి విమర్శలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మరో స్వతంత్ర డైరెక్టర్ కిరణ్ మజుందార్ షా ఆయనకు బాసటగా నిలిచారు. కంపెనీలో కార్పొరేట్ పాలన ప్రమాణాలు తుడిచి పెట్టుకుపోతున్నాయంటూ తరచూ విమర్శలు చేసే ఇన్ఫీ మాజీ సిఎఫ్‌ఒ బాలకృష్ణన్ కూడా.. కొ– చైర్మన్ నుంచి స్వతంత్ర డైరెక్టర్‌గా మారిన రవి వెంకటేషన్ బోర్డు నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.




స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31750.82	154.76	0.49%
నిఫ్టీ	9912.80	55.75	0.57%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27950	29893.05	0.76%
ముంబై	28450	30427.81	0%
ఢిల్లీ	28000	29946.52	0%
కోల్‌కతా	28660	30652.41	1.02%
కేరళ	27100	28983.96	0%
బెంగళూరు	27500	29411.76	0.47%
హైదరాబాద్	27950	29893.05	0.76%
గల్ఫ్	1374.68	1470.25	0.02%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	42000.00	41900.00	0.24
ముంబై	42000.00	41900.00	0.24
ఢిల్లీ	42000.00	41900.00	0.24
కోల్‌కత్తా	42000.00	41900.00	0.24
హైదరాబాద్	42000.00	41900.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

డిసెంబర్ నాటికి కొత్త రూ. 1,000 నోటు



● త్వరలో ముద్రణ ప్రారంభించనున్న ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : నోట్ల రద్దు ప్రకటన తర్వాత రద్దు చేసిన రూ. 1000 నోటు మళ్లీ రానుంది. త్వరలో కొత్త రూపంలో ఈ నోటును విడుదల చేసేందుకు రిజర్వు బ్యాంక్ సన్నాహాలు చేస్తోందని అధికార వర్గాల సమాచారం. గతంతో పోల్చితే ఈసారి 1000 నోటులో సెక్యూరిటీ ఫీచర్లు మరింత పెంచనున్నారని తెలుస్తోంది. కొత్త వెయ్యి నోటు ముద్రణ ప్రక్రియ పేపర్‌ను సిద్ధం చేస్తున్నారని, డిసెంబర్ నాటికి ఈ నోటు వచ్చే అవకాశముందని అంటున్నారు. తాజాగా రూ. 200 నోటును చలామణిలోనికి తీసుకొచ్చిన రిజర్వ్ బ్యాంక్ త్వరలోనే రూ.1,000 నోటును కూడా అందుబాటులోనికి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేస్తోంది. రూ. 200 నోటు ఎక్కడ లభిస్తుందా? అని ప్రజలు ఆతృతతో చూస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే కొత్త వెయ్యి నోటును తీసుకురానున్నారనే వార్త వారిలో మరింత ఆనందాన్ని నింపనుంది. రూ.2,000 నోటు ముద్రణను నిలిపివేసిన ఆర్‌బిఐ, కొత్త రూ.1,000 నోటు ముద్రణను మైసూర్, సల్బోని (పశ్చిమ బెంగాల్) మింట్లలో మొదలుపెట్టనుందని తెలుస్తోంది. ఈ నోటు అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో డిజైన్ అయ్యిందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆర్‌బిఐ అధికారులు వెల్లడించారు. మెరుగైన భద్రతా లక్షణాలు, కొత్త డిజైన్‌తో కొత్త వెయ్యి నోట్లను కేంద్రం విడుదల చేయనుంది. మైసూర్, సల్బోనిలో ప్రింటింగ్ ప్రెస్ ప్రింటర్లు కొత్తగా రూ.1,000 నోట్లను ముద్రించటానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు 2017 నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయని నివేదించింది. అయితే ఫిబ్రవరి నెలలో ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి శక్తికాంత దాస్ రూ.1000 నోటును ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని ప్రకటించారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వం కొత్త వెయ్యి నోటును తీసుకు రానుందనే సమాచారం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తక్కువ విలువ కలిగిన కరెన్సీలు లేకపోవడంతో కేంద్ర బ్యాంకు ఆగస్ట్ 25న కొత్త రూ.200, రూ 50నోట్లను విడుదల చేసిన సంగతి తెలిసిందే. రూ.100, రూ.500 మధ్య మరో కరెన్సీ నోటు ఇప్పటి వరకూ లేదు. దీంతో రూ.200నోటు మంచి ఆదరణ పొందుతుందని ఆర్‌బిఐ అంచనా వేస్తోంది. నోట్ల రద్దు తర్వాత పెద్ద నోట్లు రావడంతో ఎదురవుతున్న చిల్లర సమస్యలను ఈ నోటు పరిష్కరిస్తుందని భావిస్తున్నారు. తొలుత ఆర్‌బిఐ కార్యాలయాలు, కొన్ని బ్యాంకుల్లో మాత్రమే ఈ రూ.200 నోటును జారీ చేయనున్నట్లు వెల్లడించింది.

టాప్-10లో ఏడు మోడళ్లు

● రికార్డులను కొనసాగిస్తున్న మారుతీ సుజుకీ

న్యూఢిల్లీ: దేశీయంగా ప్రయాణికుల వాహన అమ్మకాల్లో మారుతీ సుజుకీ ఇండియా రికార్డులు కొనసాగుతున్నాయి. టాప్ 10 సేల్స్ బ్రాండ్లలో కంపెనీకి చెందిన ఏడు మోడళ్లు స్థానం దక్కించుకున్నాయి. జులై నెలలో దేశీయంగా మారుతీ సుజుకీకి చెందిన ఏడు మోడళ్లు స్థానం దక్కించుకున్నాయి. వాహన తయారీ దారుల సంఘం (సియామ్) నివేదిక ప్రకారం గత నెల అమ్మకాల్లో మారుతీ ఆల్టో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత బాలెనో, వ్యాగనర్, బ్రెజ్జా, సిఫ్ట్ తొలి ఐదింటిలో చోటు సంపాదించాయి. ఎనిమిది, తొమ్మిది స్థానాల్లోనూ మారుతీ మోడళ్లే ఉండడం విశేషం. ప్యాసింజర్ వాహన విక్రయాల్లో అగ్రస్థానంలో ఉన్న మారుతీ ఆల్టో విక్రయాలు 25,009 యూనిట్లు ఉన్నాయి. 19,153 యూనిట్లతో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో ద్వితీయస్థానాన్ని ఆక్రమించింది. వేగనర్ 16,301 యూనిట్ల అమ్మకాలతో తృతీయస్థానంలో నిలిచింది. 15,243 యూనిట్ల విక్రయాలతో విటారా బ్రెజా, 13,738 యూనిట్లతో స్విఫ్ట్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. హ్యుందాయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ 10 ఆరో స్థానంలో (12,002 యూనిట్లు), హ్యుందాయ్ ఎలైట్ ఐ 20 (11,390 యూనిట్లు), ఆరు, ఏడో స్థానాల్ని పొందాయి. మారుతీ డిజైర్ 11,187 యూనిట్లతో 8వ స్థానంలోనూ, ఇదే కంపెనీకి చెందిన హ్యాచ్‌బ్యాక్ సెలెరియో 9వ స్థానంలో (11,087 యూనిట్లు) ఉన్నాయి. హ్యుందాయ్ ఎస్‌యూవీ క్రెటా 10,556 యూనిట్లతో 10వ స్థానంలో ఉన్నాయి.



ప్రపంచంలోనే తొలి డైమండ్ ఫ్యూచర్స్

న్యూఢిల్లీ: ఐసిఇఎక్స్(ద ఇండియన్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్) సోమవారం ప్రపంచంలోనే తొలి డైమండ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్స్‌ను ప్రారంభించింది. రిలయన్స్ అడాగ్‌కు చెందిన ప్లాట్‌ఫామ్ ఐసిఇఎక్స్ ఈ కొత్త టూల్‌తో వ్యాపారులకు సదవకాశాన్ని కల్పిస్తోంది. నవంబర్, డిసెంబర్, జనవరిలో గడువు తేదీకి ఒక క్యారెట్ కాంట్రాక్ట్.. గుజరాత్‌లోని సూరత్ వద్ద డెలివరీ సెంటర్ ఉంటుందని ఎక్స్ఛేంజ్ ప్రకటించింది. డైమండ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌లతో ట్రేడింగ్‌ను ప్రారంభించేందుకు గాను ఐసిఇఎక్స్ ఇంతకుముందు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఈమేరకు అనుమతి పొందింది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ క్యాపిటల్ ఈ ఎక్స్ఛేంజ్‌లో అతిపెద్ద ఇన్వెస్టర్‌గా ఉంది. ప్రపంచంలో 15 రఫ్ డైమండ్లలో 14 డైమండ్లను పాలిషింగ్ చేసే దేశంగా భారత్ ఉంది.





వార్షికోత్సవం స్పెషల్ రెనాల్ట్ క్విడ్

న్యూఢిల్లీ: రెనాల్ట్ ఇండియా వార్షికోత్సవ స్పెషల్ ఎడిషన్‌లో భాగంగా 'క్విడ్ 02'ను లాంఛ్ చేసింది. 0.8 లీటర్, 1.0 లీటర్ ఇంజిన్ ఆప్షన్లలో రెండు వేర్వేరు రంగులలో కస్టమర్లకు లభించనుంది. అయితే ఈ క్విడ్ 02 ప్రారంభ ధరను రూ. 3,42, 800 (ఎక్స్‌షోరూమ్, న్యూ ఢిల్లీ)గా నిర్ణయించింది. కొత్త కాస్మొటిక్ మార్పులు తప్ప మిగతా అంతా రెగ్యులర్ క్విడ్ మోడల్‌గానే తీర్చి దిద్దిన ఈ కొత్త కారు రెండు ఇంజిన్ ఆప్షన్లలో లభించనుంది. ఆర్ఎక్స్ ఎల్ 0.8 లీటర్ వేరియంట్ కోసం రూ. 3.43 లక్షలు గాను, ఆర్ఎక్స్ టి 0.8లీటర్ ఇంజిన్ వేరియంట్ ధర రూ .3.76 లక్షలు, ఆర్ఎక్స్ 1.0 లీటర్ వేరియంట్ ధర రూ .3.64 లక్షలు, ఆర్ఎక్స్ టి 1.0 లీటర్ల వేరియంట్ కో సం రూ. 3.98 లక్షలుగా ఉండనుంది. కాగా క్విడ్ 02 వార్షికోత్సవ స్పెషల్ ఎడిషన్ దేశంలో విక్రయాలపై రెనాల్ట్ ఇంకా నిర్ధారించలేదు.

కొత్త డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులకు భూ అన్వేషణ

ఏరోస్పేస్ పార్కులతో ఇప్పటికే నిండుకున్న ఆదిభట్ల, నాదర్‌గుల్, శంషాబాద్

మన తెలంగాణ / హైదరాబాద్ : డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో ఇప్పటి వరకు రూ.500 కోట్ల వరకు వచ్చిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ రంగంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటు కోసం హైదరాబాద్ పరిసరాల్లో కొత్తగా 600 ఎకరాల భూముల కోసం టిఎస్‌ఐఐసి అన్వేషణ ప్రారంభించింది. నూతన భూసేకరణ జరిగితే ఈ రంగంలో పెట్టుబడులు రూ. 1 వెయ్యి కోట్ల వరకు వస్తాయన్న అంచనాలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదిభట్ల, నాదర్‌గుల్ ఏరోస్పేస్ పార్కులతో పాటు జిఎంఆర్ సంస్థ ఏరోస్పేస్ పార్కు శంషాబాద్‌లో ఏర్పాటు చేసుకుంది. ఈ స్థలాల్లో ప్రస్తుతం బోయింగ్, టాటా ఏరోస్పేస్ సంయుక్త భగస్వామ్యంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ పనులు కొనసాగుతున్నాయి.అలాగే శంషాబాద్‌లోనూ జిఎంఆర్ సంస్థకు స్థలాలు కేటాయించడంతో హైదరాబాద్ పరిసరాల్లోనే నూతన స్థలాల కోసం ప్రభుత్వం అన్వేషిస్తోంది. డిఫెన్స్ ఎలక్ట్రానిక్ పార్కు, క్లస్టర్ కోసం కనీసం 600 ఎకరాల స్థలం అవసరం కానుందని అధికారులు అంచనా వేశారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో కొత్తగా ఫెసిలిటీ కేంద్రాలను పెట్టాలని భావిస్తున్న అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయి. ఇందుకు కారణం ఇక్కడ బోయింగ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లాంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి విమానాలు, హెలీకాప్టర్ విడి భాగాలను తయారు చేస్తుండడమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. క్యాబిన్‌తో పాటు ఏయిర్ క్రాఫ్ట్ ఇంజన్ పని చేసే విధానంపై నూతనంగా ఎయిర్‌లైన్స్ రంగంలోకి వచ్చే పైలెట్లకు శిక్షణ ఇస్తున్నారు. ఫెంచ్‌కు చెందిన ఏరో సంస్థ హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తోంది. ఇది కాకుండా డిఫెన్స్ రంగంలో హకీంపేట, దుండిగల్, నాదర్‌గుల్, వరంగల్ సమీపంలోని మామునూర్‌లో ఏయిర్‌పోర్టులు ఉన్నాయి. వీటిలోనూ వరంగల్ మినహా ఇతర చోట్ల పైలెట్లకు శిక్షణ కార్యకలాపాలు సాగుతున్నాయి. విమానాల విడి భాగాలను తయారు చేసే ఏరోస్పేస్ పార్కుల ద్వారా రాష్ట్రానికి మరింత గుర్తింపు రావడం ఖాయమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏయిర్ క్రాఫ్ట్ ఇంజన్ తయారీ మినహా విమానం బాడీ ఇతర విడి భాగాలను తెలంగాణలోనే ఈ ఏరో స్పేస్ పార్కుల్లో తయార చేయనున్నారు. ప్రస్తుతం ఆదిభట్ల ఏరోస్పేస్ పార్కులో టాటా సంస్థ జర్మనీకి చెందిన రుమాగా సంస్థతో కలిసి డార్నియర్ విమాన పరికరాల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. మహేశ్వరం సమీపంలోని ఎలక్ట్రానిక్స్ సిటీలో ప్రైవేటు రంగంలో కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ సంస్థ 24 వేల చ. గజాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఫెసిలిటీ కేంద్రాన్ని మంత్రి కెటిఆర్ ఇటీవలే ప్రారంభించారు. రక్షణ శాఖకు సంబంధించిన కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ప్రయోగించే రిమోట్ వెపన్స్‌ను కళ్యాణి రాఫెల్ సంస్థ తయారు చేస్తోంది. డిఆర్‌డిఓ, బిడిఎల్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ ప్రైవేటు రంగంలోనూ పెట్టుబడులను ఆకర్షించేందుకు కళ్యాణి రాఫెల్ సంస్థకు ఫెసిలిటి కేంద్ర ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందించింది.

తీర్పుకు వ్యతిరేకంగా హైకోర్టుకు గుర్మీత్!



రోహ్‌తక్ : అత్యాచారం కేసులో సిబిఐ ప్రత్యేక కోర్టు విధించిన 20 సంవత్సరాల జైలు శిక్ష తీర్పును హైకోర్టులో సవాలు చేయనున్నట్లు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ తరఫు న్యాయవాదులు సూచన ప్రాయంగా తెలిపారు. కోర్టు తీర్పు పూర్తి కాపీ చదివిన తరువాత తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామని రోహ్‌తక్ జైలు వెలుపల మీడియా ప్రతినిధులతో అన్నారు. ఆశ్రమంలో సాధ్వీలుగా ఉన్న ఇద్దరు మహిళలపై అత్యాచారం జరిపిన గుర్మీత్‌ను కఠినంగా శిక్షించాలన్న సీబీఐ వాదనతో ఏకీభవించిన జడ్జి జగ్‌దీప్ సింగ్ దోషికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన సంగతి తెలిసిందే. 2002నాటి అత్యాచారం కేసును సిబిఐ సమగ్రంగా దర్యాప్తు చేయలేదని, సరైన సాక్ష్యాధారాలు కూడా సమర్పించ లేకపోయిందని గుర్మీత్ తరఫు న్యాయవాదులు ఆరోపించారు. సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళతామని పేర్కొన్నారు. మరోవైపు గుర్మీత్‌కు శిక్ష విధిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) తదితర పార్టీలు స్వాగతించాయి. తీర్పును ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనని, అయితే గుర్మీత్‌ను దోషిగా ప్రకటించిన తరువాత హర్యానాలో చెలరేగిన హింసకు భాధ్యత వహిస్తూ రాష్ట్ర సిఎం ఖట్టర్ రాజీనామా చేయాలని సిపిఐ నేత డి. రాజా డిమాండ్ చేశారు.

కర్ఫ్యూ నీడలోనే సిర్సా

డేరాబాబాపై తీర్పు వెలువరించాక హర్యానా, పంజాబ్‌లో భారీ భద్రత





సిర్సా: గుర్మీత్ సింగ్‌కు శిక్ష విధింపు నేపథ్యంలో దేరా ప్రధాన కార్యాలయం ఉండే సిర్సాలో సైనిక కవాతు జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణ చర్య లలో భాగంగా పలు వీధులలో పోలీసు, పారామి లిటరీ బలగాలు గస్తీ తిరిగాయి. అత్యాచారాల కేసులో తీర్పు ఏ స్థాయిలో ఉందనేది వెంటనే సిర్సాకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుం టూనే భద్రతా బలగాలు సునిశిత ప్రాంతాలలో నిఘా తీవ్రతరం చేశాయి. సిర్సాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. శాంతియుత పరిస్థి తులు కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు సీనియర్ అధికారి వి ఉమాశంకర్ తెలిపారు. ఈ ప్రాంతంలో కర్ఫ్యూను కొనసాగించారు. పరిస్థి తిని బట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారని అధికార వర్గాలు వెల్లడించాయి. శాంతియుత పరిస్థితులు ఉన్నప్పటికీ శాంతిభద్రతల పరిరక్ష ణలో ఎలాంటి సడలింపులు ఉండబోవని స్పష్టం చేశారు. పరిస్థితి అదుపు తప్పకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని హిస్సార్ ఐజిపి ఎఎస్ థిల్లాన్ తెలిపారు.

శిక్ష శిక్షనే : అమరీందర్

గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధింపుపై పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ నిశిత స్థాయిలో వ్యాఖ్యానించారు. ఇది స్వాగతించే, తోసిపుచ్చే అంశం ఏమీ కాదని , అయితే తీర్పును తీర్పుగా ఆమోదించాలని ప్రజ లకు విజ్ఞప్తి చేస్తున్నానని సిఎం చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్య తను ఇస్తుందని, అవసరమైనంత వరకూ సుని శిత ప్రాంతాలలో కర్ఫ్యూ అమలులో ఉండనే ఉంటుందని తెలిపారు. తీర్పుపై తానేమీ స్పందిం చదల్చుకోలేదని, ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ముఝే మాఫీ కరో స్థాయికి పితాజీ



గుర్మీత్‌కు ఆయన ఉండే దేరాతో పాటు అన్నీ ప్రత్యేకతలే. ఇతర గురువులతో పోలిస్తే ఆయ నను నమ్ముకుని ఆయన దేరాలోనే బస చేసి ఉండే అత్యధిక సంఖ్య బలహీన వర్గాలు ఆయన బలం. ఇతర స్వాముల్లాగా నిరాడంబరత కాకుండా దర్జా, అట్టహాసం హంగామా ఆధుని కత కలబోతగా సాగిన జీవితం. తనకు లెక్కలే నంత మంది సినీస్టార్లు, క్రికెటర్లు, ప్రముఖ రాజ కీయ నేతలు అభిమానులనీ చెప్పే రామ్ రహీం అధీనంలో సిర్సా వేయి ఎకరాల విశాల ప్రాంగ ణపు దేరాకు రోజూ వేలాది మంది శిష్యులు వస్తూ ఉంటారు. ఆయన భాషణలను వినేందుకు పోటీపడుతారు. గుర్మీత్‌ను వారు పితాజీగా తండ్రి భావనతో ఆదరిస్తారు. శిష్యులకు ఆయన సందేశం కూడా దివ్యంగానే ఉంటుంది. మద్యం మాంసాలు విడనాడాలని, సాధారణ జీవితం గడపాలని చేసే మాటలతో తాము మారిపోయి నట్లు పలువురు చెపుతుంటారు. ఆయన పాదా లపై వాలిపోతూ ఉంటారు. ఎందరో తమ కుటుంబాలతో వచ్చి ఆశ్రమంలో గడుపుతూ ఉంటారు. అయితే నిరాడంబర జీవితం అని చెప్పే స్వామి గడిపే జీవితం తరువాతి క్రమంలో ఆయనపై వచ్చి పడ్డ అభియోగాలు, నిరూపిత మైన జంట నేరాలు వేరు విధంగా ఉన్నాయి. ఆయన తానో దైవ దూతను దాదాపుగా దైవంగా చెప్పాడు. అంతేకాదు ఈ సందేశాలతో హిట్ సిని మాలు తీశాడు. తాను వేరే గ్రహాల వారిని కూడా ఓడించగలనని, తనకు అద్భుత శక్తులు ఉన్నా యనే హీరోయిజాన్ని ఓ సినిమాలో ప్రదర్శిం చాడు. అయితే నేరం శిక్ష తరువాత వచ్చిపడ్డ జైలు జీవితం ఇప్పుడు ఆయనను వెక్కిరించాయి. పితాజీ అంటే ఏ పాపం అయినా చేయవచ్చు. ఎందుకంటే ఆయన పుణ్యాలను ప్రసాదించేవా డనే ప్రచారం ఉన్న దేరా గూడులో నుంచి జైలుకో ర్టులో తనను క్షమించమని, ఆరోగ్యం బాగా లేదని వేడుకున్నట్లు, మాఫీ కరో అన్న వైనం... మరి దేరాలో సాగే' పితాజీ మాఫీ' కఠినం తంతుతో పోలిస్తే దయనీయం ఏమీ కాదనే వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి.

హనీప్రీత్ వెంట ఉండాలట



చండీగఢ్: దేరాలో లాగానే జైలు లోనూ ఇష్టారాజ్యంగా ఉండాలని గుర్మీత్ దుర్నీతికి దిగినట్లు తెలి సింది. శుక్రవారం తాను రోహ్ తక్ జైలుకు వెళ్లే సమయంలో తనతో పాటు దత్తపుత్రిక హనీప్రీ త్‌ను కూడా తోడుగా తీసుకువెళ్ల తానని పట్టుపట్టాడు. పంచ్‌కుల నుంచి గుర్మీత్‌ను జైలుకు ఆర్మీ హె లీకాప్టర్‌లో తీసుకువెళ్లారు. హెలీ కాప్టర్‌లో ఆయన వెంట ఉన్న మహిళ దత్తపుత్రిక హనీప్రీత్ అని తరువాత తెలిసింది. జైలులో తన సపర్యలు చూసుకునేందుకు తన దత్తపుత్రి కను కూడా తీసుకువెళ్లేందకు వీలు కల్పించాలని గుర్మీత్ కోరారు. తనకు తలనొప్పి తీవ్ర వెన్నుపోటు ఉన్నందున ఆమెను కూడా జైలులో తనతో పాటు ఉంచుకునేందుకు కోర్టు అనుమతిని ఇచ్చిందని భద్రతా అధికారు లను నమ్మించేందుకు గుర్మీత్ విశ్వ ప్రయత్నం చేశారు. అయితే రోహ్‌తక్ జైలు వరకూ వచ్చిన తరువాత అధికారులు ఈ అంశం గురించి నిర్ధారించు కోగా కోర్టు నుంచి ఎలాంటి ప్రత్యేక అనుమతి లేదని వెల్లడి కావడంతో గురువు అబద్ధం ఆడినట్లుగా గుర్తించారు. తనతో పాటు జైలులో హనీప్రీత్‌ను కూడా ఉంచాలని గుర్మీత్ జైలు అధికారులకు దరఖాస్తు కూడా చేసుకు న్నట్లు, ఈలోగా హనీప్రీత్ తన లాయర్ ద్వారా దీనికి అవకాశం కల్పించా లని కోరినట్లు వెల్లడైంది.

సిజెఐగా దీపక్ ప్రమాణం



న్యూఢిల్లీ: భారత 45వ ప్రధాన న్యాయమూర్తి (సిజె ఐ)గా జస్టిస్ దీపక్ మిశ్రా (64) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకు సిజెఐగా బాధ్యతలు నిర్వర్తించిన జెఎస్ ఖేహర్ స్థానంలో ఆయన ఈ బాధ్య తలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనచేత ప్రమాణ స్వీకారం చేయించారు. దేవునిపై ఆంగ్లంలో ప్రమాణం చేస్తూ మిశ్రా 2018 అక్టోబరు 2 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు. మిశ్రా తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక కీలక తీర్పులను వెలువరిం చారు. కావేరీ జల వివాదం, బిసిసిఐ సంస్కరణలు, సహారా వంటి కీలక కేసుల్లో ఆయన కీలక తీర్పులను ఇచ్చారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఓ గ్యాంగ్‌రేప్ కేసులో నలుగురు నిందితులకు మరణ శిక్ష విధించిన ధర్మాసనంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. అలాగే, సినిమా థియేటర్లలో జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలన్న నిబంధనతో ఆదేశాలు జారీ చేశారు. 1977లో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించిన మిశ్రా ఒరిస్సా హైకోర్టులో రాజ్యాంగం, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, సర్వీస్, సేల్స్ ట్యాక్స్ తదితర కేసులను వాదించారు. మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ కాక ముందు 1996 జనవరి 17న ఒరిస్సా హైకోర్టు అద నపు జడ్జిగా నియమితులయ్యారు. 1997 డిసెంబరు 19న శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకో ర్టులో సీనియర్ న్యాయవాది అయిన మిశ్రా గతంలో పాట్నా, ఢిల్లీ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ

న్యూఢిల్లీ: రైతుల ఆత్మహత్యలు నివారించడానికి 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా చూడ్డమే లక్ష్యం అని కేంద్ర ప్రభుత్వం సోమ వారం సుప్రీంకోర్టుకు తెలిపింది. రుణాలు అంద ని ప్రాంతాల్లో, తూర్పు రాష్ట్రాలలో, జమ్మూకశ్మీ ర్‌లో రుణ సాయం అందించేందుకు ప్రత్యేక చర్య లు చేపట్టే ప్రతిపాదనలు చేసినట్లు వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'చాలా మంది రైతులు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని, తక్కువ ఆదాయం ఉన్న రైతుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం వెతుకుతోందని, ఆదా యాన్ని రెట్టిం పు చేసేందుకు యత్నిస్తున్నట్లు వ్యవసాయ మం త్రిత్వ శాఖ ప్రభుత్వానికి తెలిపింది. రైతుల ఆదా యాన్ని 2022నాటికి రెట్టింపు చేయడానికి తీసు కుంటున్న చర్యల జాబితాను న్యాయమూర్తులు ఎం.బి. లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాస నానికి సమర్పించింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న పథకాలు, అమలు చేస్తున్న పథకాల యథాతథ స్థితి నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 200 7లో చేపట్టిన రైతు జాతీయ విధానం(ఎన్‌పిఎ ఫ్)ను కూడా సమీక్షించింది. పంజాబ్‌కు చెందిన ఎన్‌జివో సంస్థ యూత్ కమల్ ఆర్గనైజేషన్ వేసిన పిల్ కారణంగా ప్రభుత్వ నివేదిక ధర్మాసనానికి వచ్చింది. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి బదులు ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత కార్య క్రమఎన్‌ఎఫ్ఎస్‌ఎం), నూనె గింజలు, పామ్ ఆయిల్ జాతీయ కార్యక్రమం(ఎన్‌ఎంఓఓపి), ఉద్యాన సమగ్రాభివృద్ధి కార్యక్రమం(ఎంఐడిహె చ్), వ్యవసాయ విస్తరణ, సాంకేతిక జాతీయ కా ర్యక్రమం(ఎన్‌ఎంఎఇటి), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కెవివై) వంటి పథకాలు చేపట్టిందని ఆ నివేదిక తెలిపింది. ప్రధాన్ మంత్రి ఫసల్ బీమాయోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటి వాటి గురించి కూడా వ్యవసాయ మంత్రిత్వ శాఖ సు ప్రీంకోర్టు ధర్మాసనానికి వివరాలు తెలిపింది. పం ట నష్టం 33 శాతం నుంచి 50 శాతం మేరకు ఉంటే రైతులు రుణాల చెల్లింపు కాలాన్ని గరి ష్ఠంగా రెండేళ్లకు పెంచమని బ్యాంకులకు సూ చించినట్లు, కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) విస్త రించినట్లు కూడా ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

ప్రజల ఆశలకు రెక్కలు తొడిగిన పథకాలు : మోడీ

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వం అమలు పరుస్తున్న అనేక పథకాలు మిలియన్ల మంది ప్రజల ఆశలకు రెక్కలు తొడిగాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జన్ ధన్ యోజన పథకాన్ని ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఈ మేరకు అభిప్రాయపడ్డారు. జన్ ధన్ యోజనతో పాటు సామాజిక భద్రత పథకాలు, ముద్ర యోజన, స్టాండప్ ఇండియా పథకాలు ప్రజల ఆశ లను నెరవేరుస్తున్నాయని తెలిపారు. పేద ప్రజల జీవితాల్లో నాణ్యవంతమైన, రూపాంతర మార్పును తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోందని చెప్పారు. 'నేడు జన్ ధన్ యోజన మూడేళ్లు పూర్తి చేసుకుంది, ఈ సందర్భంగాఈ పథకం ద్వారా లబ్ధి పొందిన కోట్లాది మంది ప్రజలు ముఖ్యంగా పేదలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని ప్రధాని మోడీ సోమవారం నాడు ట్విటర్‌లో పేర్కొన్నారు. పేదలను ఆర్థికంగా బలో పేతం చేయడానికి అమలు చేస్తున్న జన్ ధన్ విప్లవం ఓ చారిత్రక ఉద్యమమని ఆయన అభివర్ణించారు. కాగా, 90 కోట్ల కుటుంబాలు జన్ ధన్ యోజన ఖాతాల ద్వారా రూ.65000 కోట్లను డిపాజిట్ చేసుకున్నారని ప్రధాని ఆది వారం వెల్లడించిన విషయం విదితమే.

నక్సల్స్ కారిడార్‌పై సిఆర్‌పిఎఫ్ కన్ను



భువనేశ్వర్: ఒడిషాలో నక్సల్స్ తీవ్రవాద ప్రాబల్యాన్ని అరిక ట్టేందుకు నూతన పంథాను అవలంభించాలని సిఆర్‌పిఎఫ్ యోచిస్తోంది. రాష్ట్రంలోని కలహండి, కోరాపుట్, బోలన్‌గిర్ సరిహద్దుల వెంబడి తమ సరికొత్త ప్రాబల్య రాదారిని ఏర్పాటు చేసుకోవాలని మావోయిస్టులు వ్యూహరచనకు దిగుతున్నట్లు నిఘా సమాచారం అందడంతో అధికార యంత్రాంగం అప్ర మత్తం అయింది. సోమవారం ఇక్కడ సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జన రల్ ఆర్ఆర్ భట్నాగర్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మావోయిస్టుల ఎత్తు గడ గురించి ప్రస్తావించారు. సరిహద్దు ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం ఇతర అభివృద్ధి కార్యక్రమాలను దెబ్బతీసేందుకు, భద్రతా బలగాలకు సవాలు విసిరేందుకు యత్నిస్తున్నారనే అం శం వెలుగులోకి వచ్చిందని భట్నాగర్ తెలిపారు. వేరే ప్రాం తాల నుంచి వచ్చిన నక్సల్స్ కేడర్ ఒడిషాను తమ హింసాత్మక చర్యలకు కేంద్రంగా ఎంచుకోవడం, అంతరాష్ట్ర సరిహద్దు జిల్లా లను ఎంచుకుని స్థావరాలను బలోపేతం చేసుకోవడం విచిత్ర మైన విషయమే అని చెప్పారు. స్థానిక పోలీసు బలగాలతో సమ న్వయ రీతిలో వ్యవహరించి సిఆర్‌పిఎఫ్ బృందాలు ఈ సవా లును తిప్పికొట్టేందుకు తగు విధంగా వ్యవహరిస్తాయని తెలి పారు. రాష్ట్రానికి తిరిగి పారామి లిటరీ బలగాల తరలింపు అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంచి సహకారం అందుతోందని, స్థానిక పోలీసులు ఎప్పటికప్పుడు సహకరిస్తున్నారని భట్నాగర్ తెలి పారు. ఎప్రిల్‌లో సిఆర్‌పిఎఫ్ బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా భట్నాగర్ ఈ నక్సల్స్ ప్రాబల్య రాష్ట్రానికి వచ్చారు. రాష్ట్ర డిజిపి కెబి సింగ్, ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన కోరాపుట్‌లోని నక్సల్ ప్రాబల్య ప్రాంతాలలో పర్యటిం చారు. పిస్థితిని సమీక్షించారు. మల్కన్‌గిరి జిల్లాలోని మారు మూల ప్రాంతాలలోని పరిస్థితిని కూడా తెలుసుకున్నారు.

ఒడిశా సమీపంలో అల్పపీడనం

మన తెలంగాణ/హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం వరంగల్ జిల్లాపై ఎక్కు వగా ఉంది. ఈశాన్య ఒడిషా సమీపంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీనికి అనుబంధంగా ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం సముద్రమట్టానికి 7.6 కిలోమీ టర్ల ఎత్తులో పయనిస్తోంది. ప్రస్తుతం రుతుపవన ద్రోణి బికనీర్, హోసంగాబాద్, రాయపూర్ నుంచి వెళు తుండగా, మధ్య ఒడిషా కేంద్రంగా అల్పపీడన ద్రోణి 3.6 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దక్షిణ తమిళనాడు నుంచి కోస్తాంధ, రాయలసీమల వరకు ఏర్పడిన ద్రోణి క్రమంగా బలహీనపడుతోంది. ఫలి తంగా వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవ కాశాలు ఉన్నాయని, ప్రధానంగా మంగళవారం నాడు భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావ రణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో కొల్లాపూర్‌లో గరిష్టంగా 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కూసుమంచి, సంగారెడ్డి, కొత్తగూడెంలో 4, నారాయణఖేడ్, జుకల్, మధిర, మాచారెడ్డిలో 3, వెంకటాపురం, మెదక్, పినపాక, మర్పల్లి, గట్టు, బోధన్, నల్లబెల్లి, బొనకల్, ఆలంపూర్‌లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదేవిధంగా కొందుర్గు, హైదరాబాద్, దోమ, గంబీరావుపేట, కోస్గి, జూరాల, వెంకటాపూర్, గోవిందరావుపేట, మాగనూరు, పరిగిన, సదాశివనగర్, ఏటూరునాగారం, గండీడ్, మోమీన్‌పేట, బోధ్, గూడూరు, ఖానాపూర్, కొడంగల్, పరకాల, ఉట్నూరు తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది.

కార్తీని రెండోసారి ప్రశ్నించిన సిబిఐ



న్యూఢిల్లీ: కేంద్ర పరిశోధన సంస్థ(సిబిఐ) సోమ వారం రెండోసారి మాజీ కేంద్ర మంత్రి పి.చిదం బరం కుమారుడు కార్తీని ప్రశ్నించింది. తమ వెంచర్‌లోకి విదేశీ పెట్టుబడులను తెచ్చిన పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీల మీడియా గ్రూపుకు క్లియరెన్స్ ఇచ్చారన్న అవినీతి కేసులో కార్తీని సిబిఐ ప్రశ్నించింది. కార్తీ ఉదయం 11.30 గంటలకు ఇక్కడి సిబిఐ ప్రధాన కార్యాలయంకు వచ్చారు. ఈ కేసులో కారీ భాస్కర్ రామన్, రవి విశ్వనాథన్, మోహనన్ రాకేశ్‌లను కూడా ప్రశ్నించింది. పి.చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మారిషస్ నుంచి ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ నిధులు అందడంలో కార్తీకి ఉన్న సంబంధాన్ని సిబిఐ పరిశీలిస్తోంది. విదేశీ పెట్టుబడి ప్రోత్సా హక బోర్డు(ఎఫ్ఐపిబి) ద్వారా క్లియరెన్స్ ఇప్పించడంలో కార్తీకి హస్తం ఉందన్న విషయంలో ఈ పరిశీలన జరుపుతోంది. ఇంతకు మునుపు ఆగస్టు 23న కూడా సిబిఐ కార్తీని ప్రశ్నించింది.

యుపిలో పాత్రికేయుడిపై కాల్పులు

అమేథి(యుపి): హిందీ దినపత్రికకు చెందిన ఓ పాత్రికేయుడిపై మోటా ర్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కాల్పులు జరిపారు. 'అమర్ ఉజాలా' విలేకరి దిలీప్ కౌశల్‌ని ఆదివారం సాయంత్రం దుండగుడు కాల్చి అక్కడి నుంచి పారిపోయాడని జగదీశ్‌పూర్ పోలీస్‌స్టేషన్ అధికారి ఆర్. ఎ. కనౌజియా సోమవారం తెలిపారు. బుల్లెట్ గాయాలకు గురైన విలేకరిని వెంటనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం అతడికి ప్రాణాపాయ స్థితి తప్పిందని డాక్టర్లు తెలిపారు. పాత్రికేయుడి చేతికి బుల్లెట్ గాయాలయ్యాయి. పాత కక్షలే దీనికంతటికీ కారణమని భావిస్తున్నారు. పాత్రికేయుడి కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు జగదీశ్‌పూర్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జర్నలి స్టులకు భద్రత కల్పించాలని కోరుతూ అమేథిలోని వివిధ దినపత్రికలకు చెందిన పాత్రికేయులు జిల్లా మెజిస్ట్రేట్‌కు మెమోరాండం సమర్పించారు.

ఎన్‌డిఎలో ఎన్‌సిపి కలవదు : ప్రఫుల్



న్యూఢిల్లీ: జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డి ఎ)లో నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి) చేరబో దని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ప్రఫుల్ పటేల్ సోమవారం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఎన్‌సిపి చేరబోతుందన్న ఊహాగానానికి ఆధార మేలేదని ఆయన అన్నారు. తదుపరి మంత్రివర్గ మార్పు సమయానికి మోడీ ప్రభుత్వంలో ఎన్ సిపి చేరబోతుందని, క్యాబినెట్‌లో ఓ స్థానానికి కూడా పార్టీ పొందనుం దన్న ఊహాగానాన్ని ఖండి స్తూ ప్రఫుల్ పటేల్ ట్వీట్ చేశారు. మోడీని ప్రధానిగా ఆమోదించడం కష్టమని 2014 సార్వత్రిక ఎన్నికలకు మునుపు పవార్ చెప్పారు. కానీ ఇప్పుడు మోడీతో పవార్‌కు మంచి సంబంధాలే ఉన్నాయి. గత ఏడాది ఓ వేడుకలో 'తన తొలి రాజకీయ జీవితంలో పవార్ సాయంచేశారు' అని మోడీ చెప్పారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణ తథ్యమని భావిస్తున్నారు. ప్రత్యేకంగా రక్షణ, పట్టణా భివృద్ధి శాఖ పోర్ట్‌ఫోలియోలు ఖాళీగా ఉన్న నేపథ్యంలో రకరకాల ఊహా గానాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆశారాం కేసులో జాప్యమెందుకు?

గుజరాత్ సర్కార్‌పై సుప్రీం కోర్టు అక్షింతలు

న్యూఢిల్లీ: వివాదాస్పద ఆధ్యాత్మిక గురు ఆశారాం బాపు కేసులో విచార ణకు ఎందుకు జాప్యం చేస్తున్నారని సుప్రీంకోర్టు సోమవారం గుజరాత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అత్యాచారం కేసులో బాధితులను ఎందుకు విచారణ చేయలేదని న్యాయమూర్తులు ఎన్‌వి రామన్న, అమితవ్ రాయ్ లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసు వివరాలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణకు దీపావళి తర్వాత చేపట్టేందుకు వాయిదా వేసింది. ఆశారాం బాపు తమపై అత్యా చారం చేశారంటూ సూరత్‌కు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఆధారాలను సేకరించాలని ఏప్రిల్ 12న సుప్రీం కోర్టు గుజరాత్‌లోని ట్రయల్ కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు ఈ కేసులో 46 మంది ఇతర సాక్షిల సాక్ష్యాలను కూడా సేకరిం చాలని సూరత్ ట్రయల్ కోర్టును ఆదేశించింది.

సైనికుల పొగ బాంబులు చోరీ

ఝాన్సీ (ఉత్తర్‌ప్రదేశ్): సైనికులతో వెళ్తున్న ప్రత్యేక రైలులో పొగ బాంబులను గుర్తు తెలియని దుండగులు అపహరించినట్టు పోలీసులు తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన గూఢచారులు, దాని అనుబంధ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)కు సమాచారాన్ని చేరవేశాడన్న అనుమానంతో ఝాన్సీ కలెక్టరేట్ క్లర్క్‌పై ఉత్తర్‌ప్రదేశ్ పోలీస్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) కేసు నమోదు చేసిన కొన్ని వారాల క్రితం జరిగిన ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. ఆదివారం మహారాష్ట్రలోని పుల్గాన్ నుంచి ఈ రైలు పంజాబ్‌లోని పఠన్‌కోట్‌కు వెళ్తుండగా ఝాన్సీ రైల్వే స్టేషన్ వెలుపల ఆగింది. ఈ సమయంలో ఒక బోగీ సీల్ తెరువబడి ఉండడం, అందులో ఒక కార్టన్ పొగ బాంబులు లేకపోవడాన్ని సైనికులు గుర్తించారు. ఈ మేరకు గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జిఆర్‌పి) కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరుపుతున్నారు.

కోలుకుంటున్న ప్రియాంక



న్యూఢిల్లీ: డెంగీ జ్వరానికి ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ అధ్య క్షురాలు సోనియాగాంధీ కుమార్తె ప్రియాంక వాద్రా క్రమక్రమంగా కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు సోమవారం పేర్కొన్నాయి. ఈనెల 23న ఆమె సర్ గంగారామ్ ఆసుపత్రి (ఎస్‌జిఆర్ హెచ్)లో చేరగా, ఛాతి మెడిసిన్ విభాగానికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అరూప్ బాసు చికిత్స చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎస్‌జిఆర్‌హెచ్ చైర్మన్ డాక్టర్ డిఎస్ రాణా వివరించారు. ప్రియాంక క్రమక్రమంగా కోలుకుంటున్నారని, ఆమెకు ఎలాంటి జ్వరం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా, ఢిల్లీ మూడు రకాల వ్యాధుల వలయంలో చిక్కుకుంది. డెంగీ, చికున్‌గున్యా, మలేరియాతో తీవ్ర సతమతమవుతోంది. నగరంలో ఈ సీజన్‌లో ఈనెల 19 వరకు 657 మంది డెంగీ బారిన పడినట్లు మున్సిపల్ రికార్డులను బట్టి తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో 9 మంది మృతి

పుణె: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మహారాష్ట్ర రోడ్డు రవాణాకు చెందిన బస్సు పుణె జిల్లా నారాయణ్‌గాన్ సమీపంలో టెంపోను ఢీకొట్టింది. ఈ ఘటనలో 9 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 12 మంది గాయపడ్డారు. బస్సు నాశిక్ జిల్లా ట్రింబకేశ్వర్ నుంచి పుణెకు వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.45 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో టెంపోను బస్సు డ్రైవర్ గమనించకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్లు కనిపిస్తోందని ఓ సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. ఉల్లిగడ్డల లోడ్‌తో వస్తున్న టెంపోను రోడ్డు పక్కన ఆపి డ్రైవర్ టైర్ మారుస్తుండగా ఈ దుర్ఘటన వాటిల్లిందని, మృతులను గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించామన్నారు.



చివరి నిమిషంలో థాయ్‌లాండ్ మాజీ ప్రధాని పరార్!

బ్యాంకాక్: నేరారోపణ ఎదుర్కొంటున్న థాయ్‌లాండ్ మాజీ ప్రధాని ఇంగ్లూక్ షినవత్రా చివరి నిమిషంలో ఎవరూ ఊహించని విధంగా దేశం నుంచి పరారయింది. సబ్సిడీ పథకంలో విలువైన బియ్యం కొనుగోలు విషయంలో ఆమె నేరపూరిత నిర్లక్ష్యం వహించారన్న అభియోగాన్ని థాయ్‌లాండ్ సైనికపాలకులు(జుంటా) తీసుకొచ్చారు. శుక్రవారం జరగనున్న విచారణకు ఆమె హాజరవుతారని భావిస్తుండగానే ఆమె చివరి నిమిషంలో దేశం వదిలి పరారయ్యారు. దీనికి ముందు ఆమె బుధవారం బౌద్ధ సన్యాసులకు ప్రత్యేక వంటకాలతో మొక్కులు చెల్లించారు. బ్యాంకాక్ చౌఫ్రాయ నదిలో చేపలను వదిలిపెట్టారు. కోర్టు ఆమెకు కఠిన శిక్ష విధించనున్నదని అభిజ్ఞవర్గాల ద్వారా తెలుసుకున్న ఇంగ్లూక్ చివరికి దేశం వదిలి పారిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఆమె తన కుమారుడు సుపేస్క్ అమోర్చాత్(15)ను థాయ్‌లాండ్‌లోనే వదిలి, ఇద్దరు అనుచరులతో పరారయ్యారని సమాచారం. ఆమె గురువారం మధ్యాహ్నమే దేశం వదిలిపోయినట్లు ఆమె వద్ద రెండు దశాబ్దాలుగా పనచేస్తున్న మరో అనుచరుడు చెప్పారు. 2014లో జరిగిన తిరుగుబాటుతో ఇంగ్లూక్ ప్రభుత్వం కూలిపోయింది. ఆమె సింగపూర్ గుండా దుబాయ్‌కు వెళ్లిపోయారు. అక్కడ ఆమె సోదరుడు, మాజీ ప్రధాని థాసిన్ షినవత్రాకు ఇల్లు ఉంది. దుబాయ్ లో ఉన్న ఆమె మీడియాకు అందుబాటులో లేరు.

ఆత్మాహుతి దాడి,13 మంది మృతి

కాందహార్: ఆఫ్ఘన్ సైనికుల వాహనాలబారుపై సోమవారం జరిగిన తాలిబన్ ఆత్మాహుతి దాడిలో 13 మంది మరణించారు. హెల్మాండ్ రాష్ట్రంలో ఈ దారుణం జరిగింది. ఆ దేశపు భద్రతా బలగాలపై వరుస దాడులలో ఇది తాజాది. యుద్ధంతో చిన్నాభిన్నమైన దేశంలో భద్రతా బలగాలు ఎదుర్కొన్న మరో భీకర దాడిగా దీనిని అధికారులు పేర్కొన్నారు. నావా జిల్లాలో జాతీయ సైనిక కన్వాయ్‌పై జరిగిన ఈ దాడిలో కొందరు పౌరులు కూడా మరణించారు. మొత్తం 15 మరణాలు, 19 మందికి గాయాలు ఇంతవరకూ ధృవపడినట్లు అనధికార వార్తలు తెలిపాయి. మృతులలో సైనికులే అధికంగా ఉన్నట్లు తెలిసింది. ఇతర వివరాలు తెలియలేదు.

23న సింగపూర్ అధ్యక్ష ఎన్నిక

సింగపూర్: ఒకటికంటె ఎక్కువ అభ్యర్థులు రంగంలో ఉంటే వచ్చేనెల 23న అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సింగపూర్ అధికారులు సోమవారం తెలిపారు. అభ్యర్థిత్వం కోసం పోటీలో పార్లమెంట్ మాజీ స్పీకర్ హలిమా యాకోబ్, భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త మహమ్మద్ సాలే మరికాన్ , ఫరిద్ ఖెయిమ్ ఖాన్ ఉన్నారు. చివరకు అర్హతహతగల అభ్యర్థి రంగంలో ఒకరే మిగిలితే ఆమెను లేదా ఆయనను నామినేషన్ రోజున అధ్యక్ష పదవికి ఎంపికైనట్లు ప్రకటిస్తారు. హమా ఎన్నికైతే ఆ దేశ మొట్టమొదటి అధ్యక్షురాలు అవుతారు.

ఎన్‌ఆర్‌ఐకి వక్తృత్వ ఛాంపియన్‌షిప్

సింగపూర్: రాజీ పడడం ద్వారా సంతోషకరమైన వైవాహిక జివితాన్ని అనుభవించవచ్చునని తన ప్రసంగంలో సూచించిన ఒ భారత సంతతికి చెందిన సింగపూర్ వాసికి కెనడాలో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ బహిరంగ వకృత్వ చాంపియన్ షిప్ లభించింది. 43 ఏళ్ల మనోజ్ వాసుదేవన్ 2009లోనే ప్రసంగించడాన్ని తర్ఫీదు చేశారు. తర్ఫీదు కోసం ఆయన కామెడీ షోలు ఇచ్చారు. టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప పోటీలో ఆయన స్వర్ణం గెలిచారు. దంపతులు కలిసికట్టుగా ఉంటూ రాజీ మార్గంలో కాపురం చేస్తే ఆనందం ఆ వెంటే ఉంటుందని ఆయన సూచించి స్వర్ణం దక్కించుకొన్నారు.

కారుబాంబు పేలి 12 మంది మృతి



బాగ్దాద్: ఇరాక్ రాజధాని తూర్పుభాగాన సోమవారం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో కారు బాంబు పేలి కనీసం 12 మంది మరణించారు. పేలుడు పదార్థాలతో నిండిన ఆ కారు దూసుకు వచ్చి పేలడంతో మరి 25 మంది గాయపడ్డారు. ఆ నగరంలో షియాలు అధికంగా నివసించే జమీలా మార్కెట్ వద్ద ఈ నేలుడు సంభవించింది. అక్కడ ప్రజలు భయాందోళనలతో పరుగెత్తడం కనిపించిందని సమాచారం వచ్చింది. పేవ్‌మెంట్లపై గాజు, లోహ ముక్కలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు మూసివేశాయి. బాధ్యత తమదేనని ఇంకా ఏ గ్రూపూ ప్రకటన చేయలేదు.


ఎన్‌జిఒల సంఘం భవనంపై విచారణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీ ప్రాంతంలో ఉన్న ఎపి ఎన్జీవో సంఘ భవనంలోని సమావేశ మందిరానికి, నాలుగు గదులకు భాగ్యనగరం తెలంగాణ ఎన్జీవో సంఘం వేసిన తాళాలు తీసి తమకు అప్పగించలేదని పేర్కొంటూ ఎపి ఎన్‌జిఒ సంఘం హైకోర్టులో కోర్టు ధిక్కార కేసు సోమవారం విచారణకు వచ్చింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవీలతో కూడిన డివిజన్ బెంచ్ రిట్‌ను విచారించింది. తాళాలు ఇచ్చేందుకు సిద్ధమేనని, అయితే హైకోర్టు ఆదేశించిన మేరకు తమకు సభ్యత్వం ఇవ్వడం లేదని భాగ్యనగర్ తెలంగాణ ఎన్‌జిఒ సంఘం హైకోర్టుకు తెలిపింది. దీనిపై బెంచ్ విచారణ అనంతరం ఎంతమంది సభ్యత్వ బకాయిలు ఉన్నారో,ఎంతమంది సభ్యత్వం కోరుతున్నారో పూర్తి వివరాలు ఇవ్వాలని భాగ్యనగర్ తెలంగాణ ఎన్‌జిఒ సంఘాన్ని ఆదేశించి విచారణ వచ్చే బుధవారానికి వాయిదా వేసింది.

హైకోర్టుకు ఎన్‌సిటిఇ అభ్యర్థన

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఉపాధ్యాయ విద్యను బోధించే విద్యా సంస్థలు కచ్చితంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ) జారీ చేసే అక్రిడేషన్ పొందాలన్న చట్ట సవరణ నిబంధనను సవాల్ చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పలు రాష్ట్రాల హైకోర్టుల్లోని ఈ తరహా కేసుల్ని ఢిల్లీ హైకోర్టుకు బదలాయించాలని తాము సుప్రీంకోర్టులో కేసు వేశామని, కాబట్టి ఈ కేసు విచారణ జరపరాదని ఎన్‌సిటిఈ స్టాండింగ్ కౌన్సిల్ కె. రమాకాంత్‌రెడ్డి అభ్యర్థించారు. ఎన్‌సిటిఈ గుర్తింపు తమకు ఉందని, అయితే ఎన్‌సిటిఇ వెబ్‌సైట్‌తో తమ విద్యా సంస్థ లింక్ అవ్వాలంటే లక్షా యాభై వేల రూపాయలు చెల్లించాలనడం అన్యాయమని పిటిషనర్ల లాయర్లు వాదించారు. ఆ మొత్తం చెల్లింపు లేకుండా వెబ్‌సైట్‌తో లింక్ అయ్యే అవకాశం ఉందేమో తెలపాలని ఎన్‌సిటిఇ హైకోర్టు వివరణ కోరింది. ఎన్‌సిటిఈ చట్టం (1993) నిబంధన 8(3) సవరణపై ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో ఉపాధ్యాయ విద్యాసంస్థల కేసు విచారణ వచ్చే గురువారానికి వాయిదా పడింది. ఎన్‌సిటిఇ విధించిన అక్రిడేషన్ తీసుకోవాలన్న గడువు కూడా అదే రోజుతో ముగియనుంది.

అగ్రిగోల్డ్‌పై ఆధారాలున్నాయి!



మన తెలంగాణ/ హైదరాబాద్ : అగ్రిగోల్డ్ కంపెనీ జనం నుంచి చిన్న మొత్తాల్లో సేకరించిన డిపాజిట్లలో రూ.600 కోట్ల వరకు తమ అనుబంధ కంపెనీల్లోకి మార్చేసినట్లు ఆధారాలున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వకంగానే భారీ మొత్తాలను మళ్లించినట్లుగా తమ వద్ద ప్రాథమిక సాక్ష్యాలున్నాయని హైకోర్టు న్యాయమూర్తి తాళ్లూరి సునీల్ చౌదరి వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. తెలంగాణ, ఎపిల్లోని పలు స్టేషన్లల్లో నమోదైన కేసుల్లో తనకు సీఆర్‌పిసి 438 సెక్షన్ కింద బెయిల్ మంజూరు చేయాలని అగ్రిగోల్డ్, దాని అనుబంధ కంపెనీలకు డైరెక్టర్ , వైస్ చైర్మన్ అయిన ఎం. బానోజీరావు పలు పిటిషన్లను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. తాను కంపెనీలో కేవలం ఉద్యోగిని మాత్రమేనన్న భానోజీరావు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 13 కంపెనీల్లో డైరెక్టర్‌గా, వైస్ చైర్మన్‌గా ఉన్నారని, డైరెక్టర్ పదవిని 2011లో రెన్యువల్ చేసుకున్నట్లు కంపెనీ డైరెక్టరేట్ రికార్డులు చెబుతున్నాయని, తెలుగు రాష్ట్రాల పిపిల నివేదికలు కూడా స్పష్టం అవుతోందన్నారు.

టెక్సాస్‌లో జలవిలయం

జలదిగ్బంధంలో 200 మంది భారతీయ విద్యార్థులు, 50 అంగుళాల రికార్డుస్థాయి వర్షపాతం



హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ నగరంలో హరికేన్ హార్వే జలవిళయాన్ని సృష్టిస్తోంది. అమెరికాలో 13 ఏళ్ల తర్వాత ఇంత శక్తిమంతమైన తుఫాను ఇదే. వరదలకు 1కోటి 30లక్షల మంది కకావికలయ్యారు. రోడ్లపై నీటి ప్రవాహం ఉప్పొంగుతున్న నదులను తలపిస్తున్నాయి. ఈ హార్వే హరికేన్ పెను విధ్వంసాన్నే మిగులుస్తోంది. జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలు ఇంటిపై కప్పు ఎక్కి సాయం కోసం ఎదు రుచూస్తున్నారు. హూస్టన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకారం హూస్టన్ యూనివర్సిటీలో చదువుకుంటున్న 200 మంది భారతీయులు నీటి ముంపులో చిక్కుకున్నారు. యూనివర్సిటీ క్యాంపస్ జలదిగ్బంధంలో చిక్కుకుందని భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ సోమవారం తెలిపారు. భారతీయ విద్యార్థులకు సంబంధించిన మరింత సమాచారం ఇంకా అందాల్సి ఉందని ఆమె ట్వీట్ చేశారు. ఆసుపత్రిపాలైన విద్యార్థుల బంధువులకు మెరుగైన చికిత్స అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. హూస్టన్‌లోని భారతీయ దౌత్యాధికారి అనుపం రాయ్ సహాయక చర్యలు నిర్వహిస్తున్నారన్నారు. హూస్టన్ నగరంలో భారతీయులు గణనీయం ఉన్నారు. హార్వే హరికేన్ ఇప్పుడు ఉష్ణ మండలీయ తుఫాను(ట్రాపికల్ స్టార్మ్)గా మారి దక్షిణ టెక్సాస్‌లో భారీ వర్షాలు కురిపిస్తోంది. ఈ వర్షపాతం చివరికి 50 అంగుళాల తీవ్రకాగలదని అమెరికాలోని జాతీయ వాతావరణ కేంద్ర పేర్కొంది. టెక్సాస్‌లో ఇదే రికార్డు స్థాయి సర్వకాల అత్యధిక వర్షపాతంగా భావిస్తున్నారు. కురుస్తున్న వాన తీవ్రత ఊహాతీత స్థాయిలో ఉంది. వరదల ముప్పు పొంచి ఉంది. ఈ వానలు మరికొన్ని రోజులు కొనసాగగలవని వాతావరణ శాఖ పేర్కొంది. టెక్సాస్ నగరాన్ని శుక్రవారం తాకిన హార్వే హరికేన్ అతలాకుతలం చేస్తోంది. ఈ హరికేన్‌ను కేటగిరి 4 కింద గుర్తించారు. కేటగిరి 4 రకం తుపాను ఇదివరలో 2004లో ఫ్లోరిడాను తాకింది. ఇప్పటి వరకు మృతుల సంఖ్య ఐదనే తెలుస్తున్నప్పటికీ ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం టెక్సాస్ పర్యటించి పరిస్థితిని అంచనా వేయనున్నారు. మరికొద్ది రోజుల్లో హార్వే హరికేన్ మళ్లీ మెక్సికో గల్ఫ్‌లోకి ప్రవేశించనుంది. అక్కడ తేమను అందిపుచ్చుకుని గాల్వెస్టన్, హూస్టన్‌లోకి మళ్లీ కదలనుంది. కనీసం మరి నాలుగు రోజులైనా భారీ వానలు కురువనున్నాయని సిఎన్ఎన్ వాతావరణ శాస్త్రజ్ఞుడు కరేన్ మెగిన్నిస్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 250 నీటి విపత్తు సహాయక చర్యలు చేపట్టి 1000 మందికిపైగా రక్షించినట్లు అధికారులు చెప్పారు. అమెరికాలోని ప్రధాన చమురు శుద్ధి కర్మాగారాలను మూసేశారు. దీంతో రోజుకు 1 మిలియన్ బ్యారెల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. బిజిగా ఉండే హూస్టన్ షిప్ ఛానెల్‌ను కూడా మూసేశారు. హూస్టన్‌లో పాఠశాలలకు వారం రోజులపాటు సెలవు ప్రకటించారు. విలియం పి హబ్బీ విమానాశ్రయం నుంచి 500 మంది కష్టమర్లను సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్ విమానం ద్వారా తరలించింది. ఇది లా ఉండగా హరికేన్ హార్వేపై డొనాల్డ్ ట్రంప్ ఆదివారం రెండో క్యాబినెట్ సమావేశం నిర్వహించారని వైట్‌హౌస్ తెలిపింది.

కొండ చరియలు విరిగి ప్రమాదం



బీజింగ్: చైనాలో భారీగా కొండచరియలు విరిగిపడ్డ ప్రమాదంలో కనీసం ఇద్దరు మరణించారు. మరి 25 మంది గల్లంతయ్యారు. మొత్తం 34 కుటుంబాలు ఈ ప్రమాదంలో దెబ్బతిన్నాయి. ఆరుగురిని సహాయకులు రక్షించారు. వారిలో ఇద్దరు మరణించారు. బాధితులకోసం గాలింపు కొనసాగుతోంది. చైనాలోని గ్రామీణ పర్వత ప్రాంతాలలో కొండచరియలు విరిగి పడడం మామూలు. ఈ ప్రాంతంలో గత వారం 53ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రంగా హాతో తుఫాన్ సంభవించింది. తరువాత భారీ వర్షాలు కురియడంతో తాజా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

బ్రసెల్స్‌లో బ్రెగ్జిట్ చర్చలు పునఃప్రారంభం

బ్రసెల్స్ : యురోపియన్ యూనియన్(ఇయు) నుంచి బ్రిటన్ వైదొలిగే(బ్రెగ్జిట్) చర్చలు సోమవారం బ్రసెల్స్‌లో పునఃప్రారంభమయ్యాయి. భవిష్యత్ సంబంధాల గురించి లండన్ యోచిస్తోంది. కానీ నిష్క్రమించే ముందు స్పష్టత అవసరమని ఇయు అంటోంది. బ్రిటన్ నిష్క్రమణ ప్రక్రియ ఆరంభమై ఇప్పటికే రెండేళ్లు గడుస్తోంది. బ్రిటన్ ఎన్నికల కారణంగా ఈ చర్చలకు స్వల్పకాలం అంతరాయం ఏర్పడింది. బ్రిటన్ అస్పష్ట వైఖరిని అనుసరిస్తోందని జర్మనీ లాబీ విమర్శించింది. ఉపసంహరణ విషయంలో ఇంగ్లాండ్ స్పష్టమైన వైఖరి తీసుకోవాలని జర్మనీకి చెందిన డైటర్ కెంప్ఫ్ అన్నారు. బ్రెగ్జిట్ చర్చలపై బ్రిటన్ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తోంది. చర్చల్లో ఇయు మధ్యవర్తులు సరళతర విధానాన్ని అవలంభించాలని బ్రిటన్ బ్రెగ్జిట్ మంత్రి డేవిడ్ డేవిస అభిప్రాయపడ్డారు.

భారత్‌కు స్విస్ అధ్యక్షురాలు



న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు డోరిస్ ల్యూథార్డ్ వచ్చే బుధవారంనుంచి మూడు రోజులు భారత్‌లో పర్యటిస్తారు. ఆమె రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోడీని కలుసుకొని చర్చలు జరుపుతారు. విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ వివరాలు తెలిపింది. ఈ చర్చలలో భారతీయులు కొంత మంది స్విస్ బ్యాంకులలో దాచిన నల్ల డబ్బు విషయం చర్చకు రావచ్చు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం బలమై న ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. మన దేశానికి అది ఏడవ అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. అలాగే 11వ అతిపెద్ద విదేశీ పెట్టుబడి దేశం.

జర్మన్ మేల్ నర్స్‌కు యావజ్జీవ శిక్ష



బెర్లిన్ : రెండేళ్ల క్రితం ఆసుపత్రిలోని ఇద్దరు రోగులకు అధిక మోతాదు ఔషధాన్ని ఇచ్చి చంపడమేకాక, మొత్తంగా 90 మంది రోగులను చంపినందుకు జర్మనీ మేల్ నర్స్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. జర్మనీ యుద్ధానంతరం ఇంత పెద్ద ఎత్తున ఊచకోత ఇదేనని పోలీసులు చెప్పారు. బ్రెమన్ నగర సమీపంలోని డెల్‌మెన్‌హోర్స్ట్ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్న రోగులకు శారీరకంగా హానీ కలిగించి హతమార్చేందుకు పూనుకున్నందుకు నీల్స్ హేగెల్స్(40)ను రెండు హత్యా అభియోగాలు, నాలుగు హత్యాయత్న అభియోగాలపై 2015లోనే జైలులో వేశారు. అతడు 1999 నుంచి 2005 మధ్య కాలంలో అత్యధిక రోగుల చావులకు అతడే కారణమని ఫోరెన్సిక్ 130 మృత దేహాలు విశ్లేషించి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అతడు కనీసం 90 మందినైనా హత్య చేసి ఉంటాడన్న నిర్ధారణకు వచ్చారు. గుండె ఆగిపోయే ఔషధాలను రోగులకు ఇచ్చినట్లు అతడు విలేకరుల ముందు ఒప్పుకున్నాడు. వైద్య కోణంలో కాకుండా వారికి బాధల నుంచి విముక్తి కలిగించేందుకే తానలా చేశానన్నాడు.

నంద్యాల ఓటర్ల 'బ్రహ్మ'రథం

ఉప ఎన్నికలో టిడిపి ఘన విజయం, భూమా బ్రహ్మానందరెడ్డికి అనూహ్యా మెజారిటీ





నంద్యాల: ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లా నంద్యాల నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించారు. 17 రౌండ్లు ముగిసేసరికే టిడిపి విజయం ఖాయమైంది. ఇంకా రెండు రౌండ్ల లెక్కింపు ఉండగానే 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన భూమా బ్రహ్మానంద రెడ్డి, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డిపై విజయం సాధించారు. ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచీ స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగిన టిడిపి, అదే హవాను చివరి వరకు కొనసాగించింది. 19 రౌండ్ల లెక్కింపు ముగిసేసరికి 27,466 ఓట్ల ఆధిక్యం టిడిపి లభించింది. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి 97,076 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి 69,610 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు కేవలం 1382 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉప ఎన్నిక ఫలితాల్లో ఘనవిజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాలలో ప్రజాతీర్పును తాము గౌరవిస్తామని వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అన్నారు. నంద్యాల ఓటర్లు అభివృద్ధికి ఓటేశారని తాము అనుకోవ డంలేదని, అధికార పార్టీ భారీగా డబ్బులు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసిందని ఆరోపించారు. ఫలితాల సరళిని బట్టి చూస్తే కాస్త సానుభూతి కూడా పనిచేసినట్లు తెలుస్తోందన్నారు. భూమా కుటుంబం, టిడిపి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే నంద్యాల ప్రజలు తమకు పట్టం కట్టారని మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. నంద్యాలలోని ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ 'టిడిపికి డి పాజిట్ కూడా రాదని వ్యాఖ్యలు చేసిన వారికి ఈ ఫలితం చెంపపెట్టు లాంటిది. మాపై నమ్మకంతో ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నంద్యాలను అభివృద్ధి చేస్తాం. మంత్రిగా బాధ్యతలు పెరగడంతో రాయలసీమ అభివృద్ధికి కృషి చేసి నా తండ్రి ఆశయాలను నెరవేస్తా' అని అన్నారు.

అభివృద్ధికి ప్రజా తీర్పిది : చంద్రబాబు


అభివృద్ధి, సంక్షేమానికి నంద్యాల ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అపూర్వ విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు టిడిపిని ఆదరించారని ఈ విజయం అభివృద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. నంద్యాలలో జగన్ 15 రోజుల పాటు బస చేసి ప్రలోభాలకు పాల్పడినా, ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చేయాలి, ఉరి తీయాలి అని జగన్ చేసి వ్యాఖ్యలు ప్రజల్లో ఆందోళన కలిగించాయని ఆయన చెప్పారు. నంద్యాల ఫలితం రాబోయే ఎన్నికలకు నిదర్శనమని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు.సంక్షేమానికి పెద్దపీట వేస్తాం, అవినీతిని నిర్మూలించి ప్రజలు మెచ్చుకునే పాలన అందించి టిడిపిని శాశ్వతంగా అధికారంలో ఉండేలా చేస్తామని చంద్రబాబు అన్నారు.


టిడిపి అధికార దుర్వినియోగం: జగన్


ఎపి కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైసిపి అధినేత, ఆ రాష్ట్ర ప్రతిపక్ష నేత జగన్ ఆరోపించారు. నంద్యాల ఉపఎన్నిక ఫలితంపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నిక కోసం టిడిపి కనీసం రూ.200కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. టిడిపి నేతలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని, ఇంటింటికీ వెళ్లి తమ పార్టీకి ఓటేయకపోతే ఫించన్ ఇవ్వమని బెదిరించారని, ఏకంగా వైసిపి అభ్యర్థిపైనే దాడికి యత్నించారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. అధికార పార్టీ నేతలు అంతగా బెదిరింపులకు పాల్పడినా ప్రజలు ధైర్యంగా తమ ఓటుహక్కును వినియోగించు కోవడం అభినందనీయమని అని జగన్ చెప్పారు.


నైజీరియన్ల లాటరీ మోసం

- రూ.22 లక్షలు సమర్పించుకున్న బాధితులు
- నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు










మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : నైజీరియన్లు వేసిన లాటరీ ఉచ్చులో నగరానికి చెందిన ఓ డాక్టర్ బోల్తాపడ్డాడు. రూ.4.5 కోట్ల లాటరీ వచ్చిందనగానే పన్నుల రూపంలో రూ.22 లక్షలు ముందుగానే అప్పగించుకున్నాడు. తీరా ఇది నైజీరియన్ల మోసమని తెలుసుకున్న బాధితులు చేసేది లేక పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో నలుగురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నివాసముంటున్న ఓ డాక్టర్‌కు నెల రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌కు ఒక ఎస్ఎమ్ఎస్ వచ్చింది. అందులో తనకు రూ.4.5 కోట్లు లాటరీలో గెలుచుకున్నావని ఉంది. ఈ డబ్బులు రావడానికి మెసేజ్‌లో ఉన్న ఓసెల్‌నెంబర్‌కు సదరు డాక్టర్ ఫోన్ చేశాడు. మీకు వచ్చిన మెసేజ్ నిజమైనదే అయితే ఆ డబ్బులు మీ చేతికి అందాలంటే వివిధ ప్రభుత్వ శాఖలకు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని నైజీరియన్స్ నమ్మబలికారు. అయితే తాము సూచించిన బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయాలని చెప్పడంతో సదరు డాక్టర్ వారి ఖాతాలో దశలవారీగా మొత్తం రూ.22 లక్షలు జమ చేశాడు. ఆ తరువాత కూడా తనకు రావాల్సిన రూ.4.5 కోట్ల లాటరీ సొమ్ము తన బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుల ఫోన్ నెంబర్ ఆధారంగా ఢిల్లీలో నివాసముంటున్న నైజీయన్ దేశస్థులైన గౌజ్ ఆరిసి టిడె, ఎర్క్ టౌచుకు, టౌచుకు, నగెసియా నిందితులని గుర్తించారు. ఈ నలుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తండాలో శిశు విక్రయం...?

మనతెలంగాణ/చేగుంట : మండల పరిధిలోని చెట్ల తిమ్మాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పులిగుట్ట తండాలో ఆడశిశువును విక్రయించినట్లు ఐసిడిఎస్ అధికారులు సోమవారం రాత్రి చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామయంపేట ఐసిడిఎస్ అధికారి లక్ష్మి నర్సమ్మ పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం చెట్ల తిమ్మాయిపల్లి పులిగుట్ట తండాకు చెందిన పద్మను వెల్దుర్తి మండలం రామంతపురం గ్రామానికి చెందిన బస్సీతో వివాహం జరిగింది. బస్సీ ఉపాధి కోసం కామారెడ్డి వెళ్లి మరోవివాహం చేసుకోవడంతో పద్మ తల్లిగారి ఇంటివద్ద పులిగుట్ట తండాలో ఉంటుంది. పద్మకు ఇదివరకే ఇద్దరు కూతుళ్లు ఉండగా 11 మే నెలలో మరోపాప పుట్టింది . ఇటీవల నెల రోజుల క్రితం పద్మ తల్లి అల్లుడుతో కలసి చిన్న పాపను ఆసుపత్రికి తీసుకెళుతామని పాపను అమ్మివేశారు. పాపను ఏం చేశావని తల్లితో పాటు భర్తను పద్మ ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చిన పద్మ మెదక్‌లో ఐసిడిఎస్ అధికారులకు ఈ నెల 21న ఫిర్యాదు చేశారు. పద్మ ఫిర్యాదుతో స్పందించిన ఐసిడిఎస్ అధికారి లక్ష్మి నర్సమ్మ చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా పులిగుట్ట తండాకు చెందిన పద్మను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా శిశువును తూప్రాన్‌లో అమ్మినట్లు తెలుసుకున్న పోలీసులు పూర్తి వివరాలకు కోసం తూప్రాన్ వెళ్లారు.



మన వ్యవసాయం



మిరపలో తెగుళ్ళు



తెలుగు రాష్ట్రాల్లో మిరప పంట 1.35 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయబడుతూ ఏటా 7.4 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధిస్తూ.. భారతదేశంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న మిర్చి పంటలో నాలుగో వంతు ఉత్పత్తి చేస్తున్న తెలుగు రాష్ట్రాలు ఎగుమతులలో కూడా ప్రథమ స్థానంలో ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో మిరపను వైరస్ తెగుళ్ళు ఆశించడం వల్ల రైతులు ఎక్కువ నష్ట పోవడం జరుగుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ప్రతిఏటా కొత్త వంగడాలు సాగులోకి రావడం, పంట మార్పి డి పాటించకపోవడం, సేంద్రియ ఎరువులు వాడకుండా కేవలం రసాయన ఎరువులు మీద ఆధారపడటం, విచక్షణ రహితంగా పురుగు, తెగులు మందులు వాడడం మొదలైన కారణాలు తెగుళ్ళ ఉధృతి ఎక్కువవడానికి కారణమవుతున్నాయి. శిలీంద్రాలు, బాక్టీరియా ద్వారా వచ్చే ఇతర తెగుళ్ళ వలే వైరస్ తెగుళ్ళ నివారణకు ప్రత్యేకమైన మందులు లేవు. రైతులు తెగులు ఆశించిన తర్వాత సస్య రక్షణ చర్యలు చేపట్టడంతో ఏ ప్రయోజనం లేదు. సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టుట ద్వారా మాత్రమే వైరస్ ఉధృతిని తగ్గించుకొని పంట నష్టపోకుండా కాపాడుకోవచ్చు. పంటకు కలిగే నష్టం పంటను వైరస్ ఏ దశలో ఆశిస్తుందన్న దానిపై ఆధారపడి ఉంటుంది. తెగులు పంట తొలి దశలో అంటే పూత దశకు ముందు ఆశిస్తే ఆ పొలంలో మనకు దిగుబడి శూన్యం. కాయదశలో ఆశిస్తే కొంత దిగిబడి వస్తుంది. 6 సంవ త్సరాలుగా వైరస్ తెగుళ్ళ వల్ల మిరప పంటకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం మిరప పంటను మిరప ఆకుముడత తెగులు, కుకుంబర్ తెగులు, మొవ్వకుళ్ళు తెగులు మూడు రకాల తెగుళ్ల పంటను సోకుతున్నాయి.

ఆకుముడత తెగులు

మిరపనాశించే తెగుళ్ళలో ఆకుముడత లేదా బొబ్బర తెగులు ప్రధానమైనది. ఇది తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కలలో ఆకుల మీద బొబ్బలు బొబ్బలుగా ఏర్పడి పైకి ముడుచుకొని దొప్పలుగా మారతాయి. ఈనెలు ఉబ్బి ఆకుపచ్చగా ఉండి, ఈనెల మధ్యభాగం లేత ఆకుపచ్చగా గాని లేత పసుపు రంగుగా ఉంటుంది. మొక్కలు ఎదుగుదల తగ్గి గిడసబారతాయి.

కుకుంబర్ మొజాయిక్ తెగులు

ఇది పేనుబంక ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించినప్పుడు సాగుతాయి. పత్రహరితం కోల్పోయి మొజాయిక్ లక్షణాలు కనబరుస్తాయి. ఎదుగుదల లోపిస్తుంది.

మొవ్వకుళ్ళు తెగులు

ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ ఆశించినప్పుడు మొవ్వ లేదా చిగురు భాగం ఎండిపోతుంది. కాండం మీద నిర్ధిష్ట ఆకారం లేని నల్లని నెక్రోటిక్ మచ్చలు ఏర్పడి క్రమేణా చారలుగా మారి చిగురు భాగం వరకు వ్యాప్తి చెందుతాయి. ఆకులు, కాయల మీద పసుపు పచ్చని వలయాలు ఏర్పడి క్రమేపి పండుబారి రాలిపోతాయి. వేరు వ్యవస్థ వృద్ధి ఆగిపోతుంది. వైరస్ తెగుళ్ళు రసంపీల్చే పురుగులైన తెల్లదోమ, పేనుబంక, తామర పురుగుల ద్వారా ఈ తెగులు సంక్రమిస్తుంది.

శ్రీనివాస్‌రెడ్డి పులసాని, రిపోర్టర్
ఫోన్ : 9010385659



సస్యరక్షణ పద్ధతులు

- వైరస్‌ను తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి.
- తెగుళ్ళు రసంపీల్చే పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతాయి. కాబట్టి మొక్క తొలిదశలో పురుగు, తెగుళ్ళ నుంచి కాపాడుకోవడానికి, ఆరోగ్యమైన నారు సాధించుటకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. ఒక కిలో విత్తనానికి 10మి.లీ. ఇమిడాక్లోప్రైడ్ అనే మందును పట్టించి 15 నిమిషాల నీడలో అరబెట్టాలి. తర్వాత విత్తనం ద్వారా వ్యాపించే బూజు తెగుళ్ళ నివారణకు 3 గ్రా. మాంకోజెట్ ఒక కిలో విత్తానానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి.
- సిఫారసు చేసిన రసాయన ఎరువులతో పాటు సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులను భూమిలో వేసి ఎరువుల సమతుల్యత పాటించాలి. అప్పుడు మొక్కకు కావలసిన పోషకాలు సమపాళ్ళలో అంది మొక్కలు ఆరోగ్యంగా దృఢంగా పెరిగి రోగనిరోధక శక్తి కలిగి ఉంటాయి.
- ఎకరానికి 200 కిలోల చొప్పున భూమిలో వేపపిండి వేయాలి.
- పొలం గట్ల మీద, రోడ్లపక్కన సహజంగా మొలుచు కలుపు మొక్కలను నిర్మూలించాలి. వీటిపైనా వైరస్‌ను స్థిరపడి మిర్చి పంటను ఆశిస్తాయి. కాబట్టి ఎప్పటికప్పుడు కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలి.
- పొలం చుట్టూ 23 వరుసల్లో రక్షక పంటగా జొన్న, మొక్కజొన్న వేయాలి.
- పురుగులు దూరని పాలీహౌస్, షెడ్ నెట్‌లో రసం పీల్చే పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. అవకాశం ఉంటే వీటిల్లో నారు పెంచి సత్ఫలితం పొందవచ్చు.
- పైరులో ఎక్కడైనా వైరస్ సోకిన లక్షణాలు గల మొక్కలు కనిపిస్తే తక్షణం వాటిని నిర్మూలించాలి.

అర్జున అవార్డును ఊహించలేదు!


- భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ: క్రీడారంగంలో అద్భుత ప్రదర్శన కనబర్చే క్రీడాకారులకు ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డును తాను గెలుచుకుంటానని ఎప్పుడూ ఊహించ లేదని భారత మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ తన మనసులోని మాటను బయటపెట్టింది. మహిళల ప్రపంచ కప్ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిం ది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలో హర్మన్‌ప్రీత్ పేరును ప్రతిపాదించగా, ఎంపికైన క్రీడాకారులంతా మంగళ వారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదు గా అర్జునా అవార్డును అందుకోనున్నారు. నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్‌సెర్చ్ పోర్టల్‌ను ప్రారంభిం చిన సందర్భంగా కౌర్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఒక క్రీడాకారుడికి ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించడం స్వాగతిం చదగిన విషయం. దీంతో క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది. ఈ అవార్డు పొంద డమనేది ప్రతి క్రీడాకారుడికి ఓ కల లాంటింది. ప్రభుత్వానికి నా కృతజ్ఞ తలు. ఈ అవార్డుకు నేను అర్హురాలిగా గుర్తించి ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇదే ప్రోత్సాహంతో భవిష్యత్తులో బాగా రాణిం చేందు కు కృషి చేస్తాను. త్వరలో భారత్‌లోనూ మహిళల ఐపిఎల్ లీగ్ ప్రా రంభం అయితే బాగుంటుందని తెలిపింది. ఆస్ట్రేలియాతో జరిగిన మహి ళల ప్రపంచకప్ సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ 171 పరుగుల సునామీ సృష్టించి భారత్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించింది. ఈ ఏడాది జరిగిన మహిళల బిబిఎల్‌లో ఆడిన కౌర్.. ప్రపంచ కప్ సమయంలో భుజా నికి గాయం కావడంతో కియా సూపర్ లీగ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.



అర్జున అవార్డు అందుకోలేను: పుజారా

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డుల ప్రధానోత్స వానికి తాను హాజరుకాలేకపో తున్నానని భారత క్రికెటర్ చతే శ్వర పుజారా సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'ఇం గ్లాండ్‌లోని నాటింగమ్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్‌తో ఒప్పందం కారణంగా మ్యాచ్‌లు ఆడేందుకు వెళ్తున్నాను. దాంతో అవార్డును అందు కోలేకపోతున్నాను. అర్జున అవార్డుకు నాకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని, ఆటకు తగిన గుర్తింపు లభించడం ఎంతో గొప్ప విషయం కూడా. విజయాలు సాధించడంలో సంవత్సరాలుగా ఇస్తున్న ప్రోత్సాహనికి కృతజ్ఞ తలు' అని అన్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో పుజారా 309 పరుగులు సాధించి 77.25 తో రెండు సెం చరీలను నమోదు చేశా డు. ఇటీవల ఈ ఏడాదికిగాను 17 మంది అర్జున అవార్డులను కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. అవార్డుకు ఎంపిక చేసిన క్రీడాకారులకు మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందజేయనున్నారు.



ఐపిఎల్ ఈ-వేలానికి నో

- ప్రసార హక్కుల ఆదేశాలు ఇచ్చేందుకు సుప్రీం తిరస్కరణ
- బిజెపి ఎంపి సుబ్రమణ్యన్ స్వామి వ్యాజ్యాన్ని కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్ల వరకు టి20 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) మీడియా ప్రసార హక్కుల కోసం ఇటీవల బిసిసిఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) టెండర్లు ఆహ్వానించిన నేపథ్యంలో ఐపిఎల్ మీడియా హక్కులను ఈ వేలం వేసేలా ఆదేశిలిచ్చేందుకు సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఐపిఎల్ ప్రసార హక్కులను ఈ వేలం ద్వారా నిర్వహించాలని ప్రముఖ రాజకీయ నేత, ఎంపి సుబ్రమణ్యన్ స్వామి సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని వేశారు. కానీ, సుప్రీంకోర్టు నియమించిన వినోద్ రాయ్ నేతృత్వంలోని బిసిసిఐ పాలకుల కమిటీ (సిఎసి) మాత్రం ఈ వేలానికి బదులుగా సాధారణ వేలాన్నే నిర్వహించాలని సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎమ్ ఖన్విల్కర్, డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం బిజెపి నేత స్వామి వ్యాజ్యాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

వచ్చే ఏడాది నుంచి ఐపిఎల్ మ్యాచ్‌లు ప్రారంభంకానుండగా, మీడియా హక్కులు 2018 నుంచి 2022 వరకు ఐదేళ్ల పాటు కాలపరిమితి ఉంటుం ది. బిసిసిఐ పాలకుల కమిటీ తరపున సీనియర్ న్యాయ వాది పరాగ్ త్రిపాఠి ధర్మాసనానికి వివరించారు. టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో ఐపిఎల్ మీడియా హక్కులను మూడు విభాగాలు (టెలివిజన్, మొబైల్, ఇం టర్‌నెట్)గా కేటాయించగా, దీనికి సంబంధించి బిడ్లు దాఖలు చేసేందుకు సెప్టెంబర్ 4 వరకు అఖరి తేదీగా ప్ర కటించారు. మీడియా హక్కులను దక్కించుకునేందుకు 24కు పైగా మీడియా సంస్థలు సీల్డ్ కవర్‌లో బిడ్లును దా ఖలు చేయనున్నారని, ప్రసార హక్కులు ఎవరికి కట్ట బెట్టాలో తేల్చేందుకు ఇదే మంచి ప్రత్యామ్నాయమని కో ర్టుకు విన్నవించారు. మీడియా హక్కుల కోసం ఈ వేలం నిర్వహిస్తే బిసిసిఐ 360 నుంచి 700 కోట్ల వరకు నష్ట పోవాల్సి వస్తుందని బిసిసిఐ, సిఒఎ వాదించింది. బిసిసిఐ వర్గంలో ఒకరికి న్యూస్ ఛానెల్ ఉందని, ఈ నేపథ్యంలో దీనిపై మధ్యంతర వ్యాజ్యాన్ని దాఖలు చేయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. దీంతో సుప్రీం ధర్మాసనం అందుకు అంగీకరించింది.



క్వార్టర్ ఫైనల్లో అమిత్, గౌరవ్

- 19వ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

హాంబర్గ్ : జర్మనీలో జరుగుతున్న 19వ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో శుభారంభాన్ని అందించిన భారత బాక్సర్లు ఆసియన్ కాంస్య పతక విజేత అమిత్ ఫంగల్ (49కెజిలు) బౌట్ విభాగంలో, గౌరవ్ బిధూరి (56కెజిలు) బౌట్ విభాగంలో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. మరోవైపు కాంస్య పతక విజేత మూడో సీడ్ వికాస్ క్రిష్ణన్ (75కెజిలు) బౌట్ విభాగంలో రెండో రౌండ్‌లో నిష్క్రమించాడు. ప్రీక్వార్టర్‌ఫైనల్లో వరుస పంచ్‌లు విసరిన అమిత్ ఏడో సీడ్ కార్లోస్ క్విపో (ఈక్వెడర్)పై విజయం సాధించగా, గౌరవ్ మైకోలా బుట్స్‌నెక్కో (ఉక్రేనియన్)కు షాక్ ఇచ్చాడు. 2011 నుంచి కాంస్య పతక విజేతగా వికాస్ బెంజమిన్ విట్టేకర్ పంచ్‌లకు తలొగ్గాడు. ఆసియన్ రజత పతక విజేత సుమిత్ సాంగ్వన్ (91కెజి) విభాగంలో



జాసన్ వాట్లే (ఆస్ట్రేలియా)ను ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. క్వార్టర్స్‌లో అమిత్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. రెండోసీడ్‌గా బరిలోకి దిగనున్న హసన్‌బోయ్ దుస్మితొవ్ (ఉజ్బెక్)తో 21 ఏళ్ల అమిత్ తలపడనుండగా, గౌరవ్ బెలెల్ మిద్దితో (తునిసియా)తో తలపడనున్నాడు.

భారత బాక్సర్లు అమిత్, గౌరవ్ ఇద్దరూ తమ ప్రత్యర్థులను పదునైన వరుస పంచ్‌లతో కంగుతినిపించారు. అమిత్ మాత్రం తన ప్రత్యర్థి క్విపోకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పదేపదే తన పంచ్‌లతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. అమిత్ పంచ్ దెబ్బలకు కంగుతిన్న క్విపో చేతులేత్తేయ డంతో పంగల్‌ను జడ్జీలు విజేతగా ప్రకటించారు. మరోవైపు గౌరవ్ కూడా అదే స్థాయిలో దూకుడుగా ప్రత్యర్థిపై పంచ్‌లు విసిరి అద్భుత ప్రదర్శనతో క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. భారత బాక్సర్ గౌరవ్ మాత్రం టోర్నమెంట్ ప్రారంభంలో ఆసియా చాంపియన్‌షిప్ క్వార్టర్‌ఫైనల్లో అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. దీంతో నేరుగా అర్హతను సాధించలేకపోయిన ఢిల్లీ బాక్సర్ గౌరవ్ వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా ఆసియా బాక్సింగ్ సమాఖ్యలో చోటు సంపాదించాడు. ఈ ఏడాది ప్రపంచ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ నుంచి 250 మంది బాక్సర్లు పోటీపడుతుండగా, అనూహ్యంగా మెగా ఈవెంట్‌కు ఎని మిమంది సభ్యుల బృందానికి భారత్ పంపింది. ఇటీవల ఉజ్బేకిస్తాన్ రాజధాని తాష్కెంట్ నగరంలో జరిగిన ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు చాలామంది భారత బాక్సర్లు పోటీపడ్డారు.

గెలుపు సూత్రాన్ని మరిచాం : కపుగెదెర

పల్లెకెలె: శ్రీలంక జట్టు మ్యాచుల్లో గెలిచే నైపుణ్య సూత్రాన్ని మరిచిందని ఆ జట్టు తాత్కాలిక కెప్టెన్ చమరా కపుగెదెర ఆవేదన వ్యక్తం చేశాడు. లంక ఓట మికి తన జట్టే బాధ్యత వహించాల్సి ఉంటుంద ని అభిప్రాయపడ్డాడు. నాల్గో వన్డేలోనైనా తమ జట్టు బలహీనతలను అధిగమించేలా ముందు కు సాగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పాడు.ఐదు వన్డేల మ్యాచ్‌లో భాగంగా మూడో వన్డేలో 6 వి కెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచిన భారత్.. వరు సగా మూడు వన్డేల్లో లంక జట్టును చిత్తుగా ఓడించి 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం మీడి యాతో కపుగెదెర మాట్లాడుతూ.. 'బయట నుం చి ఎలాంటి సమస్యల్లేవు. కానీ, విజేత సూత్రా న్ని అమలు చేయడంలో మేం విఫలమైయ్యా మని అనిపిస్తుంది. ఇలాంటి పరాభవమే చాలా జట్టుకు జరగడాన్ని చూశాను. ఒక జట్టు ఓడిపోతున్నా, గెలుపుకు చేరువలో ఉన్నప్పటికీ అవరోధాన్ని దాటి వెళ్లలేదు. మా జట్టు కూడా విజయ సూత్రాన్ని మరిచింది. కానీ, మేం గెలవడానికి మ్యాచ్ మిగిలే ఉంది. అక్కడి నుంచే విజయానికి పునాది వేస్తాం. గాడిలో పడేందుకు జట్టు సభ్యులంతా పునరులోచించాల్సి ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమి ఎదురైనా, బౌలింగ్‌లో బాగానే రాణించాం. బౌలింగ్‌లో చాలా మెరుగైన ప్రదర్శన కనబడింది. లంక బ్యాట్స్‌మన్ కూడా జట్టును ఆదుకోవాల్సిన అవసరం ఉంది. అదేగాని జరిగితే గెలుపు ఖాయం' అని విశ్వాసం వ్యక్తం చేశాడు.



సింధుకు, సైనాకు నగదు బహుమతి

- భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) ప్రకటన

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు సాధించిపె ట్టిన భారత షట్లర్లు పి.వి. సింధు, సైనా నెహ్వాల్‌కు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నగదు బహుమతిని ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం బాయ్ తాత్కాలిక అధ్యక్షుడు హిమంత బిస్వా శర్మ రజత పతకం సా ధించిన సింధుకు రూ. 10 లక్షలు, కాంస్య పతకం సాధించిన మరో షట్లర్ సైనా నెహ్వాల్‌కు రూ. 5లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. గాస్గోలో జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో వీరద్దరూ అద్భుత ప్రద ర్శనతో పోరాడి ఓడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శర్మ మీడియాతో మాట్లాడుతూ.. అపూర్వమైన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న భారత్ తొలిసారి రెండు పతకాలు సాధించి రికార్డు సృష్టించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తుదిపోరులో పోరాడి ఓడిన మన క్రీడాకారులు చివరి ప్రయత్నంలో సాధ్యమైనంత వరకు సమర్ధవంతంగా నెట్టుకరాగలిగారు. సింధు, సైనాకు నా అభినందనలు. పతకాలు





సాధించడంలో వీరద్దరికి ప్రో త్సాహం అందించిన శిక్షణ సిబ్బందికి కూడా అభినందనలు తెలుపుకుంటు న్నాను' అని చెప్పారు. జపాన్‌కు చెందిన నొజొమి ఒకుహరతో గంట 50 నిమిషాలపాటు జరిగిన తుదిసమరంలో సింధు పరాయజం పాలైంది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.